# వార్తాప్రభ

RNI No. APTEL/2004/12176

epaper : https://varthaprabha.com

సమగ్ర వార్తా దినపత్రిక

విజయవాడ, హైదరాబాద్ నుండి ప్రచురణ

పార్లమెంట్ హౌస్ లో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ని కలిసి ఆగస్ట్ 1వ తేదీన జరిగే అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభోత్సవానికి ఆహ్వానించిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు

**-న్యూఢిల్లీ,జూలై 22 (వార్తాప్రభ) :**


| విజయవాడ | సంపుటి : 25 | సంచిక : 103 | దినం : 23-7-2026 | గురువారం | పేజీలు : 8 | వెల : రూ.1/- |
|---|---|---|---|---|---|---|
| VIJAYAWADA | Vol.No : 25 | Issue No : 103 | Date : 23-7-2026 | Thursday | Pages : 8 | Rs.1/- |


# భూ రికార్డుల శాశ్వత భద్రతకు బ్లాక్‌చెయిన్

- రేపు సీఎం చంద్రబాబు చేతుల మీదుగా 'మీభూమి--బ్లాక్‌చెయిన్' పైలట్ ప్రాజెక్ట్ ప్రారంభం
- 7 జిల్లాల పరిధిలోని 7 మండలాల్లో పైలట్ ప్రాజెక్ట్ అమలు
- భూ రికార్డులకు 'సింగిల్ సోర్స్ ఆఫ్ ట్రూత్'గా మీ భూమి-బ్లాక్ చెయిన్ ప్రాజెక్ట్
- భూ మోసాలకు చెక్... వేగవంతమైన, పారదర్శక సేవలే లక్ష్యం



**అమరావతి, జూలై 22 (వార్తాప్రభ) :** భూ రికార్డుల నిర్వహణలో సాంకేతిక విప్లవానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం శ్రీకారం చుడుతోంది. రెవెన్యూ, సర్వే, రిజిస్ట్రేషన్ శాఖల్లో విడివిడిగా ఉన్న భూ సమాచారాన్ని ఒకే వేదికపైకి తీసుకువస్తూ, రాష్ట్రంలోని భూ రికార్డులకు సింగిల్ సోర్స్ ఆఫ్ ట్రూత్‌గా నిలిచే 'మీభూమి--బ్లాక్ చెయిన్' వ్యవస్థను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వర్చువల్‌గా ప్రారంభించనున్నారు. గురువారం మధ్యాహ్నం రాష్ట్ర సచివాలయంలో ఈ కార్యక్రమం జరగనుంది. కర్నూలు, చిత్తూరు, బాపట్ల, కృష్ణా, తూర్పు గోదావరి, పార్వతీపురం మన్యం, విజయనగరం జిల్లాల కలెక్టర్లు వర్చువల్‌గా ఈ కార్యక్రమంలో పాల్గొంటారు. ప్రస్తుతం వెబ్‌ల్యాండ్ ద్వారా భూ రికార్డులు డిజిటలైజ్ అయినప్పటికీ, రెవెన్యూ, సర్వే, రిజిస్ట్రేషన్ శాఖల్లో సమాచారం వేర్వేరుగా ఉండటం వల్ల డేటా వ్యత్యాసాలు, రికార్డుల్లో మార్పులను గుర్తించడంలో సమస్యలు ఎదురవుతున్నాయి. ఈ సమస్యలకు శాశ్వత పరిష్కారంగా మీ భూమి--బ్లాక్ చెయిన్ వ్యవస్థను రూపొందించారు. ఆంధ్రప్రదేశ్, ఎన్ ఐ సి బెంగళూరులోని సెంటరాఫ్ ఎక్స్ లైన్స్ ఇన్ బ్లాక్ చెయిన్ టెక్నాలజీ సంస్థలు సంయుక్తంగా హైపర్ లెడ్జర్ ఫ్యాబ్రిక్ టెక్నాలజీతో ఈ వ్యవస్థను అభివృద్ధి చేశాయి. ఈ వ్యవస్థలో ప్రతి భూ పార్సెల్‌కు ప్రత్యేక బ్లాక్‌చెయిన్ గుర్తింపు కల్పిస్తారు. ప్రతి లావాదేవీ టాంపర్-ప్రూఫ్, సెక్యూర్‌గా జరగనుంది. భూ రికార్డుల్లో ఎలాంటి మార్పు చేయాలన్నా ప్రభుత్వం నిర్దేశించిన ఆన్‌లైన్ సేవల ద్వారానే ఇకపై సాధ్యమవుతుంది. ఒక భూ పార్సెల్‌కు సంబంధించిన అన్ని రకాల లావాదేవీలు, వాటి ప్రతి వెర్షన్స్‌తో సహా శాశ్వతంగా నమోదయ్యేలా వ్యవస్థను తీర్చిదిద్దారు. ఇక ప్రతి లావాదేవీని ఏ అధికారి, ఎప్పుడు నిర్వహించారనే వివరాలు కూడా శాశ్వతంగా రికార్డుల్లో ఉంటాయి. రికార్డుల్లో ఏమైనా వ్యత్యాసం ఉంటే లావాదేవీ వెంటనే ఆగిపోయేలా వ్యవస్థను రూపొందించారు. రెవెన్యూ, సర్వే, రిజిస్ట్రేషన్ శాఖలను ఒకే వేదికపైకి తీసుకువస్తున్న ఈ వ్యవస్థలో ప్రస్తుతం ఆటో మ్యూటేషన్, సబ్-డివిజన్, ఎక్స్‌టెంట్ కరెక్షన్ సహా ఎనిమిది పౌర సేవలు అందుబాటులోకి వస్తున్నాయి. వ్యవసాయం, మత్స్యశాఖ, గనులు, పరిశ్రమలు, విద్యుత్ శాఖ, సీఆర్‌డీఏ, ఆర్థిక సంస్థలు వంటి విభాగాలు కూడా అవసరమైన మేరకు ఈ సమాచారాన్ని వినియోగించుకునే అవకాశాన్ని కల్పించారు. మొదటి దశలో కర్నూలు, చిత్తూరు, బాపట్ల, కృష్ణా, తూర్పు గోదావరి, పార్వతీపురం మన్యం, విజయనగరం జిల్లాల పరిధిలోని అస్పరి, పెనుమూరు, రేపల్లె, గన్నవరం, కడియం, గుమ్మలక్ష్మీపురం, కొత్తవలస మండలాల్లో ఈ పైలట్ ప్రాజెక్టుగా అమలు కానుంది. ఈ పైలట్ ప్రాజెక్టులో 89 రీ-సర్వే గ్రామాలు, 1,37,763 ల్యాండ్ పార్సెల్ మ్యాప్‌లు కవర్ అవుతున్నాయి.

# ధర్మేంద్ర ప్రధాన్‌ను బర్తరఫ్ చేయండి ప్రధాని మోదీకి సీఎం రేవంత్ రెడ్డి డిమాండ్

- ప్రధాని మోదీ జోక్యం చేసుకుని ప్రధాన్‌ను బర్తరఫ్ చేయాలని విజ్ఞప్తి
- యువత హక్కుల కోసం కాంగ్రెస్ పార్టీ పోరాటం కొనసాగిస్తుందని స్పష్టీకరణ
- ధర్మేంద్రను తొలగించకుంటే మోదీ రాజీనామా చేయాలన్న ముఖ్యమంత్రి

**హైదరాబాద్,జూలై 22 (వార్తాప్రభ) :** నీట్ పేపర్ లీకేజీ వివాదంపై కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌ను తక్షణమే పదవి నుంచి బర్తరఫ్ చేయాలని తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి డిమాండ్ చేశారు. ఈ విషయంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వెంటనే స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. యువత హక్కుల పరిరక్షణ కోసం కాంగ్రెస్ పార్టీ తన పోరాటాన్ని నిరంతరం కొనసాగిస్తుందని ఆయన స్పష్టం చేశారు. ధర్మేంద్ర ప్రధాన్‌ను బాధ్యతల నుంచి తొలగించలేకపోతే, ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన పదవికి రాజీనామా చేయాలని రేవంత్ రెడ్డి డిమాండ్ చేశారు. మోదీని గద్దె దించి రాహుల్ గాంధీని ప్రధానమంత్రిని చేసేందుకు తన నియోజకవర్గం నుంచే ప్రతిన బూనుతున్నానని ఆయన వెల్లడించారు. బీజేపీ గాద్దే వారసత్వానికి ప్రతీక అయితే, కాంగ్రెస్ పార్టీ మహాత్మా గాంధీ సిద్ధాంతాలను పుణికిపుచ్చుకున్న వారసత్వం కలిగిన పార్టీ అని ఆయన వ్యాఖ్యానించారు. నరేంద్ర మోదీ, ధర్మేంద్ర ప్రధాన్ కలిసి ఈ దేశాన్ని దోచుకోవడానికి ప్రయత్నిస్తున్నారని రేవంత్ రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విషయంలో వారిని ఏమాత్రం విజయం సాధించనివ్వబోమని హెచ్చరించారు. రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ, మల్లికార్జున ఖర్గే నాయకత్వంలో వీధుల నుంచి పార్లమెంటు వరకు పోరాటం సాగించి బీజేపీని ఓడిస్తామన్నారు. యువత భవితవ్యంతో, దేశ భవిష్యత్తుతో మోదీ చెలగాటమాడుతున్నారని ఆయన మండిపడ్డారు. నీట్ పరీక్షలో చోటుచేసుకున్న అక్రమాలపై నిరసనలు వెల్లువెత్తుతున్న నేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ వ్యాఖ్యలు చేశారు. కాక్రోచ్ జనతా పార్టీ (నీజేపీ)తో పాటు ఇతర విపక్షాలు కూడా కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి పెంచుతున్నాయి. ఈ పరిణామాల వల్ల విద్యార్థులు మానసికంగా, విద్యాపరంగా తీవ్రంగా నష్టపోతున్నారని రేవంత్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. విద్యా వ్యవస్థపై ప్రజలకు తిరిగి నమ్మకం కలిగించాలంటే తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. ధర్మేంద్ర ప్రధాన్ తన పదవికి రాజీనామా చేయాలంటూ ఇప్పటికే పలు వర్గాల నుంచి డిమాండ్లు వెల్లువెత్తుతున్నాయి. పరీక్షల నిర్వహణలో లోపాలు జరిగాయని కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే అంగీకరించి, భవిష్యత్తులో సంస్కరణలు చేపడతామని ప్రకటించినప్పటికీ, విపక్షాలు మాత్రం కేంద్ర మంత్రిపై వేటు వేయాల్సిందేనని పట్టుబడుతున్నాయి.

# ప్రధాని మోదీ, అమిత్ షా తో భేటీ కానున్న జగన్...?

## ఏపీ రాజకీయాల్లో కీలక మలుపు

**విజయవాడ,జూలై 22 (వార్తాప్రభ) :** మాజీ సీఎం జగన్ కొత్త వ్యూహాలతో సిద్ధం అవుతున్నారు. జగన్ ఢిల్లీ కేంద్రంగా కొత్త మంత్రాంగానికి సమాయత్తం అవుతున్నారు.రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం పైన నిరసనలకు దిగుతున్న వైసీపీ అధినేత.. ఢిల్లీలో ప్రధాని మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా తో భేటీ అవ్వాలని నిర్ణయించారు. ఈ మేరకు వారిద్దరి అప్పాయింట్ మెంట్ కోరినట్లు పార్టీ నేతల సమాచారం. వచ్చే వారం పార్లమెంట్ ప్రాంగణంలో వారితో భేటీ అయ్యే అవకాశం ఉందని తెలుస్తోంది. ఈ వ్యవహారం ఇప్పుడు రాజకీయంగా ఆసక్తి కరంగా మారుతోంది. మాజీ సీఎం జగన్ రూటు మార్చారు. 2024 ఎన్నికల్లో ఓటమి తరువాత ఢిల్లీకి ఇప్పటి వరకు వెళ్లలేదు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం పైన మాత్రం రాజకీయంగా పోరాటం చేస్తున్నారు. ప్రభుత్వాన్ని టార్గెట్ చేస్తూ పరామర్శలు.. పర్యటనలు కొనసాగిస్తున్నారు. కూటమి ప్రభుత్వం అవినీతికి పాల్పడుతోందని ఆరోపిస్తున్నారు. ఇదే సమయంలో కేంద్రం ప్రతిపాదిస్తున్న కీలక బిల్లు లకు మద్దతు ఇవ్వాలని జగన్ డిసైడ్ అయ్యారు.! ఇదే అంశం తన పార్టీ ఎంపీలకు దిశా నిర్దేశం చేసారు. రాష్ట్రంలో కూటమి అధికారంలో ఉన్నా.. కేంద్ర పెద్దలతో మాత్రం జగన్ మంచి సంబంధాలే కొనసాగిస్తున్నట్లు ఉంది. ప్రస్తుత పార్లమెంట్ సమావేశాల సమయంలోనే ఆ ఇద్దరినీ కలిసే అవకాశం ఉందని పార్టీ ముఖ్య నేతలు చెబుతున్నారు. రాష్ట్రంలో పరిస్థితులు.. అవినీతి అంశాల పైన వారిద్దరికీ ఫిర్యాదు చేసే ఆలోచనతోనే జగన్ అప్పాయింట్ మెంట్ కోరినట్లు సమాచారం. అయితే.. జగన్ కు ఈ ఇద్దరి నుంచి అప్పాయింట్ మెంట్ విషయంలో ఎలాంటి నిర్ణయం వస్తుందనేది ఇప్పుడు కీలకంగా మారుతోంది.

**స్థానిక ఎన్నికల వేళ జగన్ బిగ్ స్కెచ్ - టార్గెట్ ఫిక్స్..!!..** కేంద్రం తీసుకొస్తున్న మహిళా రిజర్వేషన్లతో పాటుగా డీలిమిటేషన్ బిల్లుకు వైసీపీ మద్దతు ప్రకటిస్తోంది.. ఇదే సమయంలో జగన్ అప్పాయింట్ మెంట్ కోరారు.

# దుబ్బ దానయ్య కుటుంబానికి రూ.5 లక్షల ఆర్థిక సహాయం అందించిన మంత్రి కొలుసు పార్థసారథి

- దుబ్బ దానయ్య కుటుంబానికి భవిష్యత్తులో అండగా ఉంటామని ప్రకటించిన మంత్రి సారథి మరియు శాసనసభ్యులు గౌతూ శిరీష మరియు అశోక్

**పలాస/నూజివీడు, జూలై 22 (వార్తాప్రభ) :** పలాసలో ఇటివల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన దుబ్బ దానయ్య కుటుంబాన్ని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార & పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి పరామర్శించి, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.ఈ సందర్భంగా మంత్రి కొలుసు పార్థసారథి తమ తండ్రి మాజీ పార్లమెంట్ సభ్యులు దివంగత కొలుసు పెద్ద రెడ్డయ్య యాదవ్ స్మారకార్థం నిర్వహిస్తున్న కొలుసు పెద్ద రెడ్డయ్య యాదవ్ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా రూ.5 లక్షల ఆర్థిక సహాయాన్ని బాధిత కుటుంబానికి అందజేశారు. ఈ కార్యక్రమంలో ఇచ్చాపురం శాసనసభ్యులు బెందాళం అశోక్, పలాస శాసనసభ్యురాలు గౌతు శిరీష. కూటమి ముఖ్య నాయకులు, ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి కొలుసు పార్థసారథి మాట్లాడుతూ మనుషుల ప్రాణాలతో చెలగాటమాడుతున్న గొడ్డలి పార్టీ నాయకుల విధానాలు అత్యంత ప్రమాదకరంగా ఉన్నాయన్నారు. పేద కుటుంబానికి చెందిన వ్యక్తి చనిపోతే కనీసం బాధ్యత మరిచి కు - విమర్శలు చేయటం దుర్మార్గమైన విధానమని మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. దుబ్బ దానయ్య కుటుంబానికి అన్ని విధాలా అండగా ఉంటామని, వారి పిల్లల చదువులకు బాధ్యత తీసుకుంటామని, వారికి న్యాయం జరిగేలా ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి పేర్కొన్నారు. కుటుంబ సభ్యులు ధైర్యంగా ఉండాలని, అవసరమైన సహాయ సహకారాలు అందేలా తాను వ్యక్తిగతంగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. సుదూర ప్రాంతం నుంచి తమ ప్రాంతానికి వచ్చి మంత్రి పార్థసారథి వచ్చి పేద బాధిత కుటుంబ పరిస్థితి,పిల్లలను చూసి చలించి అప్పటికప్పుడు ఐదు లక్షలు వ్యక్తిగత సహాయం అందించడం అత్యంత స్ఫూర్తిదాయకమని అభినందనీయమని శాసనసభ్యులు అన్నారు. మంత్రి కి ధన్యవాదాలు తెలుపుతూ వారి స్ఫూర్తితో తాము బాధిత కుటుంబానికి అండగా నిలుస్తామని శాసనసభ్యులు గౌతు శిరీష మరియు అశోక్ పేర్కొన్నారు. మంత్రి కొలుసు పార్థసారథి వెంట కృష్ణాజిల్లా మాజీ గ్రంథాలయ చైర్మన్ & రాష్ట్ర టిడిపి నాయకులు రొండి కృష్ణ యాదవ్ ఉన్నారు.

# పీఆర్సీ కమిటీని వెంటనే ఏర్పాటు చేయాలి, ఐ.ఆర్. ప్రకటించాలి.

- జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ సమావేశంలో ఉద్యోగుల సమస్యలపై ప్రభుత్వ దృష్టికి 70 పైగా అంశాలు
- ఆ లోపు ఐఆర్ ప్రకటించాలి.
- ఐదు డీఏలు వెంటనే విడుదల చేయాలి - ఏపీ ఎన్జీవో రాష్ట్ర అధ్యక్షుడు అలపర్తి విద్యాసాగర్

**అమరావతి,జూలై 22 (వార్తాప్రభ) :** రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల పెండింగ్ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం అత్యవసర చర్యలు చేపట్టాలని ఏపీ ఎన్జీవో రాష్ట్ర అధ్యక్షుడు అలపర్తి విద్యాసాగర్ కోరారు. వెలగపూడిలోని రాష్ట్ర సచివాలయంలో రాష్ట్ర మంత్రుల బృందం సమక్షంలో జరిగిన ఉద్యోగ సంఘాల జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ సమావేశంలో ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. ఈ సమావేశంలో జాయింట్ స్టాఫ్ సంఘాల నాయకులు పాల్గొన్నారు. ఉద్యోగుల హక్కుల పరిరక్షణ, సంక్షేమమే తమ సంఘం ప్రధాన లక్ష్యమని పేర్కొన్న విద్యాసాగర్, ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం ప్రభు త్వం ముందు నిరంతరం పోరాడుతున్నామని చెప్పారు. జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ సమావేశంలో సుమారు 70 సమస్యలను మంత్రుల దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. వాటిపై సానుకూల చర్చలు జరిగాయని, ముఖ్యమంత్రితో చర్చించి నిర్ణయం తీసుకుని అనంతరం ఉద్యోగ సంఘాలతో మరొక సమావేశాన్ని ఏర్పాటు చేస్తామని తెలిపారు.

**పీఆర్సీపై వెంటనే నిర్ణయం..** 2023 జూలైలో ఏర్పాటు కావాల్సిన వేతన సవరణ కమిటీ (పీఆర్సీ) ఇప్పటికీ నియమించకపోవడం వల్ల ఉద్యోగులు తీవ్ర నిరాశకు గురవుతున్నారని విద్యాసాగర్ అన్నారు. పెరుగుతున్న ధరలను దృష్టిలో ఉంచుకుని పీఆర్సీ కమిటీని తక్షణమే ఏర్పాటు చేయాలని, ఆ లోపు మధ్యంతర ఉపశమనం (ఐఆర్) ప్రకటించాలని డిమాండ్ చేశారు.

**ఐదు డీఏలు పెండింగ్..** ప్రస్తుతం ఐదు డీఏలు పెండింగ్‌లో ఉన్నాయని, పీఆర్సీ అమలు కాకపోవడం, డీఏలు విడుదల కాకపోవడంతో ఉద్యోగులపై ఆర్థిక భారం పెరిగిందన్నారు.

**బకాయిల చెల్లింపులు వేగవంతం చేయాలి..** గత ప్రభుత్వ హయాంలో పేరుకుపోయిన రూ.33 వేల కోట్లకు పైగా బకాయిల్లో ప్రస్తుత ప్రభుత్వం రూ.22 వేల కోట్లను దశలవారీగా చెల్లించడం స్వాగతించదగ్గ విషయమన్నారు. మిగిలిన బకాయిలను కూడా త్వరగా చెల్లించాలని ప్రభుత్వాన్ని కోరారు. సర్వీస్‌లో ఉన్న ఉద్యోగుల సరెండర్ లీవ్ బకాయిలను వెంటనే చెల్లించాలని మిగిలిన బకాయిల చెల్లింపులపై రోడ్ మ్యాప్ ప్రకటించాలని కోరారు.

**హెల్త్ కార్డు:** హెల్త్ కార్డుల మీద ఉద్యోగులకు హాస్పిటల్స్ ద్వార ట్రీట్మెంట్ అందటం లేదని దాని పరిస్థితి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే ఉందన్న చందాన ఉందని రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే హెల్త్ కార్డు కోసం ఉద్యోగులు చెల్లిస్తున్న మొత్తాన్ని ప్రభుత్వం మ్యాచింగ్ గ్రాంట్ తో కలిపి గ్రీన్ ఛానల్ ద్వారా చెల్లింపులు జరపాలని హెల్త్ కార్డు పై వైద్యం అందేలాగా చర్యలు తిస్కోవాలని కోరారు.

**ఇతర కీలక డిమాండ్లు..** కాంట్రాక్ట్ ఉద్యోగుల రెగ్యులరైజేషన్, గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులకు నోషనల్ ఇంక్రిమెంట్లు, పెన్షనర్లకు అదనపు పెన్షన్ పునరుద్ధరణ, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల పదవీ విరమణ వయోపరిమితి పెంపు, ప్రభుత్వ సంక్షేమ పథకాల వర్తింపు వంటి అంశాలపై ప్రభుత్వం సానుకూల నిర్ణయం తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఉద్యోగుల పదోన్నతులపై ఉన్న ఫ్రీసింగ్ ఉతర్వులను సడలిస్తూ మరికొంతకాలం వెసులుబాటు ఇవ్వాలని కోరారు. ఉపాధ్యాయుల టెట్ ఎగ్జామినేషన్ విషయాన్నీ కూడా మంత్రుల దృష్టికి తిస్కోని వచ్చారు. ఉద్యోగుల హక్కుల పరిరక్షణ, సంక్షేమమే ఏపీ ఎన్జీవో సంఘం ప్రధాన లక్ష్యమని, ఉద్యోగుల న్యాయమైన డిమాండ్ల సాధన కోసం తమ పోరాటం నిరంతరం కొనసాగుతుందని అలపర్తి విద్యాసాగర్ స్పష్టం చేశారు. సమావేశంలో ఏపీ జేఏసీ ప్రధాన కార్యదర్శి కేఎస్ఎస్ ప్రసాద్, ఏపీ ఎన్జీవో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డీవీ రమణ, ఏపీ జేఏసీ సీఓ చైర్మన్ జి. హృదయ రాజు, ఎస్టీయూ నాయకుడు ఎల్. సాయి శ్రీనివాస్, పీఆర్టీయూ నాయకుడు మిట్ట కృష్ణయ్య, పెన్షనర్ల సంఘం ప్రతినిధి డి. వెంకటేశ్వర్లు, వ్యవసాయ శాఖ ప్రతినిధి వేణు మాధవ్, పశుసంవర్ధక శాఖ ప్రతినిధులు సేవా నాయక్, రామకృష్ణ, ఏపీ ఎన్జీవో ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు డి. సత్యనారాయణ రెడ్డి, జిల్లా కార్యదర్శి పి. రమేష్, విజయవాడ సిటీ అధ్యక్షుడు చి. సీవీఆర్ ప్రసాద్, ఏపీ ఎన్జీవో రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎస్‌కే జానీ భాషా, రాష్ట్ర ప్రచార కార్యదర్శి శ్రీమతి బి. జానకి, ఏఐఎస్ఈజీఎఫ్ కన్వీనర్ ఎం. రాజ్యలక్ష్మి, రాష్ట్ర కార్యదర్శులు ఎం. సరస్వతి, ఎల్. రజనీష్ బాబు, రాజధాని నగర ఆర్గనైజింగ్ కార్యదర్శి శ్రీధర్, క్లాస్--IV ఉద్యోగుల సంఘం ప్రతినిధి ఎన్. చంద్రశేఖర రావు పాల్గొన్నారు.

# హైదరాబాద్‌లో కొవిడ్ కలకలం

- గడగడలాడిస్తున్న కొత్త వేరియంట్ లక్షణాలు
- అప్రమత్తంగానే ఉన్నాం... జాగ్రత్తలు తీసుకోండి
- ప్రజలకు తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాల వినతి

**హైదరాబాద్/విజయవాడ,జూలై 22 (వార్తాప్రభ) :** దేశవ్యాప్తంగా కొవిడ్ కేసులు మళ్లీ నిశ్శబ్దంగా విజృంభిస్తుండటం తెలుగు ప్రజల్లో తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్‌లో ఇప్పటికే నలుగురు కరోనా బారిన పడి ప్రాణాలు కోల్పోవడం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది. అమరావతి ఆరోగ్య శాఖ వర్గాల సమాచారం ప్రకారం, ఏపీలో కొత్తగా మరో 7 కేసులు నమోదవడంతో మొత్తం కేసుల సంఖ్య 26కు చేరింది. గుంటూరు, తూర్పుగోదావరి, బాపట్ల జిల్లాల్లో ఈ కొత్త కేసులు వెలుగుచూశాయి. ప్రస్తుతం పలువురు ఆస్పత్రుల్లో చికిత్స పొందుతుండగా, మరికొందరు హోం ఐసోలేషన్‌లో ఉన్నారు. ఈ పరిణామాల నేపథ్యంలో ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని అధికారులు విజ్ఞప్తి చేస్తున్నారు.

**హైదరాబాద్ ఆస్పత్రుల్లో రోగుల క్యూ..** మరోవైపు తెలంగాణలోనూ పరిస్థితి ఏమాత్రం భిన్నంగా లేదు. గడిచిన నెల రోజులుగా హైదరాబాద్‌లోని ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రులకు తీవ్ర మైన జలుబు, ఒళ్లు నొప్పులు, పొడి దగ్గు, తీవ్ర జ్వరంతో వస్తున్న బాధితుల సంఖ్య గణనీయంగా పెరిగింది. అయితే, వీరికి వైద్యులు కేవలం సాధారణ ఇన్ఫెక్షన్లకే చికిత్స అందిస్తున్నారు తప్ప కొవిడ్ నిర్ధారణ పరీక్షలు నిర్వహించడం లేదు. పరీక్షలు చేయకపోవడం వల్లే అధికారిక రికార్డుల్లో తెలంగాణలో కరోనా కేసులు 'సున్నా'గా కనిపిస్తున్నాయనే

- 2లో

## మెప్మా ఆధ్వర్యంలో మన డబ్బులు - మన లెక్కలు అవగాహన ర్యాలీ

**తిరువూరు,జూలై 22 (వార్తాప్రభ) :** పట్టణ పేదరిక నిర్మాణ సంస్థ (మెప్మా) తిరువూరు పురపాలక సంఘం ఆధ్వర్యంలో స్వయం సహాయక సంఘాల సభ్యులకు "మన డబ్బులు మన లెక్కలు" యాప్ పైన అవగాహన ర్యాలీ కార్యక్రమం శనివారం ఉదయం స్థానిక మెప్మా కార్యాలయం నుంచి నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా తిరువూరు మున్సిపల్ కమిషనర్ మనోజ ఈ ర్యాలీలో పాల్గొనడం జరిగింది.ఈ సందర్భంగా కమిషనర్ మేడం మాట్లాడుతూ సంఘ సభ్యులు అందరు ఆర్థిక లావాదేవీలు తప్పనిసరిగా తెలుసుకోవాలి.ఈ యాప్ ప్రధాన ఉద్దేశం సంఘం నెల వారి ఆర్థిక లావాదేవీలను డిజిటల్ రూపంలో చూసుకోవచ్చు, ప్రతి సభ్యురాలికి తమ సంఘం ఆర్థిక వ్యవహారాలపై పూర్తి అవగాహన కల్పించడమే ప్రభుత్వం లక్షం. ప్రతి ఒక్క సంఘ సభ్యులు తమ ఆర్థిక లెక్కలను యాప్ లో స్వయంగా చూసుకునే స్థాయికి చేరేల చెప్పటం జరిగినది.సమావేశాలు, ర్యాలీలు మరియు అవగాహన కార్యక్రమాలతో ప్రజల్లో విస్తృత ప్రచారం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మెప్మా డి.పి.ఎం.యు ఆఫీస్ నుంచి TE-IB సుగుణ గారు డిఆర్.పి యామిని, సి.ఓ, రిసోర్స్ పర్సన్లు (ఆర్పీ) లు మరియు సంఘం సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## డాక్టర్ పెనుమల్లి నాగేశ్వరావు మాకు దేవుడు అమ్మ ప్రాణాలు కాపాడారు

**తిరువూరు,జూలై 22 (వార్తాప్రభ) :** ఎన్టీఆర్ జిల్లా తిరువూరులో మా అమ్మ పరిస్థితి అత్యంత విషమంగా ఉండటంతో, జయ కృష్ణ హాస్పిటల్ కి తీసుకువచ్చాము పరీక్షించిన డాక్టర్ గారు మీ అమ్మ పరిస్థితి బాగాలేదు "ఇక్కడ లాభం లేదు... వెంటనే విజయవాడకు తీసుకెళ్లండి" అని డాక్టర్ పెనుమల్లి నాగేశ్వరరావు గారు కుటుంబ సభ్యులకు సూచించారు. అయితే, "సార్... అమ్మను మీరే బ్రతికించాలి. మాకు ఎక్కడికీ తీసుకెళ్లే పరిస్థితి లేదు. మీరే అమ్మను కాపాడాలి" అంటూ కుటుంబ సభ్యులు కన్నీటి పర్యంతమై వేడుకున్నారు. వారి ఆవేదనను చూసిన డాక్టర్ పెనుమల్లి నాగేశ్వరరావు గారు వెనక్కి తగ్గకుండా రాత్రంతా ఆసుపత్రిలోనే ఉండి, నిరంతరం పర్యవేక్షిస్తూ వైద్యం అందించారు. ఆయన సమయస్ఫూర్తి, వైద్య నైపుణ్యం, అంకితభావంతో మా అమ్మగారు ప్రాణాపాయం నుంచి బయటపడ్డారని కుటుంబ సభ్యులు ఆనందం వ్యక్తపరిచారు మాకు ఆయన డాక్టర్ మాత్రమే కాదు... దేవుడితో సమానం. ఆయన చేసిన మేలు జీవితాంతం మరచిపోలేం. ఆయన రుణం ఎప్పటికీ తీర్చుకోలేం" అంటూ కుటుంబ సభ్యులు భావోద్వేగంతో తెలిపారు.వైద్యం అంటే కేవలం వృత్తి కాదని, ప్రాణాలను కాపాడే బాధ్యత అని తన సేవతో నిరూపించిన డాక్టర్ నాగేశ్వరరావు గారిపై స్థానికులు కురిపిస్తున్నారు. ఆయన మాట చెప్పి వైద్య సేవలు అందిస్తే రోగి బ్రతకడం ఖాయం ఇది నిజం అని చెబుతున్న స్థానికులు

## బైండోవర్ నిబంధనలు ఉల్లంఘించిన యువకుడికి రూ.1 లక్ష జరిమానా

**హనుమాన్ జంక్షన్, జూలై 22 (వార్తాప్రభ) :** కృష్ణా జిల్లా ఎస్పీ వి. విద్యాసాగర్ నాయుడు, ఐపీఎస్ ఆదేశాల మేరకు, గన్నవరం డీఎస్పీ పర్యవేక్షణలో హనుమాన్ జంక్షన్ సర్కిల్ ఇన్స్పెక్టర్ ఎల్. రమేష్ ఆధ్వర్యంలో వీరవల్లి ఎస్సై సత్యం సురేష్ బైండోవర్ నిబంధనలు ఉల్లంఘించిన వ్యక్తిపై చర్యలు చేపట్టారు. మల్లవల్లి గ్రామానికి చెందిన వేముల రత్నాకర్ (25), తండ్రి సాంబయ్యపై జూన్ నెలలో జరిగిన గొడవకు సంబంధించి వీరవల్లి పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. అనంతరం అతడిని బాపులపాడు మండల ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ ఎదుట హాజరుపరచగా, గ్రామంలో శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా సత్ప్రవర్తనతో ఉండాలనే షరతుతో రూ. 1 లక్ష బాండ్‌పై బైండోవర్ చేశారు. అయితే, ప్రవర్తనలో మార్పు లేకుండా జూలై నెలలో మరోసారి అతనిపై వీరవల్లి పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. దీంతో బైండోవర్ నిబంధనలు ఉల్లంఘించినందుకు ఎస్సై సత్యం సురేష్ అతడిని మళ్లీ మండల ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ ఎదుట హాజరుపరచగా, రూ. 1 లక్ష జరిమానా విధించారు. అలాగే ఇకపై వివాదాలు, గొడవలకు దూరంగా ఉండి సత్ప్రవర్తనతో మెలగాలని మేజిస్ట్రేట్ హెచ్చరించారు.

## హైదరాబాద్‌లో కొవిడ్ కలకలం

(మొదటిపేజీ తరువాయి)

విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇటీవల తార్నాకకు చెందిన ఒక మహిళ తీవ్ర శ్వాసకోశ సమస్యలతో మరణించడం, గాంధీ ఆస్పత్రిలో ఒక కేస్ వెలుగు చూడటం ఈ అనుమానాలకు బలం చేకూరుస్తోంది.

**కొరతలో ఆస్పత్రులు.. నిమ్మకు నీరెత్తిన ఆరోగ్య శాఖ..** ఐ సి ఎం ఆర్ నివేదికల ప్రకారం దేశంలో జూన్ నెల నుంచే కరోనా గ్రాఫ్ పెరుగుతున్నట్లు స్పష్టమవుతోంది.

**ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు ఇవే!..** వాతావరణంలో మార్పులు, కొవిడ్ కొత్త సబ్‌వేరియంట్ల ప్రభావం వల్ల ఈ సమస్య తలెత్తుతోందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. వ్యాధి నిరోధక శక్తి తక్కువగా ఉన్నవారు, వృద్ధులు, బీపీ, షుగర్ వంటి దీర్ఘకాలిక సమస్యలు ఉన్నవారు మరింత జాగ్రత్తగా ఉండాలి. జ్వరం, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది లేదా తీవ్రమైన దగ్గు ఉంటే నిర్లక్ష్యం చేయకుండా వెంటనే వైద్యులను సంప్రదించాలి.

# విజయ్ గోగులమూడి నేటి యువతకు ఆదర్శం : ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు

### ఉత్తమ తెలుగు క్రీడా జర్నలిస్టు పురస్కారం అందుకున్న విజయ్‌కు ఘన సత్కారం

**గన్నవరం, జూలై 22 (వార్తాప్రభ) :** క్రీడాకారుడిగా, శిక్షకుడిగా, క్రీడా పోటీల న్యాయనిర్ణేతగా, క్రీడా సంఘ నాయకుడిగా, క్రీడా విలేకరిగా అనేక రంగాల్లో తనదైన ముద్ర వేసి బహుముఖ ప్రజ్ఞాశాలిగా గుర్తింపు పొందిన విజయ్ గోగులమూడి నేటి యువతకు ఆదర్శంగా నిలుస్తున్నారని గన్నవరం ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ యార్లగడ్డ వెంకట్రావు అన్నారు. తెలుగు జర్నలిస్టుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ స్థాయి అవార్డుల ప్రదానోత్సవంలో ఉత్తమ తెలుగు క్రీడా జర్నలిస్టు పురస్కారానికి ఎంపికైన విజయ్ గోగులమూడిని ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు ఘనంగా సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, క్రీడారంగ అభివృద్ధికి సంబంధించిన అంశాలపై, క్రీడాకారులు ఎదుర్కొంటున్న సమస్యలపై విజయ్ రాసిన కథనాలు సమాజంలో చైతన్యం తీసుకువచ్చాయని కొనియాడారు. క్రీడా రంగానికి ఆయన అందిస్తున్న సేవలు ప్రశంసనీయమని, అంకితభావంతో పనిచేసే జర్నలిస్టులకు ఇలాంటి పురస్కారాలు మరింత ప్రోత్సాహాన్ని అందిస్తాయని అన్నారు. ప్రజాగళాన్ని తన కలంగా మార్చుకుని వివిధ రంగాల్లో విశేష

సేవలందిస్తున్న జర్నలిస్టులను గుర్తించి ప్రతి ఏడాది ఉత్తమ తెలుగు జర్నలిస్టు పురస్కారాలను అందజేయడం అభినందనీయమని పేర్కొన్నారు. ఎంత ఎత్తుకు ఎదిగినా ఒదిగి ఉండే వ్యక్తిత్వం విజయ్ గోగులమూడి ప్రత్యేకత అని, క్రీడారంగానికి ఆయన చేస్తున్న సేవలకు గుర్తింపుగా ఈ అవార్డు రావడం సంతోషకరమని ఎమ్మెల్యే అన్నారు. ఉమ్మడి కృష్ణాజిల్లాతో పాటు రెండు తెలుగు రాష్ట్రాల స్థాయిలో క్రీడా జర్నలిజంలో విశిష్ట సేవలు అందిస్తున్న విజయ్ గోగులమూడికి ఈ అవార్డు దక్కడం పట్ల ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు, జర్నలిస్టు సంఘాల నాయకులు, క్రీడా ప్రేమికులు హర్షం వ్యక్తం చేశారు. ఏపీయూడబ్ల్యూజే కృష్ణా జిల్లా ఉపాధ్యక్షుడు అట్లూరి రాజశేఖర్ సహా పలువురు విజయ్‌ను అభినందించారు. ఈ సందర్భంగా విజయ్ గోగులమూడి మాట్లాడుతూ, తన ప్రతిభను గుర్తించి ప్రోత్సహిస్తున్న ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావుకు కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్తులో కూడా క్రీడారంగ అభివృద్ధికి, క్రీడాకారుల సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి కొనసాగిస్తానన్నారు. అలాగే కృష్ణా జిల్లా యోగాసన క్రీడా సంఘం ఆధ్వర్యంలో ఆగస్టు 2వ తేదీన గన్నవరంలోని వాసవి కన్యకా పరమేశ్వరి కళ్యాణ మండపంలో యోగాసన పోటీలు నిర్వహించనున్నట్లు విజయ్ గోగులమూడి తెలిపారు. ఈ పోటీలకు గన్నవరం ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ యార్లగడ్డ వెంకట్రావు ముఖ్య అతిథిగా హాజరవుతారని వెల్లడించారు.

## విద్యాభివృద్ధికి లయన్స్ చేయూత

### ● విద్యతో పాటు సామాజిక సేవలకు ప్రాధాన్యం: లయన్స్ గవర్నర్ ఎన్.వి.వి.ఎస్. ప్రసాద్

**హనుమాన్ జంక్షన్,జూలై 22 (వార్తాప్రభ) :** విద్యాభివృద్ధితో పాటు సమాజ అవసరాలను గుర్తించి సేవా కార్యక్రమాలు నిర్వహించడంలో లయన్స్ అంతర్జాతీయ సేవా సంస్థ ఎల్లప్పుడూ ముందుంటుందని లయన్స్ గవర్నర్ ఎన్.వి.వి.ఎస్. ప్రసాద్ అన్నారు. బాపులపాడు మండలం ఓగిరాల గ్రామంలో లయన్స్ క్లబ్ ఆఫ్ హనుమాన్ జంక్షన్ అధ్యక్షుడు మత్తి సాంబశివరావు ఆధ్వర్యంలో, సీనియర్ సభ్యుడు మేడికొండ బుచ్చిబాపయ్య సహకారంతో రెండు ఎంపీపీ పాఠశాలల విద్యార్థులకు నోటు పుస్తకాలు, విద్యా సామగ్రి పంపిణీ కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన గవర్నర్ ఎన్.వి.వి.ఎస్. ప్రసాద్ విద్యార్థులకు నోటు పుస్తకాలు, విద్యా సామగ్రిని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వం అందించే అవకాశాలతో పాటు దాతలు, స్వచ్ఛంద సంస్థలు అందించే సహకారాన్ని సద్వినియోగం చేసుకుని విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను సాధించాలని సూచించారు. విద్యే జీవితాన్ని తీర్చిదిద్దే గొప్ప సాధనమని, ప్రతి విద్యార్థి క్రమశిక్షణ, పట్టుదలతో చదివి సమాజానికి ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షించారు. ఈ ఏడాది "చిన్న సేవ -- గొప్ప ప్రభావం" అనే నినాదంతో లయన్స్ సంస్థ సేవా కార్యక్రమాలను విస్తృతంగా చేపడుతున్నట్లు తెలిపారు. పర్యావరణ పరిరక్షణ, విద్యార్థులకు ఉచిత నేత్ర పరీక్షలు, పేదలకు నిత్యావసర వస్తువుల పంపిణీ, గ్రామాల్లో ప్రజల అవసరాలను గుర్తించి సేవలు అందించే కార్యక్రమాలకు ప్రాధాన్యం ఇస్తున్నట్లు వివరించారు. ఈ సందర్భంగా సీనియర్ సభ్యుడు మేడికొండ బుచ్చిబాపయ్య మాట్లాడుతూ, తన స్వగ్రామమైన ఓగిరాల అభివృద్ధికి ఎల్లప్పుడూ తన వంతు సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. గ్రామంలోని విద్య, సామాజిక అభివృద్ధి కార్యక్రమాలకు అవసరమైన సహాయం అందించేందుకు సిద్ధంగా ఉంటానన్నారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి అక్కినేని రాఘవేంద్రరావు, జిల్లా కార్యవర్గ సభ్యులు శ్రీనివాసరావు, మ-ఎత్య ప్రసాద్, సుధీర్ పాల్ రెడ్డి, మండల అధ్యక్షుడు పంచకర్ల రమేష్ చక్రవర్తి, అక్కినేని శ్రీనివాస పణీంద్ర, నండూరి శర్మ, చలసాని వెంకటేశ్వరరావు, మాకినేని శ్రీనివాసరావు, సభ్యులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## గురు పౌర్ణమి మహోత్సవానికి సిద్ధమవుతున్న శ్రీ షిరిడి సాయి బాబా ఆలయం

**విస్సన్నపేట,జూలై 22 (వార్తాప్రభ) :** స్థానిక శ్రీ షిరిడి సాయిబాబా సేవ మందిరం నందు 29వ తేదీ బుధవారం శ్రీ గురు పౌర్ణిమ మహోత్సవ ఉత్సవ కార్యక్రమాలకు సర్వం సిద్ధం చేస్తున్నట్లు నిర్వాహకులు తెలియజేశారు. శ్రీ పరాభవ నామ సంవత్సర ఆషాడ శుద్ధ గురుపౌర్ణమి సందర్భంగా ఉదయం ఐదు గంటల 30 నిమిషాలకు శ్రీ షిరిడి సాయినాధునికి కాగడా హారతి 6 గంటల 20 నిమిషాలకు చందనాభిషేకం ఎనిమిది గంటలకు బాబా వారికి వారికి అలంకరణ నిత్య పూజ 8:15 నిమిషాలకు పల్లకి ఉత్సవం ఎనిమిది గంటల 30 నిమిషాలకు శ్రీ సాయి సహస్రనామార్చన 9:30 నిమిషాలకు గురుపూజోత్సవం 11 గంటలకు అన్న ప్రసాద వితరణ భక్తుల

సహాయ సహకారాలతో జరుగుతోందని మధ్యాహ్నం 12 గంటలకు మధ్యాహ్న హారతి శ్రీ గురు పౌర్ణమి మహోత్సవ ఉత్సవ కార్యక్రమాలలో భాగంగా నిర్వహించనున్నట్లు శ్రీ షిరిడి సాయిబాబా సేవ మందిర నిర్వాహకులు తెలియజేశారు. యావన్మంది సాయిబాబా భక్తులు ప్రతి ఒక్కరూ ఈ ఉత్సవంలో పాల్గొని భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు స్వీకరించి శ్రీ షిరిడి సాయి శ్రీ సాయినాథ మహరాజ్ బాబా వారి కృపా కటాక్ష వీక్షణాలకు పాత్రులు కావాల్సిందిగా అందరి సుఖశాంతుల కోరే ఆలయ నిర్వహకులు విజ్ఞప్తి చేశారు. సర్వాంతర్యామి సద్గురు సాయిబాబా వారి సన్నిధిలో ధుని లోనికి నిరంతరం కట్టెలను భక్తులు ల్యాండ్ లార్డ్ మాజీ సర్పంచ్ కుక్కడపు ప్రసాదరావు అలివేలు మంగతాయారు దంపతులు సమర్పిస్తున్నట్లు తెలియజేశారు.

## ప్రకృతే పరమదైవం...పవిత్ర కల్పవృక్షం నాటి సందేశమిచ్చిన పుట్టగుంట సతీష్ కుమార్

### శ్రీకృష్ణుడి సన్నిధిలో కల్పవృక్ష ప్రతిష్ఠ

**హనుమాన్ జంక్షన్,జూలై 22 (వార్తాప్రభ) :** ప్రకృతి సంరక్షణతో పాటు భారతీయ సంస్కృతి, ఆధ్యాత్మిక విలువలను భావితరాలకు అందించాలనే మహోన్నత సంకల్పంతో ప్రముఖ సామాజిక సేవకుడు పుట్టగుంట సతీష్ కుమార్ తన ఫామ్ హౌస్‌లోని శ్రీకృష్ణుడి ఆలయం పక్కన సుమారు 100 సంవత్సరాల ప్రాచీన పవిత్ర కల్పవృక్షాన్ని బుధవారం నాటించారు. వేద మంత్రోచ్చారణల మధ్య ప్రత్యేక పూజలు నిర్వహించి, భక్తిశ్రద్ధలతో ఈ వృక్షాన్ని ప్రతిష్ఠించారు. ఈ సందర్భంగా సతీష్ కుమార్ మాట్లాడుతూ, వృక్షాలను కాపాడడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని, పర్యావరణ పరిరక్షణతో పాటు ఆధ్యాత్మిక విలువలను పెంపొందించడంలో ఇలాంటి పవిత్ర వృక్షాలకు ప్రత్యేక స్థానం ఉందన్నారు. ప్రతి కుటుంబం కనీసం ఒక పవిత్ర వృక్షాన్ని నాటి సంరక్షిస్తే భావితరాలకు స్వచ్ఛమైన పర్యావరణాన్ని అందించగలమని పేర్కొన్నారు. హిందూ పురాణాల ప్రకారం సముద్ర మథన సమయంలో వెలుగులోకి వచ్చిన 14 దివ్య రత్నాలలో కల్పవృక్షం ఒకటిగా పేర్కొనబడింది. అనంతరం దేవతల

రాజైన ఇంద్రుడు దీనిని స్వర్గలోకంలోని నందనవనంలో నాటినట్లు పురాణాలు చెబుతున్నాయి. కల్పవృక్షం కింద కోరుకున్న కోరికలు నెరవేరుతాయనే విశ్వాసం భక్తుల్లో ఉంది. అందుకే దీనిని కోరికలు తీర్చే దివ్య వృక్షంగా, శాంతి, ఐశ్వర్యం, ఆరోగ్యం, సిరిసంపదలు, ఆధ్యాత్మిక శక్తికి ప్రతీకగా భావించి పూజిస్తుంటారు. కల్పవృక్షం మనిషికి మరో గొప్ప సందేశాన్ని కూడా అందిస్తుంది. మనం ప్రకృతిని ప్రేమించి, వృక్షాలను సంరక్షిస్తే ప్రకృతి కూడా మనకు ఆరోగ్యం, ఆహారం, స్వచ్ఛమైన గాలి, వర్షాలు, జీవనాధారాన్ని ప్రసాదిస్తుందని పెద్దలు చెబుతుంటారు. ఈ నేపథ్యంలో కల్పవృక్షం నాటడం పర్యావరణ పరిరక్షణకు మాత్రమే కాకుండా భారతీయ సంస్కృతి, ఆధ్యాత్మిక సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తోంది. ఈ కార్యక్రమంలో కుటుంబ సభ్యులు, బంధువులు, సన్నిహితులు పాల్గొని వృక్షానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పుట్టగుంట సతీష్ కుమార్, ఆయన కుటుంబ సభ్యులు ఆయురారోగ్యాలు, ఐశ్వర్యాలతో సుఖసంతోషాలతో ఉండాలని, సమాజ సేవలో మరిన్ని మంచి కార్యక్రమాలు చేపట్టాలని పలువురు ఆకాంక్షిస్తూ అభినందనలు తెలిపారు. ఈ పవిత్ర కార్యక్రమం స్థానికంగా విశేష ఆకర్షణగా నిలిచింది.

## స్థానిక సంస్థల ఎన్నికల్లో టిడిపి జెండా ఏకపక్షంగా ఎగరాలి...

### -నాయకులకు హితబోధ చేసిన కాగిత

**పెడన,జూలై 22 (వార్తాప్రభ) :** తోటమూల తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన నియోజకవర్గ స్థాయి సమావేశంలో పెడన శాసనసభ్యులు కాగిత కృష్ణ ప్రసాద్ పెడన నియోజకవర్గ పరిశీలకులు షేక్ ఆషా పాల్గొన్నారు. ఈ సమావేశానికి నియోజకవర్గంలోని మండల పార్టీ అధ్యక్షులు క్లస్టర్ అధ్యక్షులు యూనిట్ అధ్యక్షులు ముఖ్య నాయకులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాగిత కృష్ణ ప్రసాద్ మాట్లాడుతూ ప్రజల. ప్రతి బుధవారం యూనిట్ స్థాయిలో బూత్ ఇన్‌చార్జ్‌లతో సమావేశాలు నిర్వహిస్తూ ప్రజల సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారానికి సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ప్రజల నుంచి వచ్చే వినతులను స్థానిక పార్టీ కార్యాలయాల్లో స్వీకరించి సంబంధిత అధికారులతో సమన్వయం చేసుకుని త్వరితగతిన పరిష్కారం అయ్యేలా చర్యలు తీసుకోవాలని అన్నారు.అలాగే రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ జెండా ఏకపక్షంగా ఎగిరేలా ప్రతి కార్యకర్త నడుం బిగించి పార్టీ బలోపేతానికి కృషి చేయాలని, గ్రామ స్థాయి నుంచి పార్టీని మరింత బలోపేతం చేసే దిశగా అందరూ సమిష్టిగా ముందుకు సాగాలని ఆయన పిలుపునిచ్చారు.అలాగే ఈ నెల 27వ తేదీ నుంచి ప్రారంభం కానున్న డోర్ టు డోర్ క్యాంపెయిన్ నిర్వహణపై

అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాగిత కృష్ణ ప్రసాద్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రతి ఇంటికీ చేరవేసి ప్రజలతో ప్రత్యక్షంగా మమేకం కావాలని పార్టీ నాయకులు కార్యకర్తలకు సూచించారు. డోర్ టు డోర్ ప్రచార కార్యక్రమాన్ని సమన్వయంతో క్రమశిక్షణతో నిర్వహించి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ప్రతి ఇంటిని సందర్శిస్తూ ప్రభుత్వ పనితీరును ప్రజలకు వివరించి వారి అభిప్రాయాలు సమస్యలను తెలుసుకుని పార్టీకి మరింత బలోపేతం కలిగించేలా పనిచేయాలని నాయకులు కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు.

## హనుమాన్ జంక్షన్‌లో ఘనంగా శ్రీ జగన్నాథ రథయాత్ర

### ● ఈ నెల 23న సాయంత్రం 4.30 గంటల నుంచి భక్తులకు ఆధ్యాత్మిక వేడుక

**హనుమాన్ జంక్షన్, జూలై 22 (వార్తాప్రభ) :** ఇస్కాన్ అమరావతి ఆధ్వర్యంలో హనుమాన్ జంక్షన్‌లో శ్రీ జగన్నాథ రథయాత్రను ఈ నెల 23వ తేదీ (గురువారం) ఘనంగా నిర్వహించనున్నారు. సాయంత్రం 4.30 గంటల నుంచి ప్రారంభమయ్యే ఈ రథయాత్ర భక్తి పారవశ్యంతో సాగనుంది. రథయాత్రకు విశ్వ హిందూ పరిషత్ ట్రస్టీ పుట్టగుంట వెంకట సతీష్ ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. ఈ యాత్ర ఏలూరు రోడ్డులోని ఆర్య వైశ్య కళ్యాణ మండపం వద్ద నుంచి ప్రారంభమవుతుంది. జగన్నాథుడు, బలభద్రుడు, సుభద్రాదేవి ఉత్సవ విగ్రహాలను సుందరంగా అలంకరించిన రథంపై ఊరేగిస్తూ భక్తులకు దర్శనమివ్వనున్నారు. ఈ సందర్భంగా హరినామ సంకీర్తనలు, భజనలు, ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. భక్తులు కుటుంబ సభ్యులతో కలిసి అధిక సంఖ్యలో పాల్గొని రథాన్ని లాగి శ్రీ జగన్నాథుని అనుగ్రహం పొందాలని ఇస్కాన్ నిర్వాహకులు కోరారు.

## విద్యార్థి దశ నుండి భూసార పరిరక్షణ శిక్షణ

### -కెవికె ప్రొఫెసర్ రాజ్ కుమార్

**విస్సన్నపేట,జూలై 22 (వార్తాప్రభ) :** స్థానిక మండలంలోని నరసాపురం గురుకుల పాఠశాల,జిల్లా పరిషత్ హైస్కూల్ నందు భూసార పరిరక్షణ పథకం గురించి జిల్లా వనరుల కేంద్రం ఆధ్వర్యంలో విద్యార్థులకు కెవికె ప్రొఫెసర్ రాజశేఖర్ అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వనరుల కేంద్ర వ్యవసాయ అధికారిణి కే పద్మజా రాణి, విస్సన్నపేట ఏవో ఉషారాణి, నరసాపురం బాలికల గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ శ్యామల రైతు సేవ సిబ్బంది పాల్గొన్నారు.

## దస్తావేజు లేఖరులపై కూటమి ప్రభుత్వం సవతి ప్రేమ...

**గుడ్లవల్లేరు,జూలై 22 (వార్తాప్రభ) :** దస్తావేజు లేఖరులపై కూటమి ప్రభుత్వం సవతి తల్లి ప్రేమ చూపుతుందని కౌతవరం శాఖ దస్తావేజు లేఖరుల సంక్షేమ సంఘ నాయకులు ఆరోపించారు. రిజిస్ట్రేషన్ శాఖను ప్రైవేటీకరణ చేయవద్దని ఒక పక్కన తాము ఆందోళన చేస్తుంటే... ప్రభుత్వం వారు మాత్రం తమతో సంబంధం లేకుండా బుధవారం రిజిస్ట్రేషన్లను చేయించటంపై ఆందోళన వ్యక్తం చేశారు. తమ న్యాయమైన కోర్కెల కొరకు దస్తావేజు లేఖరులు, డిటిపి ఆపరేటర్స్, స్టాంపు వెండర్లు అంతా ఆందోళన చేస్తుంటే...మరొక పక్కన రిజిస్ట్రేషన్ చేయించే ప్రభుత్వ నియంతత్వ విధానాన్ని తప్పుబట్టారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వారు రిజిస్ట్రేషన్ శాఖను ప్రైవేటీకరణ చేస్తూ జారీ చేసిన జీవో 396ను రద్దు చేయాలని కోరారు. దాని వలన దస్తావేజు లేఖ-రులు, డిటిపి ఆపరేటర్స్, స్టాంపు వెండర్లు వత్తిపై ఆధారపడి జీవనం సాగించే వారందరికి నష్టం కలుగుతుందన్నారు. ప్రజల ఆస్తుల భద్రతకు కూడా నష్టం వాటిల్లుతుందని వాపోయారు.

## శ్రీ తిరుపతమ్మ అమ్మ వారికి పాపమాంబ వంశీకుల సారె....

**పెనుగంచిప్రోలు, జూలై 22 (వార్తాప్రభ) :** పెనుగంచిప్రోలు లో వేంచేసి ఉన్న శ్రీ తిరుపతమ్మ అమ్మ వారికి పాప మాంబ వంశానికి చెందిన ఆలయ పూజారులు, వారి కుటుంబికులు బుధవారం ఆషాడం సారె సమర్పించారు.మేళ్ల తాళాలు, మంగళ వాద్యాలు మధ్య వైభవంగా ప్రతి సంవత్సరం ఆషాడం లో పాప మాంబ వంశానికి చెందిన కుటుంబీ కులు అమ్మ వారికి సారె సమర్పించడం ఆనవాయితీగా వస్తుంది. అనంతరం భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చు కున్నారు..

# సోమన్న "సిరిమల్లె చెట్టు" నూట మూడవ (103)పుస్తకావిష్కరణ

**హనుమకొండ, జూలై 22: :**(వార్తా ప్రభ ప్రతినిధి)నందవరం మండల పరిధిలోని జడ్పీహెచ్ స్కూల్ నాగలదిన్నెలో గణితోపాధ్యాయుడుగా పనిచేస్తున్న బాలబంధు గద్వాల సోమన్న నూట మూడవ (103 )పుస్తకం "సిరిమల్లె చెట్టు" పుస్తకావిష్కరణ సమతా హైస్కూల్, హన్మకొండ,తెలంగాణలో ఘనంగా జరిగింది. అరసం ఉమ్మడి వరంగల్ జిల్లా ఆధ్వర్యంలో, మహా కవి దశరథి 101వ జయంతి సందర్భంగా మారేడుకొండ బ్రహ్మచారి,ముఖ్య అతిథి డా. పల్లేరు వీరాస్వామి, విశిష్ట అతిథి కరుణా సాగర్ రావు,విశ్రాంత జిల్లా విద్యాధికారి రమేశ్వర్ రాజు ల చేతుల మీదుగా ఆవిష్కరించారు. అనంతరం ఈ సంస్థ బాలసాహిత్యంలో వీరి విశేష కృషికి గాను తగురీతిగా సత్కరించారు.ఈ కార్యక్రమంలో వి. మల్లేష్, బూర భిక్ష పతి, గుండు కోటేశ్వరరావు...పాల్గొన్నారు. శతాధిక గ్రంథకర్త, కృతికర్త గద్వాల సోమన్న ను తోటి ఉపాధ్యాయులు, శ్రేయోభిలాషులందరూ అభినందించారు.

జవహర్ నగర్ లో ఓటరు జాబితా సవరణ కార్యక్రమంలో పాల్గొన్న...

# డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మాజీ మేయర్ దొంతగాని కోటేశ్ గౌడ్.

**మాజీ డిప్యూటీ మేయర్ రెడ్డి శెట్టి శ్రీనివాస్.**

**జవహర్ నగర్, జూలై 22:**(వార్తా ప్రభ)కీసర సర్కిల్ జవహర్ నగర్ డివిజన్ లో గల బజరంగ్ నగర్ కాలనీలో సర్ ప్రక్రియ ప్రచారాన్ని ప్రారంభించిన డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మాజీ మేయర్ దొంతగాని శాంతి కోటేష్ గౌడ్, మరియు మాజీ డిప్యూటీ మేయర్ రెడ్డి శెట్టి శ్రీనివాస్, ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఓటరు జాబితా కార్యక్రమంలో భాగంగా పలు కాలనీలలో సందర్శించి ఓటరు వివరాలను పరిశీలించి ప్రజలకు ఓటర్ సవరణపై అవగాహన కల్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సినీయర్ నాయకులు, మరియు కాలనీ అధ్యక్షులు, కుతాడి శ్వేతా ముఖేష్, మాజీ-కో ఆప్షన్ నెంబర్ జేఎంసి.కే . సత్యనారాయణ, బజరంగ్ నగర్ కాలనీ మాజీ అధ్యక్షులు,కే . నరసింహులు, కోళ్ల ఫారం- జ్యోతి కాలనీ పేస్ - 2 కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు పి.కేశవ రెడ్డి, బజరంగ్ నగర్ కాలనీ పేస్ -2 వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు గవర సూర్యనారాయణ,జ్యోతి కాలనీ అధ్యక్షులుఆకుల ప్రభాకర్, ఏడుకొండల శ్రీనివాస్, కాలనీ వాసులు,వర్ణ శ్రీధర్ రెడ్డి గారు పోరెడ్డి వెంకటేశ్వర్లు, టి సి కె నారాయణ,సుబ్బారావు, రామచంద్ర,రామ తులసి, విజయలక్ష్మి, సరోజినీ దేవి, బి. సరస్వతి నాయుడు, పోరెడ్డి కవత, తదితరులు పాల్గొన్నారు.

# కూటమి ప్రభుత్వం రైతు సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తుంది.

**కోదూరు, జులై 22 (వార్తా ప్రభ):**రైతు సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని కోదూరు పిఏసీఎస్ అధ్యక్షులు పూత బోయిన కరుణ కుమార్,త్రిసభ్య కమిటీ సభ్యులు పూతబోయిన శ్రీనివాసరావు మల్లా వెంకటేశ్వరావు అన్నారు.బుధవారం స్థానిక పిఏసీఎస్ వద్ద యూరియా పంపిణీ కార్యక్రమాన్ని త్రిసభ్య కమిటీ సభ్యులు ప్రారంభించారు.ఈసందర్భంగా రైతులకు ప్రస్తుతం కావలసిన యూరియా అందుబాటులో ఉందని, ఎరువుల కొరకు వచ్చే రైతులు,ముందుగా ఆన్లైన్ లో ఎరువులు బుక్ చేసుకోవాలని, ఎరువుల కార్డు తప్పని సరిగా తీసుకు రావాలని తెలిపారు.,పిఏసీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రజల సమస్యల పరిష్కారం కోసమే 'ప్రజాదర్బారు

**మైలవరం జూలై 22: :(వార్తా ప్రభ ప్రతినిధి):**ప్రజల సమస్యల పరిష్కారం కోసమే 'ప్రజాదర్బారు ' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణ ప్రసాద్ అన్నారు.బుధవారం మైలవరంలో నిర్వహించిన ప్రజాదర్బారు కార్యక్రమంలో ప్రజల నుంచి వినతిపత్రాలు స్వీకరించి వారి సమస్యలను తెలుసుకున్నారు.వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు రహదారుల అభివృద్ధి, డ్రైనేజీ వ్యవస్థ మెరుగుదల, ఇళ్ల స్థలాల మంజూరు, భూ సమస్యలు, హౌసింగ్, రెవెన్యూ, విద్యుత్, తాగునీరు తదితర అంశాలపై వినతులు సమర్పించారు.సమస్యలను పరిశీలించిన ఎమ్మెల్యే సంబంధిత శాఖల అధికారులతో మాట్లాడి తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.ప్రజాహితమే ప్రభుత్వ అభిమతమని, ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని పరిష్కరించేందుకు కూటమి ప్రభుత్వం ప్రత్యేకంగా కృషి చేస్తోందని ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాదు తెలిపారు.ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరేలా చర్యలు తీసుకుంటున్నామని, అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండి సేవలు అందించాలని సూచించారు.అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి ప్రజల సమస్యలను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని ఆదేశించా రు.ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

# డంపింగ్ యార్డు ఎత్తివేసేంతవరకు పోరాటం ఆగదు.

**● స్పష్టం చేసిన జవహర్ నగర్ మాజీ సర్పంచ్, పోరాటకమిటి గౌరవ సలహాదారుడు రావల్ కోల్ నర్సింహ్మా గౌడ్.● నందమూరి నగర్ లో 26 న, డి.ఎన్.ఆర్.ఫంక్షన్ హాలులో డంపింగ్ యార్డు ఎత్తివేతకై జరిగే సదస్సును జయప్రదం చేయాలని 12 వ రోజు జరిగిన పాదాయాత్ర.**

**జవహర్ నగర్, జూలై 22:**(వార్తా ప్రభ)ప్రాణాలైన అర్పిస్తాంగానీ, డంపింగ్ యార్డు ఎత్తివేసేంతవరకు జవహర్ నగర్ డంపింగ్ యార్డు ఎత్తివేత పోరాటకమిటి ఆధ్వర్యంలో జరిగే పోరాటాలు మాత్రం ఆపబోమని జవహర్ నగర్ మాజీ ఉపసర్పంచ్, కమిటీ గౌరవ సలహాదారులు రావల్ కోర్ నర్సింహ్మ గౌడ్ స్పష్టం చేశారు. ఆయన అధ్యక్షతన 2026, జూలై-22 న, బుదవారం రోజు, కీసర సర్కిల్, జీహెచ్ఎంసీ, నందమూరి నగర్ లో 12 వ రోజు పాదయాత్ర జరిగింది. ఈసందర్భంగా డంపింగ్ యార్డు పరిసర ప్రాంతాల్లో ప్రజల ఆరోగ్యాలను, వారి మనుగడను ప్రశ్నార్థకం చేస్తున్న రాంకీ చెత్త డంపింగ్ తొలగింపు అవసరాన్ని గుర్తుచేశారు. సామాజిక బాధ్యతను గుర్తించి, ఎవరికి వారు స్వచ్ఛందంగా తమ బావిభారత పిలల్లకు మంచి సమాజాన్ని అందించాల్సిన అవసరాన్ని గుర్తించి, 26 న, ఆదివారం రోజు డి.ఎన్.ఆర్. ఫంక్షన్ హాలులో జరిగే పర్యావరణ, మేదావుల సదస్సును జయప్రదం చేయాలని కోరారు. చైర్మన్ షేక్ షావలి, కోశాధికారి, ఐ.ఎఫ్.టి.యు. పి.శివబాబు, కో కన్వీనర్స్ సిపిఐ తోటపల్లి శంకర్, సిపిఎం శివన్నారాయణ, నగేష్, బహుజన సత్త, సర్పంచుల సంఘం నాయకులు బండకింది సింగరయ్య గౌడ్, పిఓడబ్ల్యూ(విముక్తి) పెర్క సునీత, పిఓడబ్ల్యూ జయసుధ, ఫాతిమా తదితరులు ఈపై కార్యక్రమంలో పాల్గొన్నారు.

# మోదీ ప్రభుత్వం కాదు....బ్రిటిష్ ప్రభుత్వం!!

**● రాహుల్ అరెస్టుపై కాంగ్రెస్ ఆగ్రహం ● ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలి ● నీట్ లీకేజీపై కేంద్రానికి చురకలు ● రామగుండం ఎమ్మెల్యే ఎం.ఎస్. రాజ్ ఠాకూర్**

**పెద్దపల్లి బ్యూరో చీఫ్, జూలై 22 (వార్తాప్రభ):**కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ విధానాలకు నిరసనగా బుధవారం గోదావరిఖని మున్సిపల్ కార్యాలయం ఎదుట రాజీవ్ రహదారిపై కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో భారీ ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా రామగుండం ఎమ్మెల్యే ఎం.ఎస్. రాజ్ ఠాకూర్ మాట్లాడుతూ, కేంద్రంలో ఉన్నది మోడీ ప్రభుత్వం కాదు బ్రిటిష్ ప్రభుత్వం అని తీవ్ర స్థాయిలో ఆక్రోషం వ్యక్తం చేశారు. దేశవ్యాప్తంగా యువత భవిష్యత్తును దెబ్బతీసిన నీట్ పేపర్ లీకేజీ ఘటనపై కేంద్ర ప్రభుత్వం నైతిక బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. ఈ వ్యవహారంలో కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే రాజీనామా చేయాలని కోరారు. బాధిత విద్యార్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ నిర్వహించిన శాంతియుత నిరసన సందర్భంగా లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీని అరెస్టు చేయడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని ఆయన విమర్శించారు. ప్రశ్నించే గొంతుకలను అణచివేయడం, ప్రతిపక్షాలపై దర్యాప్తు సంస్థలను ఉపయోగించడం ప్రజాస్వామ్య వ్యవస్థకు మంచిది కాదని అన్నారు. రాజ్యాంగం కల్పించిన హక్కులను ప్రతి ఒక్కరూ గౌరవించాలని, ప్రజాస్వామ్య విలువలను కాపాడాల్సిన బాధ్యత పాలకులపై ఉందని తెలిపారు. ప్రజల సమస్యలను పరిష్కరించే బదులు విమర్శలను అణచివేసే ధోరణి దేశానికి మేలు చేయదని అభిప్రాయపడ్డారు. ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం కాంగ్రెస్ పార్టీ తన పోరాటాన్ని కొనసాగిస్తుందని స్పష్టం చేశారు. ఈ నిరసనలో రామగుండం నగర మేయర్, డిప్యూటీ మేయర్, కార్పొరేషన్ అధ్యక్షుడు, పెద్దపల్లి జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్, కార్పొరేటర్లు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. దీంతో రాజీవ్ రహదారి కొంతసేపు నినాదాలతో మార్మోగింది. ట్రాఫిక్ జామ్ అయి వాహనదారులు ఇబ్బంది పడ్డారు.

# రూ.60 లక్షలతో డిజిటల్ లైబ్రరీ!!

**● విద్యార్థులకు ఆధునిక అధ్యయన కేంద్రం ● ఈ-లెర్నింగ్ సౌకర్యాలతో గ్రంథాలయం ● డిజిటల్ విజ్ఞానానికి కొత్త వేదిక రామగుండం ● స్టూడెంట్స్ కోసం హైటెక్ లెర్నింగ్ హబ్ ● ఈ-లెర్నింగ్ సౌకర్యాలతో గ్రంథాలయం ● ఎమ్మెల్యే ఎం.ఎస్. రాజ్ ఠాకూర్**

**పెద్దపల్లి బ్యూరో చీఫ్, జూలై 22 (వార్తాప్రభ):**రామగుండం నగర యువత, విద్యార్థులకు ఆధునిక విద్యా వనరులను అందుబాటులోకి తీసుకురావాలనే లక్ష్యంతో రూ. 60 లక్షల వ్యయంతో అత్యాధునిక డిజిటల్ లైబ్రరీ ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. రామగుండం నగరపాలక సంస్థ పరిధిలోని పాత సోషల్ వెల్ఫేర్ హాస్టల్ భవనంలో ఏర్పాటు కానున్న ఈ లైబ్రరీ పనులకు బుధవారం రామగుండంలోని జడ్పీహెచ్ఎస్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే ఎం.ఎస్. రాజ్ ఠాకూర్ శంకుస్థాపన చేశారు. జిల్లా ఖనిజ ఫౌండేషన్ ట్రస్ట్ నిధులతో చేపట్టనున్న ఈ ప్రాజెక్టు విద్యార్థులకు సాంకేతిక ఆధారిత అధ్యయన వేదికగా నిలవనుంది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నేటి డిజిటల్ యుగంలో పోటీ పరీక్షలు, ఉన్నత విద్య, ప్రభుత్వ ఉద్యోగాల కోసం సిద్ధమవుతున్న యువతకు అత్యాధునిక సౌకర్యాలతో కూడిన గ్రంథాలయం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. సంప్రదాయ పుస్తకాలతో పాటు కంప్యూటర్లు, హైస్పీడ్ ఇంటర్నెట్, ఈ-బుక్స్, డిజిటల్ లెర్నింగ్ మెటీరియల్, పోటీ పరీక్షల అధ్యయన వనరులు, సౌకర్యవంతమైన ఫర్నీచర్‌తో లైబ్రరీని తీర్చిదిద్దనున్నట్లు తెలిపారు. దీంతో ప్రైవేట్ లైబ్రరీలపై ఆధారపడాల్సిన అవసరం తగ్గి నాణ్యమైన విద్యా వాతావరణం అందుబాటులోకి వస్తుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యాభివృద్ధికి అత్యంత ప్రాధాన్యత ఇస్తూ విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని ఇలాంటి మౌలిక సదుపాయాలను కల్పిస్తోందని చెప్పారు. నియోజకవర్గంలో సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలను సమన్వయం చేస్తూ ప్రతి వర్గానికి ప్రయోజనం చేకూరేలా పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతటి అన్నయ్య గౌడ్ మాట్లాడుతూ డిజిటల్ లైబ్రరీలు పఠన సంస్కృతిని బలోపేతం చేయడంతో పాటు గ్రామీణ, పట్టణ విద్యార్థులకు సమాన అవకాశాలు కల్పిస్తాయని అన్నారు. నగర మేయర్ మహంకాళి స్వామి మాట్లాడుతూ వేలాది మంది విద్యార్థులు, యువతకు ఈ కేంద్రం విద్యా పురోగతికి దోహదపడుతుందని, నగరంలో మరిన్ని విద్యా సదుపాయాల కల్పనకు కృషి కొనసాగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, కార్పొరేటర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, విద్యార్థులు, యువత, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని డిజిటల్ లైబ్రరీ నిర్మాణానికి తమ మద్దతు తెలిపారు.

# జెండా గౌరవం చాటిన లయన్స్ క్లబ్!!

**● జాతీయ పతాకానికి ఘన నివాళి ● త్రివర్ణ పతాక విశిష్టతపై అవగాహన ● విద్యార్థులతో జెండా స్వీకరణ దినోత్సవం ● త్రివర్ణ పతాకం దేశ గౌరవ చిహ్నం ● సోమారపు లావణ్య**

**పెద్దపల్లి బ్యూరో చీఫ్, జూలై 22 (వార్తాప్రభ):**జాతీయ జెండా స్వీకరణ దినోత్సవం సందర్భంగా లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో విద్యార్థులతో దేశభక్తిని పెంపొందించే ప్రత్యేక కార్యక్రమాన్ని బుధవారం గోదావరిఖని ప్రధాన చౌరస్తాలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు చేతుల్లో త్రివర్ణ పతాకాలను పట్టుకుని ఉత్సాహంగా జాతీయ జెండాను రెపరెపలాడిస్తూ దేశభక్తి నినాదాలతో కార్యక్రమాన్ని ఆకట్టుకునేలా నిర్వహించారు. అనంతరం సోమారపు లావణ్య మాట్లాడుతూ, 1947 జూలై 22న భారత రాజ్యాంగ సభ త్రివర్ణ పతాకాన్ని దేశ జాతీయ జెండాగా అధికారికంగా ఆమోదించిన చారిత్రక ఘట్టాన్ని గుర్తు చేశారు. జాతీయ పతాకం దేశ సమైక్యత, సార్వభౌమత్వం, త్యాగం, శాంతి, ప్రగతికి శాశ్వత ప్రతీక అని తెలిపారు. స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలకు గుర్తుగా నిలిచే జాతీయ జెండాను ప్రతి భారతీయుడు అత్యంత గౌరవంతో చూడాలని, దాని ఔన్నత్యాన్ని భావితరాలకు తెలియజేయడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. విద్యార్థులు చిన్నప్పటి నుంచే దేశభక్తి, క్రమశిక్షణ, సేవాభావం, జాతీయ విలువలను అలవర్చుకుని బాధ్యతాయుత పౌరులుగా ఎదగాలని సూచించారు. త్రివర్ణ పతాకంలోని కాషాయం త్యాగానికి, తెలుపు శాంతికి, ఆకుపచ్చ అభివృద్ధికి, అశోక చక్రం నిరంతర ప్రగతికి ప్రతీకగా నిలుస్తాయని వివరించారు. దేశ గౌరవాన్ని కాపాడే బాధ్యత యువతపై ఎక్కువగా ఉందని వివరిస్తూ, జాతీయ పతాకం పట్ల గౌరవభావం ప్రతి ఇంటిలో పెంపొందించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సభ్యులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొని దేశభక్తి ప్రతిజ్ఞ చేశారు.

వార్తా ప్రభ
హైదరాబాద్

# వ్యాధికి చికిత్స కన్నా నివారణే ఉత్తమం

**ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన అవగాహన కార్యక్రమంలో డాక్టర్ సుధాకర్ బండారి**

**శేరిలింగంపల్లి,జూలై 22 (వార్తాప్రభ):**వర్షాకాలంలో వచ్చే సీజనల్ వ్యాధులపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రూపొందించిన కరపత్రాన్ని బుధవారం కొండాపూర్ డివిజన్ పరిధిలోని రంగారెడ్డి జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో ఆవిష్కరించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆస్పత్రి ఇన్‌చార్జ్ సూపరింటెండెంట్ డాక్టర్ సుధాకర్ బండారి మాట్లాడుతూ వ్యాధికి చికిత్సకన్నా నివారణే ఉత్తమమని అన్నారు.వర్షాకాలంలో అతిసారం,డెంగ్యూ, మలేరియా,మెదడువాపు వంటి వ్యాధులతో పాటు కోవిడ్ వేరియంట్లు కూడా ప్రబలే అవకాశం ఉంటుందని తెలిపారు.పరిశుభ్రమైన ఆహారం,కాచి చల్లార్చిన నీరు తీసుకోవడం, పరిసరాలను శుభ్రంగా ఉంచడం,నిల్వ నీరు లేకుండా చూడడం,భోజనానికి ముందు చేతులు శుభ్రంగా కడుక్కోవడం వంటి జాగ్రత్తలు పాటించాలని సూచించారు.అలాగే నిత్యం వ్యాయామం,నడక,ధ్యానం చేయడంతో పాటు పౌష్టికాహారం తీసుకోవాలని,అవసరమైతే మాస్క్ ధరించాలని చెప్పారు. అనారోగ్య లక్షణాలు కనిపించిన వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచించారు.ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కన్వీనర్ తాడిబోయిన రామస్వామి యాదవ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆర్ఎంఓ డాక్టర్ విజయకుమారి,తాటిచర్ల వరలక్ష్మి,జి.వి.రావు,పాలం శ్రీను,కొక్కుల జనార్దన్, విష్ణుప్రసాద్,అనూష,కొవ్వూరి తదితరులు పాల్గొన్నారు.

# ప్రైవేటు పాఠశాలలపై దౌర్జన్యాలకు పాల్పడితే చర్యలు తప్పవు

**కూకట్ పల్లి,జూలై 22(వార్తాప్రభ):** ప్రైవేట్ పాఠశాలల పై దౌర్జన్యాలకు పాల్పడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని ట్రస్మా నాయకులు మల్కాజ్గిరి పోలీస్ కమిషనర్ సుమతికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఆమెకు సంఘం ప్రతినిధి బృందం వినతి పత్రాన్ని అందజేసింది. విద్యార్థి సంఘాల పేరుతో, కుల సంఘాల పేరుతో, ఆర్టిఐ యాక్టివిష్టుల పేరుతో పాఠశాల నిర్వాహకులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని వారు వాపోయారు. డబ్బు వాసులే ప్రధానంగా ఇలాంటివారు పాఠశాలల నిర్వహకులను ఇబ్బంది చేస్తున్న విషయాన్ని ఆమె దృష్టికి తీసుకువచ్చారు. తాజాగా ఉప్పల్ ప్రాంతంలో కొందరిపై కేసులు నమోదు అయినట్లు కూడా ఆమెకు తెలిపారు.

**కఠిన చర్యలు తీసుకుంటాం:** పసుళ్ళకు పాల్పడుతున్నటువంటి వారి పట్ల కఠిన చర్యలు తీసుకుంటామని మల్కాజ్గిరి పోలీస్ కమిషనర్ సుమతి తమకు స్పష్టమైన హామీని ఇచ్చారని వారు ఈ సందర్భంగా తెలిపారు. పాఠశాల నిర్వహకుల పట్ల అనుచితంగా వ్యవహరిస్తున్న వారిని ఉపేక్షించవద్దని సూచించారు. ఎవరు డబ్బులు డిమాండ్ చేసిన వెంటనే పోలీసులను సంప్రదించి ఫిర్యాదు చేయాలని ట్రస్మా సభ్యులకు సూచించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ గుర్తింపు పొందిన ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాల సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎస్ ఎన్ రెడ్డి, అసోసియేట్ అధ్యక్షులు రామేశ్వర్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి బిరు ఆంజనేయులు, ఉప్పల్ అధ్యక్షులు వెంకటేశ్వరరావు, పలు పాఠశాలల కరస్పాండెంట్స్ కిరణ్ కుమార్ రెడ్డి, ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

# పలు గ్రామాల్లోపాలం పిలుస్తుంది కార్యక్రమం పై అవగాహన సదస్సు

**కోదూరు జూలై 22 (వార్తా ప్రభ):**కోదూరు మండలం సాలెంపాలెం మరియు పిట్టలంక గ్రామాలలో పొలం పిలుస్తుంది అవగాహన సదస్సు నిర్వహించారు .ఈ కార్యక్రమంలో భాగంగా ఎల్నినో మరియు వర్షాభావ పరిస్థితులను రైతులకు వివరిస్తూ, సాగు నీరు మరియు వర్షాలను దృష్టిలో పెట్టుకుని, వాటిని గమనించుకుంటూ, వ్యవసాయం చేసుకోవాలనిరైతులు తొందరపడి సాగునీరు పరిస్థితులను గమనించకుండా వ్యవసాయం చేసిన ఎడల పెట్టుబడి ఖర్చులు వృధా అవుతాయని కనుక రైతాంగం అంతా కూడా సాగునీరు మరియు వర్షపు నీరు రాకను గమనించుకుంటూ వ్యవసాయ సాగు పనులు మొదలు పెట్టుకోవాలని ఇప్పటికే నాట్లు వేసి సాగును మొదలుపెట్టిన రైతులు తప్పకుండా ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన (గ్రామీణ్) యొక్క పంట ఇన్సూరెన్స్ ను నమోదు చేసుకోవాలని . ఈ ప్రక్రియను పాక్స్ లేదా ఇతర ప్రైవేటు బ్యాంకులలో లేదా మీసేవ సెంటర్ల నందు నమోదు చేసుకోవచ్చని. ఖరీఫ్ సీజన్ లో వరి పంటకు ప్రీమియం అమౌంట్ ఎకరాకు 830/- రూపాయలుగా నిర్ణయించారని ,ప్రీమియం కట్టే చివరి తేదీ 15.08.2026. వరకు అనిఇప్పటికే నాట్లు వేసిన రైతులు తమ యొక్క పంటను ఈపంటలో, నమోదు అయ్యేవిధంగా చేసుకోవాలని తెలిపారుఅదే విధంగా అన్నదాత సుఖీభవ మరియు పీఎంకిసాన్ కొంత మందికి , ఈ దఫాలో, నో ల్యాండ్ అనే రిమార్కు వచ్చి డబ్బులు జమ అవ్వలేదు, అటువంటి వాళ్ళందరూ , వెంటనే ఈ సంవత్సరం రెండో విడత పడే లోపు తమ ఆధార్ మరియు తమ భూమితో, మీభూమి పోర్టల్ లో లింక్ అయ్యేవిధంగా చేసుకున్నట్లైతే, డబ్బులు జమ అవుతాయని తెలిపారు

# సంపాదకీయం

## నైతిక రాజీనామాలు... కాలం చెల్లిన నినాదాలు !

నైతికతతో కూడిన రాజీనామాలు చేయాలి అంటే అది గత కాలంలో. అంటే అంతా బాగున్ననాడు. ఆ పక్షం ఈ పక్షం అంతా రాజకీయ పక్షం వహించకుండా దేశ హితం వైపు ఆలోచించినపుడు కొనసాగిన నైతిక నిష్ఠ అది. కానీ అన్ని విధాలుగా కాలం మారింది. ఏ మాట నుంచి అయినా రాజకీయ లాభం రాబట్టే కాలమిది. అంతే కాదు నీతిగా తప్పుకుంటే హర్షించి మంచిగా చప్పట్లు కొట్టే వెర్రిబాగుల కాలం కానేకాదిది. తప్పు ఒప్పుకున్నా లేదా బాధ్యత వహించినా మరింతగా ఇరికించి సర్వానందం పొందే నైజమిది. అందుకే నైతిక రాజీనామాలు లేవు, ఆ ఊసులు అంతకంటే లేవు ఈ దేశంలో 1952 నుంచి సార్వత్రిక ఎన్నికలు జరుగుతూ వచ్చాయి. కేంద్రంతో పాటు అనేక రాష్ట్రాలలో ప్రభుత్వాలు అలా ఏర్పాటు అవుతూ వచ్చాయి. అయితే మాట పట్టింపు కోసం కూడా రాజీనామాలు చేసిన తరాలను కూడా ఈ దేశం చూసింది. పండిట్ నెహ్రూ కేబినెట్ ఓ తొలి మంత్రి వర్గంలో ఉన్న జనసంఘ్ వ్యవస్థాపకుడు డాక్టర్ శ్యాం ప్రసాద్ ముఖర్జీ అలాగే చేశారు. ఒక సిద్ధాంతం నమ్మిన వారిగా ఆయన నచ్చక తప్పుకున్నారు. అలాగే తరువాత రోజులలో అనేక మంది తమ శాఖలలో తప్పులు జరిగాయని నైతిక బాధ్యత వహిస్తూ రాజీనామాలు చేసిన ఉదంతాలు కళ్ళ ముందు కనిపిస్తాయి.ఇక ఒక్కసారి కనుక వెనక్కి వెళ్ళి చూస్తే భారతదేశ చరిత్రలో నైతిక బాధ్యత వహిస్తూ తమ పదవులకు రాజీనామా చేసిన ప్రముఖులు అనేకమంది కనిపిస్తారు. వారులో ఈ దేశానికి ప్రధానిగా పనిచేసిన లాల్ బహదూర్ శాస్త్రి నెహ్రూ కేబినెట్ లో రైల్వే మంత్రిగా ఉన్నపుడు 1956లో తమిళనాడులో జరిగిన ఘోర రైలు ప్రమాదానికి నైతిక బాధ్యత వహిస్తూ తన పదవికి రాజీనామా చేశారు. తొలి తరం కాంగ్రెస్ నాయకుడు టిటి కృష్ణమాచారి 1958లో నెహ్రూ ప్రభుత్వంలో కేంద్ర ఆర్థిక మంత్రిగా ఉన్న సమయంలో ముంద్రా స్కాండల్ పేరుతో ప్రచారంలోకి వచ్చిన ఒక ఆర్థిక కుంభకోణం నేపథ్యంలో ఈ వ్యవహారంలో ప్రత్యక్ష ప్రమేయం లేకపోయినా ఆర్థిక మంత్రిగా నైతిక బాధ్యత వహిస్తూ ఆయన తన మంత్రి పదవికి రాజీనామా చేశారు. అదే విధంగా అటల్ బిహారీ వాజ్ పేయి ప్రభుత్వంలో రైల్వే మంత్రిగా పనిచేసిన నితీష్ కుమార్ కూడా 1999లో పశ్చిమ బెంగాల్‌లో జరిగిన గైసాల్ రైలు ప్రమాదంలో దాదాపు 280 మందికి పైగా మరణించిన సంఘటనలో తన పదవికి రాజీనామా చేశారు. ఇక దాదాపుగా చివరిసారిగా అనుకోవచ్చు 2008 ముంబై ఉగ్రవాద దాడుల నేపథ్యంలో అప్పటి మహారాష్ట్ర హోం మంత్రి ఆర్ఆర్. పాటిల్, అలాగే అప్పటి ముఖ్యమంత్రి విలాస్‌రావ్ దేశ్‌ముఖ్ లు కూడా భద్రతా వైఫల్యాలకు నైతిక బాధ్యత వహిస్తూ తమ పదవుల నుండి తప్పుకున్నారు. ఇక వివిధ రాష్ట్రాలలో అనేకమంది తమ పదవులకు నైతిక బాధ్యత పేరుతో రాజీనామా చేశారు. అయితే కాలగమనంలో పదవులకు రాజీనామా అన్నది కూడా రాజకీయ సవాళ్ళ ప్రతిసవాళ్ళ వ్యూహంగా మారుతోంది. దాంతో నైతిక రాజీనామాలు పెద్దగా కనిపించడం లేదు. ప్రస్తుతం కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా విషయంలో డిమాండ్లు విపక్షాల నుంచి వస్తున్నాయి. నీట్ ప్రశ్నపత్రం లీక్ అయింది అన్న దానికి బాధ్యత వహిస్తూ రాజీనామా చేయాలని కోరుతున్నారు. దాంతో నైతిక రాజీనామాల విషయం మరోసారి ప్రస్థావనకు వస్తోంది. అయితే ఇవి ఎపుడైతే రాజకీయ అస్త్రాలుగా మారుతున్నాయో నినాదాలకు కూడా కాలం చెల్లుతోంది అన్న భావన ఏర్పడింది.

# భూగర్భ డ్రైనేజీ పొంగకుండా శాశ్వత చర్యలు తీసుకోవాలి

**విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర**

**విజయవాడ పశ్చిమ జులై 22 :(వార్తా ప్రభ ప్రతినిధి)**నగరంలో భూగర్భ డ్రైనేజీ పొంగిపొర్లే సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపే దిశగా అధికారులు నిరంతరం అప్రమత్తంగా ఉండి, ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేపట్టాలని విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర ఆదేశించారు. బుధవారం ఉదయం తన క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా వేముల శ్యామలాదేవి రోడ్, విశాలాంధ్ర రోడ్, మొగల్రాజపురం, బోయపాటి మాధవరావు రోడ్, పిన్నమనేని పాలీక్లినిక్ రోడ్, గాయత్రీనగర్, గురునానక్ కాలనీ, ఆటోనగర్ తదితర ప్రాంతాల్లో పర్యటించి పారిశుద్ధ్య నిర్వహణ, భూగర్భ డ్రైనేజీ వ్యవస్థ, అభివృద్ధి పనులను పరిశీలించారు.ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలోని పలు ప్రాంతాల నుంచి భూగర్భ డ్రైనేజీ పొంగిపొర్లుతున్నట్లు తరచూ ఫిర్యాదులు అందుతున్నాయని పేర్కొన్నారు. ఇలాంటి పరిస్థితులు పునరావృతం కాకుండా ఇంజనీరింగ్ అధికారులు నిరంతరం క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ నిర్వహించాలని సూచించారు. భూగర్భ డ్రైనేజీ లైన్లను క్రమం తప్పకుండా శుభ్రపరుస్తూ, ఎక్కడైనా అడ్డంకులు ఏర్పడితే వెంటనే తొలగించాలని ఆదేశించారు.నగరంలోని అన్ని డ్రైనేజీ పంపింగ్ స్టేషన్ల పనితీరును నిరంతరం పర్యవేక్షిస్తూ, వాటి నిర్వహణను సమర్థవంతంగా చేపట్టాలని తెలిపారు. అవసరమైన చోట పంపింగ్ సామర్థ్యాన్ని పెంచి, మురుగునీరు ఎటువంటి ఆటంకం లేకుండా మురుగునీటి శుద్ధి కేంద్రాలకు చేరేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎస్‌టీపీల పనితీరు సక్రమంగా ఉండేలా నిరంతర పర్యవేక్షణ చేపట్టి, ఎలాంటి సాంకేతిక సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.ప్రతి అసిస్టెంట్ ఇంజనీర్ తమ పరిధిలోని భూగర్భ డ్రైనేజీ వ్యవస్థపై పూర్తి బాధ్యతతో వ్యవహరించాలని కమిషనర్ స్పష్టం చేశారు. డ్రైనేజీ పొంగే పరిస్థితి ఏర్పడకముందే సమస్యలను గుర్తించి పరిష్కరించే విధంగా ప్రణాళికాబద్ధంగా నిర్వహణ చేపట్టాలని, ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా నిరంతర పర్యవేక్షణ కొనసాగించాలని సూచించారు.అనంతరం గాయత్రీనగర్‌లో నిర్మాణంలో ఉన్న అవుట్‌ఫాల్ డ్రెయిన్ పనులను పరిశీలించిన కమిషనర్, నిర్మాణ పనులను నాణ్యతతో పాటు వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. పనులు జరుగుతున్న ప్రాంతాల్లో ప్రజల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, ఏర్పాటు చేసిన బ్యారికేడ్లు, హెచ్చరిక బోర్డులు సరిగ్గా ఉన్నాయా లేవు ఎప్పటికప్పుడు చూసుకోని, ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు.తదుపరి ఆటోనగర్‌లోని గార్బేజ్ ట్రాన్స్‌ఫర్ స్టేషన్‌ను పరిశీలించిన కమిషనర్, అక్కడికి చేరుతున్న వ్యర్థాలను నిల్వ చేయకుండా ఎప్పటికప్పుడు జిందాల్ ప్లాంట్‌కు తరలించేలా అధికారులు ప్రత్యేక పర్యవేక్షణ చేపట్టాలని ఆదేశించారు. వ్యర్థాల నిర్వహణలో ఎలాంటి నిర్లక్ష్యం ఉండకూడదని, నగర పరిశుభ్రతను కాపాడే విషయంలో అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.ఈ పర్యటనలో చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ (ఇన్‌చార్జ్) గోపాల నాయక్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (ఇన్‌చార్జ్) రామారావు, ఇంజనీరింగ్, ప్రజారోగ్య విభాగాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# వ్యర్థాల నుంచి సంపద సృష్టించే కార్యక్రమాలను మరింత విస్తరించాలి

**విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర**

**విజయవాడ పశ్చిమజులై 23 :(వార్తా ప్రభ ప్రతినిధి)**వ్యర్థాలను కేవలం పారవేయాల్సిన చెత్తగా కాకుండా విలువైన వనరులుగా మార్చే దిశగా చేపడుతున్న వేస్ట్ టు వెల్త్ కార్యక్రమాలను మరింత విస్తరించి, సమర్థవంతంగా అమలు చేయాలని విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర అధికారులను ఆదేశించారు. బుధవారం ఉదయం తన పర్యటనలో భాగంగా అజిత్ సింగ్ నగర్లో గల ఎక్సెల్ ప్లాంట్ లోని గార్బేజ్ ట్రాన్స్ఫర్ స్టేషన్ లో ఘన వ్యర్థాల నిర్వహణను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, విజయవాడ నగరపాలక సంస్థ ఘన వ్యర్థాల నిర్వహణలో రాష్ట్రానికి ఆదర్శంగా నిలిచేలా పలు వినూత్న కార్యక్రమాలను అమలు చేస్తోందన్నారు. తడి వ్యర్థాలతో సేంద్రియ ఎరువుల తయారీ, పొడి వ్యర్థాల రీసైక్లింగ్, కొబ్బరి పీచు (కోకోపీట్) వ్యర్థాలతో ఎరువులు, మ్యాట్రెస్‌లు, పెన్సిళ్ల తయారీ, పూల వ్యర్థాలతో అగరబత్తుల తయారీ, నిర్మాణ మరియు కూల్చివేత వ్యర్థాలతో పవర్ బ్లాక్స్, ఇటుకలు, ఇతర నిర్మాణ సామగ్రి తయారీ, బయోమెథనైజేషన్ ద్వారా వ్యర్థాల నుంచి ఇంధన ఉత్పత్తి వంటి కార్యక్రమాలు విజయవంతంగా కొనసాగుతున్నాయని తెలిపారు.ఈ కార్యక్రమాల అమలును అధికారులు నిరంతరం పర్యవేక్షిస్తూ నాణ్యతా ప్రమాణాలు పాటించేలా చర్యలు తీసుకోవాలని, వ్యర్థాల విలువను మరింత పెంచే కొత్త సాంకేతికతలు, వినూత్న విధానాలను అధ్యయనం చేసి నగరంలో అమలు చేయాలని ఆదేశించారు. ప్రతి వ్యర్థానికి ఉపయోగం కల్పించే విధంగా ప్రణాళికలు రూపొందించి, వ్యర్థాల నుంచి సంపద సృష్టించే కార్యక్రమాలను మరింత విస్తృత స్థాయికి తీసుకెళ్లాలని సూచించారు.అలాగే, సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ రూల్స్--2026 ప్రకారం ప్రతి ఇంటి వద్దనే తడి, పొడి, గృహ ప్రమాదకర, శానిటరీ వ్యర్థాలను వేర్వేరుగా అందించేలా ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని, మూలం వద్దే వ్యర్థాల వర్గీకరణ జరిగితేనే 'వేస్ట్ టు వెల్త్' కార్యక్రమాలు మరింత విజయవంతమవుతాయని పేర్కొన్నారు.ఈ పర్యటనలో అడిషనల్ కమిషనర్ ప్రాజెక్ట్స్ డాక్టర్ డి.చంద్రశేఖర్, చీఫ్ ఇంజనీర్ పి. సత్యకుమారి, పర్యవేక్షణ ఇంజనీర్లు చంద్రశేఖర్, దుష్యంత్, చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ ఇన్చార్జ్ డాక్టర్ గోపాల నాయక్, అసిస్టెంట్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ అన్నపూర్ణ, సంబంధిత అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# దేశద్రోహ శక్తులకు కాంగ్రెస్ అండ

## ప్రధాని నివాసంపై దాడి యత్నం దేశంపైనే దాడి: బిజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పి.వి.ఎన్. మాధవ్

## విజయవాడ లో బిజెపి భారీ ర్యాలీ

**విజయవాడ పశ్చిమ జూలై 22 :(వార్తా ప్రభ ప్రతినిధి)**నీట్ పరీక్ష అంశంపై ప్రారంభమైన ఢిల్లీ నిరసనలు దేశ సార్వభౌమత్వాన్ని ప్రశ్నించే స్థాయికి చేరుకున్నాయని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పి.వి.ఎన్. మాధవ్ ఆరోపించారు. నిరసన ర్యాలీ లో మాధవ్ మీడియా తో మాట్లాడుతూ దేశ వ్యతిరేక శక్తులకు కాంగ్రెస్ పార్టీ ప్రత్యక్షంగా, పరోక్షంగా మద్దతు ఇస్తోందని విమర్శించారు. విజయవాడలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.ఢిల్లీలో సోనమ్ వాంగ్చుక్ చేపట్టిన నిరసనల్లో అర్బన్ నక్సల్స్, దేశ విద్రోహ శక్తులు చొరబడ్డాయని మాధవ్ ఆరోపించారు. ఆర్టికల్--370 రద్దును వ్యతిరేకించడం, పార్లమెంట్ దాడి కేసు నిందితుడు అఫ్జల్ గురు ఉరితీతను ప్రశ్నించడం, దేశాన్ని ముక్కలు చేస్తామంటూ నినాదాలు చేసే శక్తులకు కాంగ్రెస్, కమ్యూనిస్టు పార్టీలు అండగా నిలవడం అత్యంత ప్రమాదకరమని అన్నారు.ప్రధాని నరేంద్ర మోదీ నివాసంపై దాడి యత్నం దేశంపైనే జరిగిన దాడిగా భావిస్తున్నామని మాధవ్ పేర్కొన్నారు. దీనికి నిరసనగా దేశవ్యాప్తంగా కాంగ్రెస్ కార్యాలయాల ముట్టడికి బీజేపీ పిలుపునిచ్చిందన్నారు. విజయవాడలో శాంతియుతంగా నిరసన తెలుపుతున్న బీజేపీ కార్యకర్తలపై కాంగ్రెస్ శ్రేణులు గుడ్లతో, కర్రలతో దాడి చేయడం వారి హింసాత్మక రాజకీయాలకు నిదర్శనమని మండిపడ్డారు.మన్మోహన్‌సింగ్ ప్రభుత్వ హయాంలో 150కు పైగా పేపర్ లీకులు జరిగిన విషయాన్ని కాంగ్రెస్ మరచిపోయిందని విమర్శించారు. నీట్ ప్రశ్నాపత్రం లీక్ ఘటన వెలుగులోకి రాగానే బాధ్యులపై మోదీ ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకుని అరెస్టులు చేసిందన్నారు. పరీక్షల నిర్వహణ పూర్తై, ర్యాంకు కార్డులు జారీ చేసి కౌన్సెలింగ్ ప్రక్రియ కూడా కొనసాగుతోందని తెలిపారు.రాహుల్ గాంధీ దేశ వ్యతిరేక శక్తులతో చేతులు కలిపి రాజకీయ లబ్ధి పొందాలని చూస్తున్నారని మాధవ్ ఆరోపించారు. దేశద్రోహ కార్యకలాపాలను ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని, చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. దేశ సమైక్యత, ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం బీజేపీ పోరాటం నిరంతరం కొనసాగుతుందని తెలిపారు. పి వి ఎన్ మాధవ్ బిజెపి రాష్ట్ర అధ్యక్షులు ఆధ్వర్యంలో ర్యాలీ గా బయలు దేరి ప్లే కార్డ్ లు ప్రదర్శిస్తూ ఏలూరు రోడ్డు లో నినాదాలు చేస్తూ హోరెత్తించారు.కాంగ్రెస్ పార్టీ కార్యాలయానికి చేరుకోగానే కాంగ్రెస్ కు చెందిన కొందరు కర్రలతో దాడి కి పాల్పడ్డారు ఈ సందర్భంగా ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు అడ్డూరి శ్రీ రామ్ కాంగ్రెస్ దాడి ని అడ్డుకున్నారు. ర్యాలీ ని అడ్డుకునే ప్రయత్నం లో బిజెపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మట్టా ప్రసాద్ పై ఎస్సై భౌతిక దాడి కి ప్రయత్నం చేశారు. చైతన్య శర్మ తదితరులు పై కాంగ్రెస్ గూండాలు దాడి కి ప్రయత్నం చేసాయి . రాష్ట్ర కార్యదర్శులు భోగి రెడ్డి ఆదిలక్ష్మి, బొడ్డు నాగలక్ష్మి, రాష్ట్ర అధికార ప్రతినిధి లు ముళ్ళపూడి రేణుక,షేక్ బాజీ,చిరువోలు బుచ్చి రాజు బిజెపి రాష్ట్ర కార్యాలయం ఇంఛార్జి ఉప్పలపాటి శ్రీనివాసరాజు , కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు చిగురుపాటి కుమారస్వామి, కరినాగలక్ష్మి ,రవీంద్ర రెడ్డి,షర్మిళ,స్వాతిరావు,ఆర్ముగం,కోలపల్లి గణేష్,పిట్టల గోవిందు,చైతన్య శర్మ,నామిశెట్టి వెంకట్,పోతంశెట్టి నాగేశ్వరరావు,తరుణ్ కాకాని,నున్న కృష్ణ,అవ్వారు బుల్లబ్బాయి,కృష్ణారెడ్డి,పైలా సురేష్,పోతిన బేసు వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# జీ ఎన్ ఆర్ ఉన్నత పాఠశాల లో ఘనంగా జాతీయ పతాక ఆవిష్కరణ దినోత్సవ వేడుకలు

**విజయవాడ పశ్చిమ జూలై 22 :(వార్తా ప్రభ ప్రతినిధి)**విజయవాడ పశ్చిమ నియోజకవర్గ పరిధిలోని విద్యాధర పురంలోని జి ఎన్ ఆర్ ప్రభుత్వం ఉన్నత పాఠశాల్లో బుధవారం జాతీయ పతాక ఆవిష్కరణ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. పాఠశాల ప్రధాన ఉపాధ్యాయులు ఈ వేడుకలు ప్రాధాన్యత వివరించారు.1947 జూలై 22న డాక్టర్ బాబూ రాజేంద్రప్రసాద్ నాయకత్వంలోని భారత రాజ్యాంగ సభ భారత జాతీయ జెండాను (త్రివర్ణ పతాకాన్ని) అధికారికంగా ఆమోదించింది. జె.బి. కృపలానీ జెండా కమిటీకి నాయకత్వం వహించగా, పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ రాజ్యాంగ సభలో జెండా ఆమోదానికి తీర్మానాన్ని ప్రతిపాదించారు. కాషాయం, తెలుపు మరియు ఆకుపచ్చ రంగుల (పొడవు వెడల్పు 3:2) క్షితిజ సమాంతర త్రివర్ణ పతాకం, మధ్యలో 24 ఆకుల నేవీ బ్లూ వీల్ (అశోకుని ధర్మచక్రం)తో వున్న జెండాను సభ ఏకగ్రీవంగా ఆమోదించింది.. అందువల్ల ప్రతి సంవత్సరం జూలై 22వ తేదీని భారతదేశంలో "జాతీయ జెండా స్వీకరణ దినోత్సవం లేదా "జాతీయ జెండా దినోత్సవం" గా జరుపుకుంటారు అని పాఠశాల ప్రధానోపాధ్యాయులు వివి రవికుమార్ తెలిపారు.పింగళి వెంకయ్య రూపొందించిన త్రివర్ణ పతాకంలోని రాట్నాన్ని తీసేసి, దాని స్థానంలో అశోకుని ధర్మచక్రాన్ని ఉంచిన జాతీయ జెండాను రాజ్యాంగ సభ ఆమోదించింది. భారత జాతీయ పతాకం కేవలం ఒక జాతీయ చిహ్నం మాత్రమే కాదు. అది మన సార్వభౌమత్వానికి, ఐక్యతకు, సమగ్రతకు మరియు ప్రజాస్వామ్య విలువలకు ప్రతీక అని అన్నారు. జి ఎన్ ఆర్ నగర్ పాలెం సంస్థ ఉన్నత పాఠశాలలో ఈరోజు జరిగిన జాతీయ పతాక ఆవిష్కరణ దినోత్సవ సందర్భంగా కార్యక్రమానికి అధ్యక్షత వహించిన ప్రధానోపాధ్యాయులు జాతీయ జెండా విశిష్టతను తెలియజేశారు. కార్యక్రమంలో పాఠశాల విద్యార్థులు జాతీయ జెండాలను ప్రదర్శనగా ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు వసంత లక్ష్మి ,లత, వాణి, మాధురి తదితరులు పాల్గొన్నారు.

# కాలువల్లో చెత్త వేయొద్దని పడవ లో మైకుల ద్వారా అవగాహన

## వర్షపు నీటి సంరక్షణపై ప్రజలకు విస్తృత ప్రచారం

**విజయవాడ పశ్చిమ జులై 22 :(వార్తా ప్రభ ప్రతినిధి)**వర్షపు నీటి సంరక్షణ, కాలువల పరిరక్షణ, నగర పరిశుభ్రత లక్ష్యంగా విజయవాడ నగరపాలక సంస్థ బయాలజిస్ట్ సీహెచ్. సూర్య నాయక్ ఆధ్వర్యంలో కృష్ణలంకలోని అంబేద్కర్ పార్క్ వద్ద నుండి 'క్యాచ్ ది రైన్' ప్రచార కార్యక్రమంలో భాగంగా నగరంలోని బందర్ కాలువల్లో పడవ ద్వారా ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. పడవలో కాలువను పర్యవేక్షిస్తూ లౌడ్‌స్పీకర్ల ద్వారా కాలువల్లో చెత్త, ప్లాస్టిక్ వ్యర్థాలు వేయవద్దని, క్యాచ్ ది రైన్ కార్యక్రమంలో భాగంగా వర్షపు నీటి సంరక్షణ, ఇంకుడు గుంతల ఏర్పాటు, భూగర్భ జలాల పరిరక్షణపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో భాగంగా పడవలో కాలువలను పర్యవేక్షిస్తూ, లౌడ్ స్పీకర్ల ద్వారా ప్రజలకు అవగాహన కల్పించారు. కాలువల్లో ప్లాస్టిక్ కవర్లు, గృహ వ్యర్థాలు, నిర్మాణ వ్యర్థాలు, ఇతర చెత్తను వేయవద్దని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. కాలువల్లో చెత్త వేయడం వల్ల వర్షాకాలంలో నీటి ప్రవాహానికి ఆటంకం ఏర్పడి వరదలు, నీటి నిల్వ, ప్రజారోగ్య సమస్యలు తలెత్తే ప్రమాదం ఉందని వివరించారు.అలాగే వర్షపు నీటిని వృథా చేయకుండా ప్రతి ఇల్లు, అపార్ట్‌మెంట్, వాణిజ్య సముదాయం, ప్రభుత్వ కార్యాలయంలో ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. వర్షపు నీటిని భూగర్భ జలాల్లోకి ఇంకించడం ద్వారా భూగర్భ జలాల మట్టం పెరగడంతో పాటు భవిష్యత్ తరాలకు నీటి భద్రత కల్పించవచ్చని అవగాహన కల్పించారు.ప్రజలు నగర పరిశుభ్రతను కాపాడడంలో భాగస్వాములు కావాలని, కాలువల్లో చెత్త వేయకుండా నిర్ణీత ప్రదేశాల్లో మాత్రమే వ్యర్థాలను అందించాలని, వర్షపు నీటి సంరక్షణ ప్రతి పౌరుడి బాధ్యతగా భావించాలని పిలుపునిచ్చారు.విజయవాడ నగరపాలక సంస్థ వర్షాకాలంలో కాలువల పర్యవేక్షణతో పాటు ప్రజల్లో పర్యావరణ పరిరక్షణ, వర్షపు నీటి సంరక్షణ, ఘన వ్యర్థాల నిర్వహణపై నిరంతరం అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తూ నగరాన్ని పరిశుభ్రంగా, సురక్షితంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తోందని అధికారులు తెలిపారు.ఈ కార్యక్రమంలో మలేరియా సిబ్బంది పాల్గొన్నారు.

## హోమ్ శాఖ మంత్రి వంగలపూడి అనితకి మాజీ మంత్రి అంబటి రాంబాబు క్షమాపణ చెప్పాలి

**విజయవాడ పశ్చిమ జులై 22 :(వార్తా ప్రభ ప్రతినిధి)**దళిత జాతి ముద్దుబిడ్డ సీనియర్ శాసనసభ్యురాలు రాష్ట్ర హోమ్ శాఖ మాత్యులు శ్రీమతి వంగలపూడి అనిత పై వైయస్సార్ సీనియర్ శాసనసభ్యులు మాజీ మంత్రి అంబటి రాంబాబు చేసిన వ్యాఖ్యలపై తీ వ్రంగా ఖండిస్తున్నానని తెలుగుదేశం పార్టీ ఎస్సీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి దళిత రత్న పరిశపోగు రాజేష్ బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. హోం మంత్రి వంగలపూడి అనిత ని ఉద్దేశించి అంబటి రాంబాబు చేసిన వ్యాఖ్యలు మహిళలను అవమానించేలా ఉన్నాయని, తక్షణమే అంబటి రాంబాబు అనిత కి దళిత జాతికి, రాష్ట్ర మహిళలకు క్షమాపణ చెప్పాలని, ఈ సందర్భంగా దళిత రత్న రాజేష్ డిమాండ్ చేశారు.

# ఒక్క నిర్లక్ష్యం నిండు ప్రాణాన్ని బలితీసుకొంటుంది

## అందరూ తప్పనిసరిగా హెల్మెట్ వాడండి

## చిట్టినగర్ సెక్టార్ ట్రాఫిక్ సి ఐ సురేష్ హితవు

**విజయవాడ పశ్చిమ జులై 22 :(వార్తా ప్రభ ప్రతినిధి)**ఒక్క నిర్లక్ష్యం నిండు ప్రాణాన్ని బలితీసుకొంటుందని అందుకే ద్విచక్ర వాహనాల చోదకులు తప్పనిసరిగా హెల్మెట్ పెట్టుకోవాలని చిట్టినగర్ సెక్టార్ ట్రాఫిక్ సి ఐ సురేష్ ద్విచక్ర వాహనాల చోదకులకు హితవు పలికారు. బుధవారం ఉదయం కొత్తపేట నెహ్రూ బొమ్మ సెంటర్ లో హెల్మెట్ లేకుండా ద్విచక్ర వాహనాలను నడుపుతున్న పలువురు వాహనాల చోదకులకు జరిమానా విధించడమే గాకుండా వారికి హెల్మెట్ వాడడం వల్ల ఓనకురే ప్రయోజనాలపై అవగాహన కల్పించారు. అలాగే ఎప్పటినుంచో పేరుకుపోయిన చాలానాలను వారి వారి ఫోనుల్లోనే చెల్లింపు కార్యక్రమం చేపట్టారు. అదేవిధంగా నెహ్రూ బొమ్మ నలు వైపులా ట్రాఫిక్ కి అంతరాయం కలిగిస్తున్న తోపుడు బండ్ల చిరు వ్యాపారులకు సరి హద్దులు నిర్ణయించారు. హద్దులు దాటిన వారికి జరిమానా విధించడం జరుగుతుందని హెచ్చరించారు.

# డిజిటల్ డోర్ నంబరింగ్ ప్రక్రియను వేగవంతం చేయాలి

## అడ్మిన్, శానిటరీ సెక్రటరీల సమన్వయంతో లక్ష్యాలను పూర్తి చేయాలి

**విజయవాడ పశ్చిమ జులై 22 :(వార్తా ప్రభ ప్రతినిధి)** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న క్యూఆర్ కోడ్ ఆధారిత డిజిటల్ డోర్ నంబరింగ్ కార్యక్రమాన్ని నిర్దేశించిన గడువులోగా పూర్తి చేయాలని విజయవాడ నగరపాలక సంస్థ డిప్యూటీ కమిషనర్ (రెవెన్యూ) జి. సృజన అధికారులను ఆదేశించారు. బుధవారం ఉదయం నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర ఆదేశాల మేరకు ప్రధాన కార్యాలయంలోని నూతన భవన సమావేశ మందిరంలో చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ ఇంచార్జ్ డాక్టర్ గోపాల నాయక్ సమక్షంలో అడ్మిన్ సెక్రటరీలు, శానిటరీ సెక్రటరీలతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో కార్యక్రమం పురోగతిని సమీక్షించారు.ఈ సందర్భంగా డిప్యూటీ కమిషనర్ మాట్లాడుతూ నగరంలోని ప్రతి నివాస, వాణిజ్య ఆస్తికి ప్రత్యేక డిజిటల్ గుర్తింపును కల్పించే ఈ కార్యక్రమంలో శాఖల మధ్య సమన్వయం అత్యంత కీలకమని పేర్కొన్నారు. అడ్మిన్ సెక్రటరీలు, శానిటరీ సెక్రటరీలు పరస్పర సహకారంతో ఫీల్డ్ స్థాయిలో పనులను వేగవంతం చేసి లక్ష్యాలను సాధించాలని సూచించారు.ప్రత్యేకంగా షాపులు, వాణిజ్య సంస్థలు గుర్తింపు ప్రక్రియపై దృష్టి సారించాలని, శానిటరీ సెక్రటరీలు తమ పరిధిలోని అన్ని వాణిజ్య సంస్థలను గుర్తించి వాటి వివరాలను నమోదు చేసి, డిజిటల్ డోర్ నంబర్ కేటాయింపు ప్రక్రియను ఎలాంటి జాప్యం లేకుండా పూర్తి చేయాలని ఆదేశించారు.ఆస్తుల వివరాల నమోదు, జియో ట్యాగింగ్, క్యూఆర్ కోడ్ అనుసంధానం, డేటా నమోదు వంటి ప్రతి దశలో ఖచ్చితత్వం పాటించాలని, ఫీల్డ్ స్థాయిలో ఎదురయ్యే సమస్యలను వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకోవాలని సూచించారు.డిజిటల్ డోర్ నంబరింగ్ ద్వారా నగరంలోని ప్రతి ఆస్తికి సమగ్ర డిజిటల్ గుర్తింపు ఏర్పడి, పన్నుల నిర్వహణ, పౌర సేవల అందజేత, పట్టణ ప్రణాళిక, అత్యవసర సేవల నిర్వహణ మరింత సమర్థవంతంగా సాగుతాయని ఆమె తెలిపారు. అందువల్ల కార్యక్రమం నాణ్యతకు ప్రాధాన్యం ఇస్తూ గడువులోగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు.ఈ సమావేశంలో అసిస్టెంట్ కమిషనర్లు ఏ యు బి శర్మ, హెలెన్, అసిస్టెంట్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ అన్నపూర్ణ, శానిటరీ సూపర్వైజర్లు, రెవెన్యూ ఇన్స్పెక్టర్లు, శానిటరీ ఇన్స్పెక్టర్లు, అడ్మిన్, శానిటరీ సెక్రటరీలు మరియు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# సాంఘిక సంక్షేమ శాఖ బాలుర వసతి గృహంలో విద్యార్థులకు దుప్పట్లు పంపిణీ

**విజయవాడ పశ్చిమ జులై 22 :(వార్తా ప్రభ ప్రతినిధి)** విజయవాడ పశ్చిమ నియోజకవర్గ పరిధిలోని46 వ డివిజన్ , లంబాడి పేట సాంఘిక సంక్షేమ శాఖ బాలుర వసతి గృహంలో విద్యార్థులక

# పెరుమాళ్ళపాడు లో సర్ ప్రక్రియ సజావుగా జరగడం లేదు.

● పెళ్లి అయ్యి గ్రామం నుండి వెళ్లిపోయిన వారి పేరు సర్‌లో నమోదు ● బయటకు వెళ్లిపోయిన వారి పేర్లు తొలగించాలని గ్రామస్తులు తహసీల్దారు కి వినతి పత్రం ● గ్రామంలో వ్యవస్థలు సరిగా పనిచేయడం లేదు... పెరుమాళ్ళపాడు గ్రామస్తులు

**చేజర్ల జూలై 22 (వార్తాప్రభ)**చేజర్ల మండలంలోని పెరుమాళ్ళపాడు గ్రామ పంచాయతీలో సర్ ప్రక్రియ పరిశీలన సరిగా జరగడం లేదని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. గ్రామస్తుల కథనం మేరకు గ్రామంలో కొంత మందికి వారి ఓట్లు డబుల్ ఎంట్రీ గా నమోదు అయి ఉన్నాయని అలాగే పెళ్లి అయిపోయి బయటకు వెళ్లిన వారు గత 15 సంవత్సరాలు అవుతున్నా వారికి ఈ గ్రామంలోనే ఓట్లు ఉండటం వాటిని పరిశీలించకపోవడం ఏమిటని వెంటనే గ్రామంలో లేని వారి ఓట్లు మరియు డబల్ ఎంట్రీలు ఉన్న ఓట్లను తొలగించాలని ఇలాంటి ఓట్లు సుమారు 33 వరకు ఉన్నాయని పలసాని ఈశ్వర్ రెడ్డి మరియు గ్రామస్తులు ఆరోపిస్తున్నారు.ఇదే విషయమై ఈశ్వర్ రెడ్డి మరియు గ్రామస్తులు చేజర్ల మండల తహసీల్దారు వారికి మంగళవారం వినతి పత్రం ఇవ్వడం జరిగినది.సర్ ప్రక్రియలో ఇలాంటివి పరిశీలించకపోవడంతో సర్ ప్రక్రియ ఈ పంచాయతీలో సజావుగా జరగడం లేదని వారు ఆరోపిస్తున్నారు.వివాహమై అనేక సంవత్సరాలు గడిచినప్పటికీ వారికి ఇదే గ్రామంలో ఓట్లు ఉండటం గమనార్హం.అదే కాకుండా ఊరిలో ఉండి నివాసం ఉంటున్న వారి ఓట్లు తొలగించాలనే



ప్రయత్నాలు జరుగుతున్నాయని మరియు ఓటు హక్కు కల్పించకుండా అడ్డుకోవడం ఏమిటని ప్రజలు పెద్ద మొత్తంలో ప్రశ్నిస్తున్నారు.గ్రామంలో నుండి వివాహం చేసుకొని బయటకు వెళ్ళిన వారిని పెద్ద మొత్తంలో సర్ లో షిఫ్టెడ్ కేటగిరీ కింద నమోదు చేయక పోవడం ఏమిటని ఎలక్షన్ ప్రక్రియను చట్ట పరంగా నిర్వహించటం లేదని తెలిపారు.అంతే కాకుండా గ్రామంలో అసలు ఇల్లు లేకుండా చుట్టూ పక్కల గ్రామాల్లో ఇల్లు ఉండి నివాసం ఉన్న వారిని పెరుమాళ్ల పాడు ఓటర్ లిస్ట్ లో సర్‌లోనూ నమోదు చేయడం కొసమెరుపు అని ఆయన అన్నారు.ఇటీవల గ్రామంలో గ్రామసభ నిర్వహించినప్పుడు ఇదే విషయమై తహసీల్దారు వారికి వివరించడం వినతి పత్రం ఇవ్వడం జరిగిందని తెలిపారు. గ్రామంలో వ్యవస్థలు పని చేయడం లేదని తీవ్ర ఆవేదన చెందుతున్నారు.ఈ ఈ విషయంపై జిల్లా కలెక్టర్ కు స్టేట్ ఎలక్షన్ కమిషన్ కు సెంట్రల్ ఎలక్షన్ కమిషన్ కు మెయిల్ ద్వారా ఫిర్యాదు చేయడం జరిగిందని పలసాని ఈశ్వర్ రెడ్డి తెలిపారు.

**బిఎల్ఓ వివరణ** సర్ ప్రక్రియ చాలా సమర్థవంతంగా సజావుగా జరుపుతున్నామని ఎటువంటి అవకతవకలకు పాల్పడడం లేదని తెలిపారు.గ్రామస్తులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు దీనిమీద విచారణ చేస్తున్నానని బిఎల్ఓ వివరణ ఇచ్చారు.

## బల్క్ వేస్ట్ జనరేటర్లను గుర్తించి మూలంలోనే వ్యర్థాల నిర్వహణ చేపట్టాలి

**- మున్సిపల్ కమిషనర్లకు జిల్లా కలెక్టర్ డీకే బాలాజి ఆదేశం**

**మచిలీపట్నం జూలై 22: :(వార్తా ప్రభ ప్రతినిధి)**స్వచ్ఛ గ్రామం- సుపరిపాలన గ్రామం- అభివృద్ధి గ్రామం లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం రూపొందిస్తున్న సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ రూల్స్-2026కు అనుగుణంగా పట్టణాల్లో బల్క్ వేస్ట్ జనరేటర్లను గుర్తించి, వ్యర్థాలను మూలంలోనే శాస్త్రీయంగా నిర్వహించేలా చర్యలు వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజి మున్సిపల్ కమిషనర్లను ఆదేశించారు.బుధవారం కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో మున్సిపల్ కమిషనర్లు, జిల్లా పంచాయతీ, పొల్యూషన్ తదితర సంబంధిత శాఖల అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఘన వ్యర్థాల నిర్వహణ, బల్క్ వేస్ట్ జనరేటర్ల గుర్తింపు, కంపోస్టింగ్ విధానాలు, నూతన సాంకేతిక పరిజ్ఞానాల వినియోగంపై విస్తృతంగా చర్చించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, రోజుకు 100 కిలోలకుపైగా తడి చెత్త ఉత్పత్తి చేసే సంస్థలు, 20 వేల చదరపు అడుగులకు పైబడిన భవనాలు, 40 వేల లీటర్లకు పైగా నీటిని వినియోగించే సంస్థలు బల్క్ వేస్ట్ జనరేటర్ల పరిధిలోకి వస్తాయని తెలిపారు. ఫంక్షన్ హాల్స్, హోటళ్లు, ఆస్పత్రులు, విద్యాసంస్థలు, అపార్ట్‌మెంట్లు, షాపింగ్ కాంప్లెక్సులు, పరిశ్రమలు తదితర సంస్థలను తప్పనిసరిగా గుర్తించి నిబంధనల పరిధిలోకి తీసుకురావాలని సూచించారు.ఈ నెలాఖరులోగా అన్ని మున్సిపాలిటీల్లో బల్క్ వేస్ట్ జనరేటర్ల సమగ్ర జాబితాను సిద్ధం చేయాలని కమిషనర్లను ఆదేశించిన కలెక్టర్, కాలుష్య నియంత్రణ మండలి మార్గదర్శకాలు, సుప్రీంకోర్టు ఆదేశాలు, సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ నిబంధనలను ప్రతి సంస్థ తప్పనిసరిగా అమలు చేసేలా పర్యవేక్షించాలని స్పష్టం చేశారు.బల్క్ వేస్ట్ జనరేటర్లు తడి, పొడి, ప్రమాదకర, శానిటరీ వ్యర్థాలను మూలంలోనే వేరు చేయడం, తడి చెత్తను కంపోస్టింగ్ లేదా బయోగ్యాస్ ద్వారా శుద్ధి చేయడం, ప్లాస్టిక్, కాగితం, లోహం వంటి పొడి వ్యర్థాలను రీసైక్లింగ్‌కు పంపించడం, వ్యర్థాలను బహిరంగ ప్రదేశాల్లో లేదా కాలువల్లో వేయకుండా శాస్త్రీయంగా నిర్వహించడం వంటి బాధ్యతలను తప్పనిసరిగా నిర్వర్తించాలని కలెక్టర్ తెలిపారు.తడి చెత్తను విలువైన సేంద్రీయ ఎరువుగా మార్చేందుకు ఆధునిక కంపోస్టింగ్ పద్ధతులు, డబుల్ కంపోస్టింగ్ బిన్స్, బయోగ్యాస్ యూనిట్లు, కంపోస్ట్ పిట్స్ వంటి విధానాలను విస్తృతంగా ప్రోత్సహించాలని సూచించారు. గ్రీన్ రిచ్ సంస్థ రూపొందించిన డబుల్ బిన్స్ ద్వారా ఒక బిన్ నిండిన తర్వాత మరో బిన్ వినియోగిస్తే సుమారు 30 రోజుల్లో సేంద్రీయ ఎరువు సిద్ధమవుతుందని, రోజుకు 5 కిలోల నుంచి ఒక టన్ను వరకు తడి వ్యర్థాలను శాస్త్రీయంగా ప్రాసెస్ చేసే పరికరాలు అందుబాటులో ఉన్నాయని వివరించారు.సమావేశంలో మచిలీపట్నం, గుడివాడ, పెడన, ఉయ్యూరు మున్సిపల్ కమిషనర్లు బాపిరాజు, మనోహర్ రావు, కొండయ్య, సుభాష్ చంద్రబోస్, జిల్లా పంచాయతీ అధికారిణి ఎం ధనలక్ష్మి, పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ ఈఈ శ్రీనివాస్, గ్రీన్ రిచ్ సంస్థ డైరెక్టర్ ఎస్ శరవణ రాజ్ తదితర అధికారులు పాల్గొన్నారు.

## విద్యార్థులు నైపుణ్యాలను పెంపొందించుకోవాలి



**విజయవాడ పశ్చిమ జులై 22 :(వార్తా ప్రభ ప్రతినిధి)**విద్యార్థులు పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా నైపుణ్యాలను పెంపొందించుకునేందుకు తమ విద్యాసంస్థ కృషి చేస్తుందని పొట్టిశ్రీరాములు చలవాది మల్లికార్జునరావు కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ కార్యదర్శి చిట్టా అమర్‌సుధీర్ అన్నారు. నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సెక్యూరిటీస్ మార్కెట్స్‌తో ఆ కళాశాల యజమాన్యం ఒప్పందం (ఎంఓయు) కుదుర్చుకున్నది. విద్యార్థుల నైపుణ్యాభివృద్ధి, ఆర్థిక అవగాహన, సెక్యూరిటీస్, మార్కెట్ విద్య, ఉపాధి అవాకశాలు మెరుగుపరిచే అంశాలపై ఇరువురు ఎంఓయు కుదుర్చుకున్నారు. ఈ సందర్భంగా ఆ కళాశాలలో జరిగిన కార్యక్రమంలో అమర్‌సుధీర్ మాట్లాడుతూ ఎంబీఏ విద్యార్థులు కేవలం తరగతి గదులు, పాఠ్యాంశాలకే పరిమితం కాకుండా పరిశ్రమలు, మార్కెటింగ్ పరిస్థితులు తదితర అంశాలకు అనుగుణంగా వారిని తీర్చిదిద్దేందుకు పలు కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. వాటిని అందిపుచ్చుకొని విద్యార్థులు తమ అవకాశాలను పెంపొందించుకునేందుకు కృషి చేయాలని కోరారు. ప్రధానంగా ఆర్థికరంగంలో మెరుగైన ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకునేందుకు ఈ ఎంఓయు దోహదపడుతుందని వివరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల కోశాధికారి కాజా రాఘవయ్య, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్ శరవణకుమార్ తదితరులు పాల్గొన్నారు.

## రైతులకు లబ్ధి చేకూర్చేలా ఏపీలో 116 కిసాన్ రైళ్లు నడిచాయి - కేంద్రం

● కిసాన్ రైల్ సర్వీస్‌లపై పార్లమెంట్లో ఎంపీ కేశినేని శివనాథ్ చిన్ని కీలక ప్రశ్న ● రాష్ట్రంలో కొత్త కిసాన్ రైల్ సర్వీస్‌ల ఏర్పాటు ● రూట్ అలైన్‌మెంట్స్ ఆర్థిక సాధ్యతలపై కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ లిఖితపూర్వక సమాధానం ● రైతులకు లబ్ధి చేకూర్చేలా కిలోమీటర్ ఆధారిత సరికొత్త ధరల విధానం

**విజయవాడ పశ్చిమ జులై 22 :(వార్తా ప్రభ ప్రతినిధి)** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో గడచిన రెండు సంవత్సరాలలో కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన కిసాన్ రైలు సర్వీస్‌ల సంఖ్య వాటి మార్గ అమరికలు మరియు రవాణా కోసం ఏర్పాటుచేసిన సరుకులు కార్యాచరణ ఆర్థిక సాధ్యాసాధ్యాయులు వివరించాలని ఎంపీ కేశినేని చిన్ని రైల్వే శాఖను ప్రశ్నించారు ఈ ప్రశ్నకు కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. పండ్లు మరియు కూరగాయలతో సహా త్వరగా పాడైపోయే వస్తువులను ఉత్పత్తి లేదా మిగులు ప్రాంతాల నుండి వినియోగ లేదా కొరత ఉన్న ప్రాంతాలకు తరలించడానికి భారతీయ రైల్వే కిసాన్ రైలు సర్వీసులను ప్రవేశపెట్టింది. ఆగస్టు 2020లో ప్రారంభమైనప్పటి నుండి, ఆంధ్రప్రదేశ్ నుండి బయలుదేరే 116 సర్వీసులతో సహా వివిధ రాష్ట్రాలలో 167 మార్గాలలో మొత్తం 2,364 కిసాన్ రైలు సర్వీసులు నడిచాయి అని మంత్రి తెలిపారు. వ్యవసాయ మరియు రైతు సంక్షేమ మంత్రిత్వ శాఖ, రాష్ట్ర ప్రభుత్వాల వ్యవసాయ/పశుసంవర్ధక/మత్స్య శాఖలు, అలాగే స్థానిక సంస్థలు మరియు ఏజెన్సీలు, మొదలైన వాటితో సంప్రదించి కిసాన్ రైలు యొక్క సంభావ్య సర్వీస్‌లను గుర్తించి వచ్చిన డిమాండ్లు మరియు

కార్యాచరణ సాధ్యత ఆధారంగా, వర్తించే టారిఫ్‌తో సేవలను ప్రణాళిక చేస్తారుఅని మంత్రి అశ్విని వైష్ణవ్ తెలియచేసారు .అంతేకాకుండా, అన్ని రైల్వే డివిజన్లలో పనిచేస్తున్న వ్యాపార అభివృద్ధి విభాగాలు, కాలానుగుణంగా మరియు అవసరాన్ని బట్టి కూడా ఉండే త్వరగా పాడైపోయే వస్తువుల రవాణాతో సహా వ్యాపార అవసరాలను అంచనా వేయడానికి వివిధ భాగస్వాములతో సంప్రదింపులు జరుపుతున్నాయి.ఇటీవలి కాలంలో, తాడిపత్రి నుండి జవహర్‌లాల్ నెహ్రూ పోర్ట్ ట్రస్ట్ కి అరటిపండ్ల రవాణా కోసం రైల్వే అధికారులు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, కాన్కార్ అధికారులు మరియు అనంతపురం జిల్లా పరిపాలన యంత్రాంగంతో సంప్రదింపులు జరిపారు.అంతేకాకుండా, వ్యవసాయ ఉత్పత్తులను, ముఖ్యంగా ఆహార ధాన్యాలను కంటైనర్లలో రవాణా చేయడాన్ని ప్రోత్సహించడానికి చర్యలు తీసుకున్నారు. ఇది ఒక సురక్షితమైన మరియు సమర్థవంతమైన ఇంటర్‌మోడల్ రవాణా విధానం. కంటైనర్లలో ఆహార ధాన్యాలు, పిండి మరియు పప్పుధాన్యాల రవాణాను సులభతరం చేయడానికి, కిలోమీటరుకు ధరల నిర్ణయ వ్యవస్థను ఇటీవల అవలంబించారు అని అన్నారు.

## బ్లాక్ స్పాట్లను గ్రీన్ స్పాట్లుగా మార్చడంలో కృష్ణా జిల్లాకు రాష్ట్రస్థాయి గుర్తింపు

● మచిలీపట్నం, ఉయ్యూరు పురపాలక సంఘాలకు స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ అవార్డులు
● ప్రతి శానిటేషన్ సిబ్బందికి అభినందనలు తెలిపిన జిల్లా కలెక్టర్ డీకే బాలాజి

**మచిలీపట్నం జూలై 22: :(వార్తా ప్రభ ప్రతినిధి)** 2047 నాటికి ఆంధ్రప్రదేశ్‌ను స్వర్ణాంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పది సూత్రాల్లో స్వచ్ఛాంధ్ర ఒక కీలక అంశమని, ఆ లక్ష్య సాధనలో భాగంగా చేపట్టిన ఆపరేషన్ క్లీన్ స్వీప్ కార్యక్రమాన్ని కృష్ణా జిల్లాలో విజయవంతంగా అమలు చేశామని జిల్లా కలెక్టర్ డీకే బాలాజి తెలిపారు.బుధవారం కలెక్టరేట్‌లోని తన ఛాంబర్ నుంచి జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు మే 23 నుంచి జూన్ 26 వరకు నిర్వహించిన ఆపరేషన్ క్లీన్ స్వీప్ కార్యక్రమాన్ని జిల్లాలోని అన్ని ఐదు పురపాలక సంఘాల పరిధిలో సమర్థవంతంగా అమలు చేశామని చెప్పారు. ఈ కార్యక్రమంలో భాగంగా జిల్లాలో ప్రత్యేక దృష్టిని 'బ్లాక్ స్పాట్స్ టు గ్రీన్ స్పాట్స్' అనే భావనపై కేంద్రీకరించినట్లు కలెక్టర్ తెలిపారు. తరచూ చెత్త పేరుకుపోయే ప్రదేశాలను ముందుగా గుర్తించి, వాటి జాబితాను రూపొందించామని చెప్పారు. అనంతరం ఆ ప్రాంతాల్లో చెత్త పేరుకుపోవడానికి గల కారణాలను విశ్లేషించి, డోర్ టు డోర్ చెత్త సేకరణలో ఉన్న లోపాలను సరిదిద్దడంతో పాటు ప్రజల్లో అవగాహన పెంపొందించే చర్యలు చేపట్టామని వివరించారు.చెత్త తొలగించిన ప్రదేశాలను తిరిగి చెత్త వేయకుండా ఉండేలా అందంగా తీర్చిదిద్దామని తెలిపారు. మొక్కలు నాటడం, గోడలపై ఆకర్షణీయమైన చిత్రాలు వేయడం, బెంచీలు ఏర్పాటు చేయడం, పరిశుభ్రత సందేశాలతో అలంకరించడం వంటి చర్యల ద్వారా ఆ ప్రాంతాలను ప్రజలకు ఆహ్లాదకరమైన గ్రీన్ స్పాట్లుగా మార్చామని చెప్పారు. ఒక ప్రాంతం అందంగా మారితే అక్కడ చెత్త వేయడానికి ప్రజలు సహజంగానే వెనుకాడే విధంగా మానసిక మార్పు తీసుకురావడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని కలెక్టర్ పేర్కొన్నారు.జిల్లాలోని ఐదు పురపాలక సంఘాల పరిధిలో మొత్తం 141 బ్లాక్ స్పాట్లను పూర్తిగా అభివృద్ధి చేసి గ్రీన్ స్పాట్లుగా మార్చినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభించిందని, తాను క్షేత్రస్థాయిలో పర్యటించినప్పుడు స్థానికులు స్వయంగా వచ్చి

అభినందించడం ఎంతో సంతృప్తినిచ్చిందని చెప్పారు.
కృష్ణా జిల్లాలో చేపట్టిన వినూత్న కార్యక్రమాన్ని గుర్తించిన స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్, రాష్ట్రవ్యాప్తంగా ఎంపిక చేసిన తొమ్మిది పురపాలక సంఘాల్లో మచిలీపట్నం, ఉయ్యూరు పురపాలక సంఘాలకు అవార్డులు ప్రదానం చేయడం జిల్లాకు గర్వకారణమని కలెక్టర్ పేర్కొన్నారు.ఈ విజయానికి కృషి చేసిన ప్రతి పారిశుద్ధ్య కార్మికుడు, శానిటేషన్ సెక్రటరీ, మున్సిపల్ సిబ్బంది, మున్సిపల్ కమిషనర్లు, అధికారులు, ప్రజాప్రతినిధులు, ప్రజలకు జిల్లా కలెక్టర్ డీకే బాలాజి హృదయపూర్వక అభినందనలు, కృతజ్ఞతలు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా పరిశుభ్రత, పచ్చదనం, పర్యావరణ పరిరక్షణకు సంబంధించిన కార్యక్రమాలను ఇదే స్ఫూర్తితో మరింత విస్తృతంగా కొనసాగిస్తామని ఆయన పేర్కొన్నారు.

## రాష్ట్ర ప్రభుత్వం ప్రజల సంక్షేమం పథకాలకి నిధులు సక్రమైన మార్గంలో మళ్లించాలి

**విజయవాడ నగర వి హెచ్ పి సహాయ కార్యదర్శి కొంపెల్లి శ్రీనివాస్**

**విజయవాడ పశ్చిమ జులై 22 :(వార్తా ప్రభ ప్రతినిధి)**రాష్ట్ర ప్రభుత్వం ప్రజల సంక్షేమం కోసం విడుదల చేసే నిధులు సక్ర మార్గంలో వుండాలని విజయవాడ నగర వి హెచ్ పి సహాయ కార్యదర్శి కొంపెల్లి శ్రీనివాస్ ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు.ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వము ఈ నెల 19. తల్లికి వందనం స్కీము కొరకు ఎండోమెంట్ శాఖ ద్వారా 26,03,90,000 రూపాయలు విడుదల చేస్తూ Go.Rt.No.1243 ఇచ్చింది. బ్రాహ్మణ కార్పొరేషన్ ద్వారా బ్రాహ్మణ విద్యార్థులకు ఇచ్చేందుకు వీటిని ఇస్తున్నట్లు ఆ ఆర్డర్ లో పేర్కొన్నారు.విశ్వ హిందూ పరిషత్ దీనిని పూర్తిగా వ్యతిరేకిస్తున్నది. దేవాలయ నిధులు బ్రాహ్మణ కార్పొరేషన్ పేరుతో తల్లికి వందనం కొరకు ఇవ్వడమేమిటి? దేవాలయ నిధులు ధార్మిక కార్యక్రమాలకు, వేద విద్యలకు మాత్రమే ఖర్చు చేయవలసి ఉండగా ప్రభుత్వ పథకాలకు వెచ్చించడం అన్యాయమే కాకుండా చట్ట విరుద్ధం కూడా అవుతుందని ఆయన తన ప్రకటనలో పేర్కొన్నారు. దేవాలయ నిధులు ఒకే కులానివి చెందినవి కాదు. హిందువులలో అనేక కులాలు, కార్పొరేషన్ లు ఉన్నాయి. అన్ని కులాలు హుండీలో దక్షిణలు వేస్తేనే ఆలయాలకు ఆదాయం వస్తుండగా ఆలయ ఆదాయం ఒక కార్పొరేషన్ పేరుతో

ఖర్చుచేయడం తప్పు. ముస్లింలకు వక్ఫ్ బోర్డు నుంచి, క్రైస్తవులకు క్రైస్తవ మిషనరీస్ ల నుంచి తల్లికి వందనం ఇవ్వడం లేదు. వారికి ప్రజల టాక్స్ నుంచి ప్రభుత్వము చెల్లిస్తున్నది. హిందువుల ఆలయాల సొమ్ము తల్లికి వందనం కొరకు ఎలా ఇస్తారు. ప్రభుత్వం తల్లికి వందనం ఇస్తానన్నప్పుడు ప్రజల పన్నుల నుంచి ఇవ్వాలి గాని, హిందువుల ఆలయాల సొమ్ము నుంచి ఎలా ఇస్తారని ఆయన ప్రశ్నించారు.ఆలయ నిధులు ధర్మ ప్రచారానికి ఖర్చు చేయాలి. అంతేకానీ ఇలా ప్రభుత్వ పథకాల కొరకు ఎలా ఖర్చు చేస్తారు. వెంటనే ఈ ఆర్డరును ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని విశ్వ హిందూ పరిషత్ డిమాండ్ చేస్తున్నది.ఇదే విధంగా సెక్యులర్ విధానాలకు విరుద్ధమైనా ప్రభుత్వం ముల్లాలకు, పాస్టర్లకు ప్రజల ధనం నుంచి జీతాలు ఇస్తూ, అర్చకులకు మాత్రము దేవాదాయ శాఖ నుంచి ఇస్తున్నారు. ఈవిధంగా ప్రభుత్వ దక్షిణ పథకంలో కూడా అర్చకులకు జీతాలు ప్రభుత్వం ఇవ్వడంలేదు. ముల్లాలకు, ఫాస్టర్లకు జీతాలు మసీదులు, చర్చిలు ఇవ్వక పోయినా అర్చకులకు ఆలయాల నుండి ఇస్తున్నారు. ప్రభుత్వం 19 వ తేదీన ఇచ్చిన 1243 ఆర్డరును వెనక్కి తీసుకోక పోయినా, ప్రభుత్వ పథకాలకు ఆలయ నిధులు చెల్లించడం మానకపోయినా విశ్వ హిందూ పరిషత్ రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చేస్తుందని శ్రీనివాస్ హెచ్చరించారు.

## ఆగష్టు 2న గన్నవరంలో జిల్లాస్థాయి యోగాసనా పోటీలు

**గన్నవరం, జూలై 22: :(వార్తా ప్రభ ప్రతినిధి)**ఆంధ్రప్రదేశ్ క్రీడా ప్రాధికార సంస్థ (శ్యాప్) చే గుర్తించబడిన యోగాసనా స్పోర్ట్స్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్ర ప్రదేశ్ వారి సహకారముతో యోగాసనా స్పోర్ట్స్ అసోసియేషన్ ఆఫ్ కృష్ణా జిల్లా ఆధ్వర్యంలో ఆగష్టు 2వ తేదీ గన్నవరంలోని బుద్ధవరం రోడ్డులో గల శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి కల్యాణ మండపంలో జిల్లా స్థాయి యోగాసన పోటీలు నిర్వహిస్తున్నారని జిల్లా యోగాసన అధ్యక్షులు పి ప్రేమ్ కుమార్ తెలిపారు. ఈ పోటీలు జిల్లా స్థాయిలో ట్రెడిషనల్ యోగాసన, ఆర్టిస్టిక్ యోగాసన సింగిల్, ఆర్టిస్టిక్ యోగాసన పెయిర్, రిథమిక్ యోగాసన పెయిర్, ఆర్టిస్టిక్ గ్రూపులలో విభాగాల్లో 6వయో విభాగాల్లో బాలురు, బాలికలకు ప్రత్యేకంగా పోటీలు నిర్వహించబడతాయని అన్నారు. వయో విభాగాలు సబ్ జూనియర్స్ 10--14 సంవత్సరాలు, జూనియర్స్ 14--18 సంవత్సరాలు, సీనియర్స్ 18--28 సంవత్సరాలు, సీనియర్ ూ: 28--35 సంవత్సరాలు, సీనియర్ దీ: 35--45 సంవత్సరాలు, సీనియర్ జ: 45--55 సంవత్సరాల జరుగుతాయని అన్నారు జిల్లాలో ఆసక్తి గలవారు జనన ధ్రువీకరణ పత్రం, ఆధార్, మెడికల్ సర్టిఫికెట్స్ తో హాజరుకావలన్నారు. పూర్తి వివరాలకు ఆర్గనైసింగ్ కార్యదర్శి సురేంద్రనాథ్ బెనర్జి ని 90108 63810 సంప్రదించాలని కోరారు ఎన్డీయే కార్యాలయంలో ప్రజా దర్బార్ కు అనూహ్య స్పందన.

## కూటమి నేతలతో కలిసి వినతులు స్వీకరించిన కార్యాలయ కార్యదర్శి ప్రత్తిపాటి శ్రీధర్...

**విజయవాడ పశ్చిమ జులై 22 :(వార్తా ప్రభ ప్రతినిధి)**ఎమ్మెల్యే సుజనా చౌదరి ఆదేశాలతో భవానిపురం,ఎన్డీయే కార్యాలయంలో నిర్వహిస్తున్న ప్రజాదర్బార్ లకు ప్రజలనుంచి అనూహ్య స్పందన లభిస్తోంది..కార్యాలయ కార్యదర్శి ప్రత్తిపాటి శ్రీధర్ , టీడీపీ రాష్ట్ర నాయకులు గుర్రం కొండ , మాజీ కార్పొరేటర్లు పత్తి నాగేశ్వరరావు ,పైడి మాల సుభాషిణి ,సుజనా న్యాయమిత్రా బాయన హేరంబ కుమార్, కూటమి నేతలు తమ్మిన లీల కరుణాకర్, పోతినేడి లోకేష్, దనాల శ్రీనివాసరావు, ఆకారపు విజయ కుమారి, రౌతు రమ్యప్రియ, తదితరులతో కలిసి ప్రజల నుంచి వినతులు స్వీకరించారు.. పశ్చిమ నియోజకవర్గ వ్యాప్తంగా ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి వారి సమస్యలను తెలిపారు.ప్రభుత్వ పథకాలు, పింఛన్లు, ఇళ్ల స్థలాలు, రేషన్ కార్డులు, వైద్య సహాయం తదితర అంశాలపై ప్రజలు ప్రత్యేకంగా దరఖాస్తులు అందజేశారు..వచ్చిన వినతులపై ప్రత్యేక దృష్టి సారించి అర్హులకు న్యాయం జరిగేలా పశ్చిమ ఎమ్మెల్యే కార్యాలయం చర్యలు తీసుకుంటుంది..

## విశ్వకర్మ దీక్ష పోస్టర్ ఆవిష్కరణ

**ఇబ్రహీంపట్నం, జూలై 22 (వార్తా ప్రభ ప్రతినిధి):** కొండపల్లిలోని శ్రీ గిరి వీరేశ్వర విశ్వేశ్వర స్వామి వారి ఆలయంలో వేంచేసియున్న శ్రీ మద్విరాట్ విశ్వకర్మ భగవాన్ మరియు శ్రీ కామాక్షి అమ్మవార్ల సన్నిధిలో సెప్టెంబర్ 17న శ్రీశ్రీశ్రీ మద్విరాట్ విశ్వకర్మ భగవాన్ యజ్ఞ మహోత్సవం నిర్వహిస్తున్నట్లు కార్యనిర్వాహకులు కత్తురోజు రామకృష్ణ తెలిపారు. గొల్లపూడి బీసీ భవన్ లో యజ్ఞ మహోత్సవం పోస్టర్ ను విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ అండ్ డెవలప్మెంట్ చైర్ పర్సన్ కమ్మరి పార్వతమ్మ బుధవారం ఆవిష్కరించారు. ఆగస్టు 5న ప్రారంభమయ్యే శ్రీశ్రీశ్రీ మద్విరాట్ విశ్వకర్మ భగవాన్ స్వామి వారి దీక్షాధారణ సెప్టెంబర్ 17న విరమించనున్నట్లు చెప్పారు. అదే రోజు మహా అన్న సమారాధన నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేషన్ డైరెక్టర్లు పాల్గొన్నారు.

## ఇబ్రహీంపట్నం లో దస్తావేజు లేఖరుల పెన్ డౌన్

**ఇబ్రహీంపట్నం, జూలై 22(వార్తా ప్రభ ప్రతినిధి):** రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా ప్రవేశ పెట్టిన జీవో నెంబర్ 396 వెంటనే రద్దు చేయాలనీ డిమాండ్ చేశారు ఇబ్రహీంపట్నం దస్తావేజు లిలేఖరులు. ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ కొనసాగిస్తున్న నిరసన లో భాగంగా మూడవరోజు రిజిస్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ నిర్ణయంతో దస్తావేజు లేఖరుల జీవనోపాధి ప్రశ్నార్థకంగా మారిందన్నారు. వారి కుటుంబాలు రోడ్డును పడే పరిస్థితి నెలకొందని కావున వెంటనే ప్రభుత్వం తన నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని కోరారు. లేకపోతే నిరసన కార్యక్రమాన్ని మరింత ఉధృతం చేస్తామని, అప్పటివరకు ఎలాంటి రిజిస్ట్రేషన్లు జరగకుండా పెన్ డౌన్ చేస్తామని హెచ్చరించారు.

# కాంగ్రెస్ సీనియర్ నాయకుడు నారాయణ రెడ్డి అకాల మరణం

**భౌతికకాయానికి కొలన్ హన్మంత్ రెడ్డి నివాళులు**
**భగత్ సింగ్ నగర్‌లోని నివాసంలో సంతాపాన్ని తెలియజేసిన నియోజకవర్గ ఇంచార్జ్**
**నారాయణ రెడ్డి సేవలు మరవలేనివి.. కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుంది : కొలన్ హన్మంత్ రెడ్డి**

**కుత్బుల్లాపూర్, జూలై 22, (వార్తాప్రభ)** : కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని భగత్ సింగ్ నగర్‌కు చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు నారాయణ రెడ్డి అకాల మరణం చెందారు. ఆయన మరణవార్త తెలుసుకున్న కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కొలన్ హన్మంత్ రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. బుధవారం నాడు భగత్ సింగ్ నగర్‌లోని నారాయణ రెడ్డి నివాసానికి వెళ్లిన కొలన్ హన్మంత్ రెడ్డి, ఆయన భౌతికకాయాన్ని సందర్శించి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు. నియోజకవర్గంలో పార్టీ బలోపేతానికి, ప్రజా సమస్యల పరిష్కారానికి నారాయణ రెడ్డి చేసిన నిస్వార్థ సేవలను ఈ సందర్భంగా ప్రత్యేకంగా గుర్తు చేసుకున్నారు. ఆయన అకాల మరణం నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీకి, స్థానిక బస్తీ ప్రజలకు తీరని లోటని తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం నారాయణ రెడ్డి కుటుంబ సభ్యులను కొలన్ హన్మంత్ రెడ్డి పరామర్శించి, తీవ్ర దుఃఖంలో ఉన్న వారిని ఓదార్చారు. ఈ కష్టసమయంలో మరియు భవిష్యత్తులోనూ వారి కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ పూర్తి అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. నారాయణ రెడ్డి ఆత్మకు శాంతి, సద్గతి కలగాలని, వారి కుటుంబ సభ్యులకు ఈ తీవ్ర విషాదాన్ని తట్టుకునే మనోధైర్యాన్ని ప్రసాదించాలని భగవంతుడిని ప్రార్థించారు. ఈ సంతాప కార్యక్రమంలో స్థానిక డివిజన్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, ముఖ్య కార్యకర్తలు, కాలనీ సంక్షేమ సంఘ ప్రతినిధులు మరియు భగత్ సింగ్ నగర్ నివాసితులు పెద్ద సంఖ్యలో పాల్గొని నారాయణ రెడ్డికి అశ్రునయనాలతో నివాళులు అర్పించారు.

# గురుకుల పాఠశాల ఆకస్మిక తనిఖీ చేసిన జే.సి

**సంగం జూలై 22 (వార్తాప్రభ ప్రతినిధి)** సంగం మండల కేంద్రంలోని బాలికల గురుకుల పాఠశాలను జాయింట్ కలెక్టర్ మొగిలి వెంకటేశ్వర్లు ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా పాఠశాల డైనింగ్ హాల్‌ను సందర్శించి విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు.అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేసి వారికి అందిస్తున్న ఆహారం నాణ్యంగా ఉందని సంతృప్తి వ్యక్తం చేశారు.అనంతరం పాఠశాల ఆవరణ, పరిశుభ్రత తదితర మౌలిక వసతులను పరిశీలించారు.విద్యార్థులకు అందుతున్న విద్య వసతి భోజన సౌకర్యాలపై సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు.విద్యార్థులకు అన్ని సౌకర్యాలు మెరుగైన స్థాయిలో అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.

# రీ సర్వే వేగవంతానికి చర్యలు

**సంగం జూలై 22 (వార్తాప్రభ ప్రతినిధి)** సంగం తహసీల్దార్ కార్యాలయాన్ని జిల్లా జాయింట్ కలెక్టర్ మొగిలి వెంకటేశ్వర్లు సందర్శించారు.రీ సర్వే కి సంబంధించిన రికార్డులు పరిశీలించి రీ సర్వే జరుగుతున్న తీరు గురించి అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని 690 రెవెన్యూ గ్రామాల్లో రీసర్వే పనులు దశలవారీగా కొనసాగుతున్నాయని తెలిపారు. ఇప్పటికే 314 గ్రామాల్లో రీసర్వే పూర్తయిందని మిగిలిన గ్రామాల్లో వివిధ దశల్లో పనులు జరుగుతున్నాయని చెప్పారు. రీసర్వే పూర్తైన గ్రామాల రైతులకు ప్రతి నెలా పట్టాదార్ పాస్ పుస్తకాలు ముద్రించి పంపిణీ చేస్తున్నామని, ఆగస్టు 1 నాటికి మరో విడత పంపిణీ పూర్తి చేస్తామని వెల్లడించారు.రీ సర్వే లో చిన్న చిన్న పొరపాట్లు జరుగుతున్నాయని అవన్నీ సరిదిద్దేందుకు గట్టి చర్యలు చేపడుతున్నామని పేర్కొన్నారు.అలాగే పీజీఆర్ఎస్‌కు వచ్చే భూ ఆక్రమణలు దారి వివాదాల ఫిర్యాదులను క్షేత్రస్థాయిలో విచారించి త్వరితగతిన పరిష్కరించాలని తహసీల్దార్లు, రెవెన్యూ అధికారులకు ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు.ఈ కార్యక్రమం లో తహసీల్దార్ సారంగపాణి సిబ్బంది పాల్గొన్నారు.

# తృటిలో తప్పిన పెను ప్రమాదం

**సంగం జూలై 22 (వార్తాప్రభ ప్రతినిధి)** సంగం మండల కేంద్రం వద్ద పెను ప్రమాదం తృటిలో తప్పింది.పామూరు నుంచి నెల్లూరుకు 45 మంది ప్రయాణికులతో వెళ్తున్న ఆర్టీసీ హైర్ బస్సు డ్రైవర్ త్రిమోది కి ప్రయాణ మధ్యలో అకస్మాత్తుగా తీవ్ర అస్వస్థత ఏర్పడింది. అయితే ప్రాణాపాయ పరిస్థితిలోనూ డ్రైవర్ త్రిమోది అప్రమత్తంగా వ్యవహరించి స్టీరింగ్‌పై వాలిపోయే ముందే బస్సును రోడ్డు పక్కకు సురక్షితంగా నిలిపివేశాడు. దీంతో బస్సులో ఉన్న 45 మంది ప్రయాణికులు క్షేమంగా బయటపడ్డారు.డ్రైవర్ పరిస్థితిని గమనించిన ప్రయాణికులు వెంటనే అతడిని సంగం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. వైద్యులు డ్రైవర్‌కు చికిత్స అందించి ప్రస్తుతం ఆయన ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని ప్రాణాపాయం లేదని తెలిపారు.ఇక ప్రయాణికులు ఇబ్బందులు పడకుండా ఆర్టీసీ కండక్టర్ వెంటనే ప్రత్యామ్నాయ బస్సును ఏర్పాటు చేసి వారిని నెల్లూరుకు పంపించారు.

# రాహుల్, ప్రియాంక అరెస్టుపై కాంగ్రెస్ ఆగ్రహం!!

- **నీట్ లీక్‌పై కేంద్రానికి కాంగ్రెస్ హెచ్చరిక**
- **విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటం ఆడుతున్న మోదీ**
- **నీట్ లీక్ బాధితులకు రూ.1 కోటి డిమాండ్**
- **కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాలి**
- **విప్ చింతకుంట విజయ రమణరావు**

**పెద్దపల్లి బ్యూరో చీఫ్, జూలై 22 (వార్తాప్రభ):**పెద్దపల్లి పట్టణంలోని కమాన్ చౌరస్తా బుధవారం కాంగ్రెస్ నిరసనలతో దద్దరిల్లింది. నీట్ ప్రశ్నపత్రం లీకేజీతో పాటు వరుస పరీక్షల పేపర్ లీకేజీలను నిరసిస్తూ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు. ఢిల్లీలో ప్రధాని నివాసం ముట్టడికి యత్నించిన లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, ఎంపీ ప్రియాంక గాంధీల అరెస్టును ఖండిస్తూ కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ దిష్టిబొమ్మను దహనం చేశారు. కార్యక్రమంలో పాల్గొన్న రాష్ట్ర ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమాడుతోందని తీవ్ర విమర్శలు చేశారు. గత 12 ఏళ్లలో పలుమార్లు ప్రశ్నపత్రాల లీకేజీలతో లక్షలాది మంది విద్యార్థులు, నిరుద్యోగ యువత నష్టపోయారని ఆరోపించారు. ఇటీవల జరిగిన నీట్ లీకేజీ ఘటనతో విద్యార్థులు తీవ్ర మానసిక వేదనకు గురయ్యారని, కొందరు ప్రాణాలు కోల్పోవడం అత్యంత బాధాకరమన్నారు. పేపర్ లీకేజీల కారణంగా మరణించిన విద్యార్థుల కుటుంబాలకు రూ.1 కోటి చొప్పున నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ వ్యవహారానికి నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి వెంటనే రాజీనామా చేయాలని కోరారు. ప్రతి ఏడాది రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని హామీ ఇచ్చిన బీజేపీ ప్రభుత్వం యువతను మోసం చేసిందని ఆరోపించారు. ప్రజాస్వామ్యబద్ధంగా నిరసన తెలుపుతున్న ప్రతిపక్ష నాయకులను అరెస్టు చేయడం అప్రజాస్వామిక చర్య అని మండిపడ్డారు. విద్యార్థుల న్యాయమైన డిమాండ్లను కేంద్ర ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని, లేనిపక్షంలో కాంగ్రెస్ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాలను మరింత ఉద్ధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ నిరసన కార్యక్రమంలో కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు, నాయకులు, యువజన సంఘాల ప్రతినిధులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని కేంద్ర ప్రభుత్వ విధానాలను తీవ్రంగా నిరసించారు.

# జెఎన్‌టియుహెచ్‌లో తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు కమిటీకి నివేదిక సమర్పణ

- **తెలంగాణ అమరవీరుల స్మారక భవనంలో ఉద్యమకారుల గుర్తింపు కమిటీ సమావేశం**
- **80 పేజీల సమగ్ర ఆధారాలతో నివేదిక అందజేసిన తెలంగాణ ఉద్యమకారుడు, గేయ రచయిత డాక్టర్ రాజేష్ ఖన్నా**

**హైదరాబాద్, జూలై 22, (వార్తాప్రభ)** : తెలంగాణ అమరవీరుల స్మారక భవనంలో తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు కమిటీ సమావేశం జరిగింది. ప్రొఫెసర్ కోదండరామ్, మాజీ శాసనమండలి సభ్యుడు కె. దిలీప్ రావుల అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో జెఎన్‌టియుహెచ్ (జవాహర్‌లాల్ నెహ్రూ సాంకేతిక విశ్వవిద్యాలయం హైదరాబాద్) తరఫున తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర సాధన ఉద్యమంలో విశ్వవిద్యాలయం పోషించిన కీలక పాత్రపై తయారు చేసిన 80 పేజీల సమగ్ర నివేదికను తెలంగాణ ఉద్యమకారుడు, గేయ రచయిత, కవి డాక్టర్ రాజేష్ ఖన్నా కమిటీకి అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ రాజేష్ ఖన్నా మాట్లాడుతూ.. ఉమ్మడి రాష్ట్రంలో 2008 వరకు ఉమ్మడి జెఎన్‌టియుహెచ్ పరిధిలో తెలంగాణ ప్రాంత అధికారులు, అధ్యాపకులు, ఆచార్యులు మరియు ఇతర సిబ్బంది తీవ్ర నష్టానికి, వివక్షకు గురయ్యారని వివరించారు. 2008లో విశ్వవిద్యాలయాల విభజన జరిగిన తర్వాత కూడా సీమాంధ్ర ప్రాంతంలోని జెఎన్‌టియు అనంతపూర్, జెఎన్‌టియు కాకినాడ ప్రాంతాల నుండి వచ్చిన సీమాంధ్ర సిబ్బందితో హైదరాబాద్ క్యాంపస్‌లో వివక్ష కొనసాగిందన్నారు. 2008-09 మలిదశ తెలంగాణ ఉద్యమ కాలంలో "జై తెలంగాణ" అనే పదం పలుకడమే నేరంగా పరిగణించిన ఆంక్షలు, నిర్బంధ పరిస్థితులలో సైతం జెఎన్‌టియుహెచ్ సాంకేతిక విశ్వవిద్యాలయ అధికారులు, అధ్యాపకులు, ఉద్యోగులు తెలంగాణ రాష్ట్ర సాధన కోసం నిరంతరం పోరాటం చేశారని గుర్తు చేశారు. 2009లో విశ్వవిద్యాలయ కళాశాలలో నిర్వహించిన స్పందన విద్యార్థి సంఘం సభలో ప్రొఫెసర్ అనంత బాబు అధ్యక్షతన, ప్రొఫెసర్ ఈశ్వర్ ప్రసాద్, ప్రొఫెసర్ రవిప్రసాద్, ప్రొఫెసర్ నరసింహారెడ్డి, ప్రొఫెసర్ బాల్‌నాయక్, ప్రొఫెసర్ రాజేష్ ఖన్నా, ప్రొఫెసర్ శ్రీనివాసరెడ్డిలతో పాటు నాన్-టీచింగ్ విభాగం నుండి శ్రీనివాసరావు, యాదగిరి, ఉపేందర్‌రెడ్డి, మాధవరెడ్డి తదితరులు పాల్గొని ఉద్యమ కార్యాచరణను ముందుకు తీసుకెళ్లారని తెలిపారు. జైహింద్ ఉద్యమ సమయంలో అప్పటి అధికారులు, పోలీసులు అడ్డుకుని అరెస్టులు చేసినా వెరవకుండా పోరాటం సాగించిన తీరును కమిటీ ముందు ఉంచారు. అలాగే కళాశాల అనుబంధ విభాగాలైన జగిత్యాల, మంథని, సుల్తాన్‌పూర్ ప్రాంతాలలో పనిచేసిన ప్రొఫెసర్ నరసింహ, ప్రొఫెసర్ సత్యనారాయణ, ప్రొఫెసర్ జగదీష్ వంటి అనేకమంది ఆచార్యులు, ఉద్యోగులు భాగస్వాములయ్యారని పేర్కొన్నారు. జెఎన్‌టియుహెచ్‌లో తెలంగాణ ఉద్యమానికి నాయకత్వం వహించిన అధ్యాపకులు, ఉద్యోగులు, ఒప్పంద మరియు బాహ్య వనరుల (కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్) సిబ్బంది త్యాగాలను ప్రభుత్వం గుర్తించాలని కమిటీకి విజ్ఞప్తి చేశారు. ముఖ్యంగా కింది వినతులను కమిటీ ముందు ఉంచారు:

1. **ఉద్యమకారులకు సత్కారం:** జెఎన్‌టియుహెచ్ తెలంగాణ ఉద్యమకారులను రాష్ట్రస్థాయిలో అధికారికంగా సత్కరించాలి.
2. **ప్రత్యేక పోస్టుల సృష్టి:** ఉద్యమంలో పాల్గొన్న జెఎన్‌టియుహెచ్ అధికారులకు, ఉద్యోగులకు ప్రత్యేక పోస్టులు (సూపర్ న్యూమరరీ) సృష్టించి ఉద్యోగ భద్రత, పదోన్నతులు కల్పించాలి.
3. **శాశ్వత ఉద్యోగులుగా గుర్తింపు:** 2014 జూన్ 2 కంటే ముందు నుండి పనిచేస్తున్న కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులను క్రమబద్ధీకరించి, శాశ్వత ఉద్యోగులుగా గుర్తించాలి. అన్ని రకాల ప్రభుత్వ ప్రయోజనాలను వర్తింపజేయాలి.
4. **నామినేటెడ్ పాలనా పదవులు:** విశ్వవిద్యాలయ ఉద్యమకారులకు నామినేటెడ్ పోస్టులు, ప్రభుత్వ సలహాదారులు, ఎమ్మెల్సీలు, కార్పొరేషన్ చైర్మన్లుగా, వచ్చే ఎన్నికల్లో ఎమ్మెల్యే, ఎంపీలుగా పోటీ చేసే అవకాశాలు కల్పించాలి.
5. **చరిత్ర భద్రపరచడం:** విశ్వవిద్యాలయ ఉద్యమ చరిత్రను డిజిటల్ రూపంలో శాశ్వతంగా భద్రపరచాలి.
6. **అధికారిక గుర్తింపు కార్డులు:** ఉద్యమకారుల త్యాగాలను ధ్రువీకరిస్తూ ప్రభుత్వపరంగా "తెలంగాణ ఉద్యమకారుడు" అనే అధికారిక గుర్తింపు పత్రాన్ని జారీ చేయాలి. ఈ ప్రతిపాదనలు, ఆధారాల పట్ల ఉద్యమకారుల గుర్తింపు కమిటీ సానుకూలంగా స్పందించిందని, త్వరలోనే వీటన్నింటిపై ప్రభుత్వానికి నివేదిక అందజేస్తామని హామీ ఇచ్చినట్లు డాక్టర్ రాజేష్ ఖన్నా తెలిపారు.

# ఏటీఎం స్వైపింగ్ మరా నిందితుడు అరెస్ట్

**మైలవరం జూలై 22: :(వార్తా ప్రభ ప్రతినిధి):**ఏటీఎం స్వైపింగ్ మరా నిందితుడిని మైలవరం పోలీసులు అరెస్ట్ చేశారు.మైలవరం ఏసీపి పి.రామచంద్రరావు పర్యవేక్షణలో మైలవరం సీఐ కె.కిషోర్ బాబు,ఎస్ఐ లుకె.సుధాకర్, పి.గిరిసాయి మరియు పోలీసు సిబ్బంది సమన్వయంతో రెండు తెలుగు రాష్ట్రాల్లో ఏటీఎం కార్డు స్వైపింగ్ మోసాలకు పాల్పడుతున్న కఠిన నేరస్తుడిని సాంకేతిక ఆధారాలు,సీసీటివి-360 విశ్లేషణ సహాయంతో గుర్తించి అరెస్ట్ చేశారు.స్థానిక ఎస్ఐ కె.సుధాకర్ తెలిపిన వివరాల ప్రకారం తెలంగాణ రాష్ట్రం, భూపాలపల్లి జిల్లా,ఘనపూర్ మండలం ఘనపూర్ గ్రామానికి చెందిన బాణాల ప్రశాంత్‌ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో మొత్తం 27 ఏటీఎం కార్డు స్వైపింగ్ మోసాలకు పాల్పడినట్లు దర్యాప్తులో వెల్లడైంది.గతంలో ఇదే తరహా నేరాలకు పాల్పడినందుకు పీడీ యాక్ట్ కింద ఒక సంవత్సరం జైలు శిక్ష అనుభవించాడు.ఇటీవల జైలు నుంచి విడుదలైన తర్వాత కూడా తిరిగి అదే తరహా నేరాలకు పాల్పడుతున్నట్లు పోలీసులు గుర్తించారు.నగదు డ్రా చేసేందుకు ఏటీఎం కేంద్రాలకు వచ్చిన వృద్ధులు, మహిళలు, నిరక్షరాస్యులు అలాగే ఏటీఎం వినియోగంలో అనుభవం లేని వ్యక్తులను లక్ష్యంగా చేసుకునే వాడు.వారికి సహాయం చేస్తున్నట్లు నమ్మించి ఏటీఎం కార్డు, పిన్ నంబర్ తెలుసుకునేవాడు.చాకచక్యంగా అసలు ఏటీఎం కార్డును మార్చి మరో కార్డు ఇచ్చేవాడు.బాధితులు విషయం గుర్తించేలోపే వారి ఖాతాల నుంచి వివిధ ఏటీఎం కేంద్రాల్లో అక్రమంగా నగదు డ్రా చేసి లాభపడేవా డు.ఇతర జిల్లాలు, ఇతర రాష్ట్రాల్లో నమోదైన ఇలాంటి కేసులతో సంబంధాలు ఉన్నాయా అనే కోణంలో విచారణ కొనసాగుతోందని,నిందితుడి నెట్‌వర్క్, సహచరులు మరియు నేరపద్ధతిపై లోతైన దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సుధాకర్ వెల్లడించారు.స్వాధీనం చేసుకున్న వస్తువులునిందితుడి వద్ద నుంచి ఏటీఎం కార్డులు,మొబైల్ ఫోన్లు,నగదు,అనుమానాస్పద పత్రాలు,ఇతర కీలక ఆధారాలను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు.

**ఏటీఎం వద్ద అపరిచితుల సహాయం తీసుకోవద్దు:** ప్రజలు తమ ఏటీఎం, పిన్,ఓటిపి బ్యాంకు ఖాతా వివరాలను ఎవరికీ తెలియజేయెద్దని ఎస్ఐ సుధాకర్ తెలిపారు.అనుమానాస్పద లావాదేవీలు జరిగిన వెంటనే సంబంధిత బ్యాంకును సంప్రదించి కార్డును బ్లాక్ చేయించాలని,వెంటనే 1930 సైబర్ హెల్ప్‌లైన్ కు ఫోన్ చేసి లేదా సమీప పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలన్నారు.

# ఫేస్ టు ఫేస్ విత్ డీజి కార్యక్రమానికి హాజరైన లయన్స్ పెద్దలు

**విస్సన్నపేట జూలై 22: :(వార్తా ప్రభ ప్రతినిధి)** స్థానిక లయన్స్ క్లబ్ నందు ఫేస్ టు ఫేస్ విత్ డిస్టిక్ గవర్నర్ లయన్ ఎన్ వి వి ఎస్ వి ప్రసాద్ ఆత్మీయ సమావేశంలో విస్సన్నపేట లయన్స్ ప్రముఖులు పాల్గొన్నారు. క్లబ్బు పరిపాలన , సేవా కార్యక్రమాలు, సభ్యత్వ వృద్ధి, న్యాయకత్వ వికాసం, క్లబ్బు భవిష్యత్తు కార్యాచరణ తదితర అంశాలపై చర్చించారు.నూతనంగా ఎన్నికైన ఆయనను లయన్స్ పెద్దలు డాక్టర్ ఎన్ టి వెంకటేశ్వరరావు, సీనియర్ లాయర్ లయన్ కే ముత్య ప్రసాద్, జోన్ చైర్ పర్సన్ లయన్ డాక్టర్ వీర్ల కిరణ్, క్లబ్ అధ్యక్షులు లయన్ డాక్టర్ ఎం శ్రీనివాసరావు, కార్యదర్శి సి జే డబ్ల్యు కే (జాన్ )బాబు, కోశాధికారి జువ్వా అప్పారావు వెంకటరెడ్డి, నెక్కలపు సుబ్బారావు, నందమూరి శ్రీరామచంద్ర, మహేష్, నరసింహారావు తదితరులు డిస్టిక్ గవర్నర్ కు శుభాకాంక్షలు తెలియజేశారు

# కోడూరులో ఘనంగా సింహాద్రి రమేష్ బాబు జన్మదిన వేడుకలు

**కోడూరు, జూలై 22: :(వార్తా ప్రభ ప్రతినిధి)** వైఎస్ఆర్సిపి సమన్వయకర్త, మాజీ శాసనసభ్యులు సింహాద్రి రమేష్ బాబు జన్మదిన వేడుకలను కోడూరులో వైఎస్ఆర్సిపి శ్రేణులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కోడూరు ప్రధాన సెంటర్‌లో జన్మదిన కేకును కట్ చేసి సింహాద్రి రమేష్ బాబుకు పార్టీ నాయకులు, కార్యకర్తలు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం బాణాసంచా కాల్చి సంబరాలు జరుపుతూ, ప్రజలకు స్వీట్లు పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్సిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని రమేష్ బాబుకు దీర్ఘాయుష్షు, ఆయురారోగ్యాలు కలగాలని ఆకాంక్షించారు. జన్మదిన వేడుకలు ఉత్సాహభరిత వాతావరణంలో నిర్వహించబడ్డాయి.

# స్త్రీ నిధి రుణాల రికవరీకి ప్రత్యేక కార్యాచరణతో ముందుకు సాగాలి

**: జిల్లా కలెక్టర్ అంకిత్**

**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా జూలై 22: :(వార్తా ప్రభ ప్రతినిధి)** ఐడిఓసి కార్యాలయం,జిల్లాలో స్త్రీ నిధి రుణాల రికవరీని యుద్ధ ప్రాతిపదికన చేపట్టి, వచ్చే రెండు నెలల్లో కనీసం 60 శాతం రికవరీ సాధించేలా ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక రూపొందించి అమలు చేయాలని జిల్లా కలెక్టర్ అంకిత్ అధికారులను ఆదేశించారు.బుధవారం ఐడిఓసీ కార్యాలయం సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించిన జిల్లా స్థాయి స్త్రీ నిధి సమీక్ష కమిటీ సమావేశంలో స్త్రీ నిధి డిప్యూటీ జనరల్ మేనేజర్ శ్రీకాంత్, జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ (డీఆర్‌డీఏ) ప్రాజెక్టు డైరెక్టర్ విద్యాచందనతో కలిసి జిల్లాలో స్త్రీ నిధి రుణాల రికవరీ, పెండింగ్ బకాయిలు, మండలాల వారీ పురోగతి, భవిష్యత్ కార్యాచరణపై సమగ్రంగా సమీక్ష నిర్వహించారు.సమావేశంలో రికవరీ శాతం తక్కువగా ఉన్న మండలాల ఏపీఎంలు, మండల సమాఖ్య అధ్యక్షులను జిల్లా కలెక్టర్ నేరుగా కారణాలు అడిగి తెలుసుకున్నారు. రికవరీలో వెనుకబడడానికి దారితీసిన అంశాలను విశ్లేషించి, ఆయా మండలాలకు ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక రూపొందించి క్షేత్రస్థాయిలో అమలు చేయాలని ఆదేశించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ జిల్లాలో స్త్రీ నిధి రుణాల రికవరీ ఆశించిన స్థాయిలో లేదని, మండల స్థాయిలో పెండింగ్ బకాయిలు అధికంగా ఉన్నాయని అన్నారు. గత నాలుగు సంవత్సరాలుగా జిల్లాలో స్త్రీ నిధి రుణాల రికవరీ శాతం కేవలం 13.5 శాతం మాత్రమే ఉండగా, రాష్ట్రంలో జిల్లా 31వ స్థానంలో ఉండటం ఆందోళనకరమని పేర్కొన్నారు. ఈ పరిస్థితిని మార్చేందుకు అధికారులు బాధ్యతాయుతంగా పనిచేసి రికవరీ పెంపుపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు.జిల్లా వ్యాప్తంగా 239 వీవోల వద్ద సున్నా కలెక్షన్లు నమోదయ్యాయని తెలిపారు. ముఖ్యంగా భద్రాచలం, పాల్వంచ, ఇల్లందు, అశ్వరావుపేట ప్రాంతాల్లో రికవరీ శాతం తక్కువగా ఉందని పేర్కొంటూ, ఈ ప్రాంతాల్లో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి ఇంటింటికీ వెళ్లి రుణ గ్రహీతలను కలిసి అవగాహన కల్పించాలని ఆదేశించారు. బకాయిలు ఉన్న ప్రతి మహిళా సంఘాన్ని గుర్తించి, రుణాల చెల్లింపుపై సభ్యులకు అవగాహన కల్పిస్తూ వసూళ్లను వేగవంతం చేయాలని సూచించారు.వచ్చే రెండు నెలల్లో కనీసం 60 శాతం రికవరీ సాధించేందుకు ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక అమలు చేయాలని, ప్రతి రోజు ఏపీఎంలు, మండల సమాఖ్య అధ్యక్షులు రికవరీ పురోగతిపై నివేదికలను సమర్పించాలని ఆదేశించారు. మండల స్థాయిలో రోజువారీ సమీక్షలు నిర్వహించి లక్ష్య సాధనకు చర్యలు తీసుకోవాలని, మెరుగైన పనితీరు కనబరిచిన మండలాలను అభినందిస్తామని, నిర్లక్ష్యం ప్రదర్శించిన వారిపై బాధ్యత నిర్ధారణ చేస్తామని స్పష్టం చేశారు.ఈ సందర్భంగా స్త్రీ నిధి డిప్యూటీ జనరల్ మేనేజర్ శ్రీకాంత్ మాట్లాడుతూ, స్త్రీ నిధి రుణాల రికవరీ పెంపు ప్రతి ఒక్కరి బాధ్యతగా భావించి అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని సూచించారు. మండలాల వారీగా ప్రత్యేక రికవరీ ప్రణాళిక రూపొందించి, వీవోలు, ఏపీఎంలు, మండల సమాఖ్యలు ప్రతిరోజూ రికవరీ కార్యక్రమాలు నిర్వహించాలని అన్నారు. బకాయిలు ఉన్న స్వయం సహాయక సంఘాల సభ్యులను వ్యక్తిగతంగా కలిసి రుణాల చెల్లింపుపై అవగాహన కల్పించాలని, అవసరమైతే ప్రత్యేక గ్రామసభలు నిర్వహించాలని సూచించారు.సకాలంలో రుణాలు చెల్లించే సంఘాలను ప్రోత్సహించడంతో పాటు, జాప్యం చేస్తున్న సంఘాలకు ప్రత్యేక కౌన్సెలింగ్ నిర్వహించాలని తెలిపారు. రికవరీలో వెనుకబడిన మండలాలపై నిరంతర పర్యవేక్షణ కొనసాగిస్తూ రోజువారీ పురోగతిని సమీక్షిస్తామని చెప్పారు. సకాలంలో రుణాల చెల్లింపు వల్ల మహిళా సంఘాల ఆర్థిక విశ్వసనీయత పెరిగి, భవిష్యత్తులో అధిక మొత్తంలో రుణాలు పొందే అవకాశం ఉంటుందని వివరించారు.అనంతరం జిల్లాలో నిర్మాణంలో ఉన్న వీవో భవనాల పురోగతి, సోలార్ పవర్ ప్లాంట్ల ఏర్పాటు, మహిళా సంఘాల ఆధ్వర్యంలో పెట్రోల్ బంకుల స్థాపనకు సంబంధించిన అంశాలపై జిల్లా కలెక్టర్ సమీక్ష నిర్వహించి సంబంధిత అధికారుల నుంచి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ పనులను నిర్ణీత గడువులో పూర్తి చేసి మహిళా సంఘాలకు మరింత ఆదాయ వనరులు కల్పించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.ఈ సమావేశంలో లీడ్ బ్యాంకు మేనేజర్ రామిరెడ్డి, డిపిఓ అనూష, అడిషనల్ డిఆర్డిఏ నీలేష్,సంబంధిత అధికారులు, ఏపీఎంలు, మండల సమాఖ్య అధ్యక్షులు, వీవోలు తదితరులు పాల్గొన్నారు.

# ఆటో డ్రైవర్లుతో సీఐటీయూ ప్రత్యేక సమావేశం

**ఏఎస్ పేట జూలై 21 (వార్తాప్రభ)** మండలానికి చెందిన పలువురు ఆటో డ్రైవర్లు బుధవారం సిపిఎం అనుబంధ కార్మిక సంఘమైన సీఐటీయూలో చేరారు.ఈ సందర్భంగా సిఐటియు నాయకులు ఏఎస్ పేటలోని బీరా పేరు వద్దగల ప్లాట్ లలో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు.ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా జిల్లా సిఐటియు కార్యదర్శి రాజా జిల్లా రైతు సంఘ నాయకులు లక్ష్మీపతి పాల్గొన్నారు.వీరి సమక్షంలో మండలానికి చెందిన పలువురు ఆటో డ్రైవర్లు సిఐటియు లో చేరారు. అనంతరం వారు మాట్లాడుతూ కార్మికులందరూ ఒక యూనియన్ గా ఉంటే తమ సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించుకోవడానికి ఒక వేదికగా ఉంటుందన్నారు. సీఐటీయూ కార్మికుల సమస్యల పట్ల నిరంతరం పోరాటం చేస్తూ ఉంటుందని ఆటో డ్రైవర్లు సిఐటియు లో చేరడం శుభ పరిణామం అన్నారు.త్వరలో వీరితో కొత్త సిఐటియు యూనియన్ ఏర్పాటు చేయనున్నట్లు వారు తెలిపారు. ముఖ్యంగా ఏఎస్ పేట ఆటో డ్రైవర్లకు స్టాండ్లు వారి సమస్యలపై చర్చించారు.ఈ కార్యక్రమంలో మండల సిఐటియు కార్యదర్శి గయాజ్ మండల రైతు సంఘ కార్యదర్శి దిలియా

# కాంగ్రెస్ పార్టీ ఆఫీస్ పై బిజెపి మూకల దాడిని ఖండిస్తున్నాం

## –సిపిఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య

**విజయవాడ,జూలై 22 (వార్తాప్రభ) :** విజయవాడలో కాంగ్రెస్ పార్టీ కార్యాలయంపై బిజెపి మూకల దాడిని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య తీవ్రంగా ఖండించారు. ఈ మేరకు ఈశ్వరయ్య నేడు ఒక ప్రకటన విడుదల చేశారు. రాహుల్, ప్రియాంక గాంధీ అరెస్టులకు నిరసనగా జరుగుతున్న కాంగ్రెస్ పార్టీ ర్యాలీపై బిజెపి ఘర్షణకు దిగటం దుర్మార్గం. విజయవాడలో కాంగ్రెస్ పార్టీ కార్యాలయం పై బిజెపి మూకలు దాడులకు తెగబడటం దుర్మార్గం. నరేంద్ర మోడీ దేశ ప్రధానిగా ఒక బాధ్యతాయుత స్థానంలో ఉన్నారనే విషయాన్ని విస్మరించి, కేవలం బిజెపి నేతగానే బిజెపి శ్రేణులు చూడటం అవివేకం. కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక, అనాలోచిత విధానాలను ప్రశ్నించిన, విమర్శించిన వారిపై బిజెపి కుయుక్తులు పన్నుతూ దాడులు బెదిరింపులకు, పాల్పడుతోంది. పోలీసులచే అక్రమ కేసులు బనాయించి జైళ్లకు పంపుతోంది. విజయవాడలో బిజెపి మూకల దాడులను తీవ్రంగా ఖండిస్తున్నాం. బిజెపి దాడుల వెనక రాష్ట్ర ప్రభుత్వం సహకారం ఉండిఉంటుందన్న పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం వత్తాసు లేకుండా ఏపీలో బిజెపి దాడులకు తెగబడే సాహసం చేయలేదనే ఆరోపణలు వెల్లువెత్తు తున్నాయి. ప్రజాస్వామ్యంలో భౌతిక దాడులు, ఉన్మాద చర్యలు అత్యంత హేయం. కాంగ్రెస్ పార్టీ కార్యాలయంపై, ర్యాలీపై దాడులకు తెగబడిన బిజెపి మూకలను తక్షణమే అరెస్ట్ చేయాలని, ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని డిమాండ్ చేస్తున్నాం. ప్రజాతంత్ర వాదులంతా బిజెపి దుర్మార్గ చర్యలను ఖండించాలని కోరుతున్నామని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి.గుజ్జుల ఈశ్వరయ్య, పేర్కొన్నారు.

# నమ్మకమైన భరోసా అభ్యర్థుల గెలుపుకు పరమపద సోపానాలు

**విన్నన్నపేట,జూలై 22 (వార్తాప్రభ) :** మంచితనం విలువలు విశ్వసనీయత మాట ఇస్తే నిలుపుకోవడం పైవన్నీ ప్రామాణికాలుగా రాజకీయాలకతీతంగా గ్రామీణ ప్రాంతాలలో గ్రామ సర్పంచులను వార్డ్ మెంబర్లను ఎంపీటీసీలను ఎన్నుకోవడం జరుగుతుంది అని సర్వత్రా వినిపిస్తుంది. ఏదో ఒక రాజకీయ పార్టీకి అనుబంధంగా అభ్యర్థులు ఉన్న వార్డులలో నెంబర్ గా ప్రాతినిధ్యం వహించే అభ్యర్థి పరిచయాల వల్ల వ్యక్తిగతంగా పోల్ అయ్యేఓట్లు ఎక్కువ శాతం ఉంటాయని రాజకీయ మేధావులు అనుకుంటున్నారు. గతంలో జరిగిన సరిహద్దు తగాదాలు టీ కప్పులో తుఫాను వంటి సంఘటనలు తదితరాలన్నీ స్థానిక సంస్థల ఎన్నికలలో కౌంటవుతాయని సర్వసాధారణంగా గ్రామీణ ప్రాంతాలలో ఊరి పెద్దలు చేసే పంచాయతీల వలన ఓటు బ్యాంకు వారి చేతుల్లో కొంత శాతం ఉంటుందని తెలుస్తోంది. ఇలాంటి విషయాలను దృష్టిలో ఉంచుకొని గ్రామీణ ప్రాంతాలలో జరిగే పంచాయతీలలో ఇరువర్గాలను కుడి ఎడమ కళ్ళుగా భావించి అతిగా ఎవరికీ నష్టం జరగకుండా న్యాయపరంగా తీర్పులు ఇవ్వడం జరుగుతుందని పలువురు మాట్లాడుకుంటున్నారు. కొన్ని ప్రాంతాలలో ఎన్నికల సమయంలో తప్ప మిగిలిన రోజులలో ఒకే కుటుంబంలో కుల మత రాజకీయాలకు అతీతంగా కలిసిమెలిసి ఉండటం జరుగుతూ ఉంటుంది. భరోసా ఇచ్చే నాయకుడినే ప్రజలు నమ్ముతారనే నానుడే సుదీర్ఘకాలంగా సాక్ష్యంగా ఉన్నది. ఇప్పటికే ఒక రాజకీయ పార్టీ అభ్యర్థులను ఎన్నిక చేసేందుకు పథక రచన చేస్తున్నట్లు విశ్వాసనీయ వర్గ సమాచారం అందుతుంది.

# గవర్నర్ కోటా ఎమ్మెల్సీ అవకాశం కల్పించండి..

## –కొత్త నాగేంద్రకుమార్

**విజయవాడ,జూలై 22 (వార్తాప్రభ) :** టీడీపీ జాతీయ అధ్యక్షులు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుని బుధవారం నాడు ముఖ్యమంత్రి కార్యాలయం లో కలిసి గవర్నర్ కోటాలో శాసనమండలి సభ్యునిగా లేదా కైకలూరు నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ ఇన్చార్జిగా అవకాశం కల్పించమని కొత్త నాగేంద్రబాబు కోరారు. తెలుగు విద్యార్థి నుండి తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి వరకు పార్టీకి అంకితభావంతో పనిచేశానని తెలుగుదేశం పార్టీలో సుదీర్ఘకాలంగా కాపు సామాజిక వర్గ నేతగా పనిచేస్తూ రాష్ట్రవ్యాప్తంగా గుర్తింపు పొందానని వివరించారు.ప్రస్తుత ఏలూరు జిల్లా పూర్వపు కృష్ణాజిల్లాలో ఎలాంటి రాజకీయ వారసత్వం లేకుండా పూర్తి కాలం పార్టీ కోసం అంకితం అంకితభావంతో పనిచేస్తూ ఎదిగిన కాపు నాయకుడిగా గుర్తింపు తెచ్చుకున్నానన్నారు.టీడీపీ లో గత 35 సంవత్సరాలుగా అప్పగించిన ఏ బాధ్యత నైనా సమర్థవంతంగా నిర్వహించి పార్టీలో మంచి పేరు తెప్పించుకున్నాను అన్నారు. నా రాజకీయ ప్రస్థానం ఉమ్మడి కృష్ణా జిల్లా తెలుగు యువత కార్యాలయ కార్యదర్శిగా ఉమ్మడి కృష్ణా జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయ కార్యదర్శిగా 2014– 2019 మధ్యలో కృష్ణా జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ చైర్మన్ గా టీడీపీ రాష్ట్ర కార్యదర్శిగా ఉండి నియోజకవర్గం రాష్ట్ర పార్టీ పరిశీలకునిగా ఇప్పటివరకు పార్టీకి సేవలు అందించానన్నారు. 2009 నుండి 2014 వరకు పత్రిక ఎన్నికల్లో మున్సిపల్ మండల జడ్పీ ఎన్నికల్లో జిల్లా పార్టీ ఎలక్షన్ మానిటరింగ్ సేల్ సభ్యునిగా బాధ్యతలు సమర్థవంతంగా నిర్వహించానని చెప్పారు. పార్టీ ప్రచార కార్యదర్శిగా కైకలూరు నియోజవర్గ టీడీపీ ప్రచార కార్యదర్శిగా 2019 సార్వత్రిక ఎన్నికల్లో పెడన నియోజవర్గం పరిశీలకునిగా నూజీవీడు ఆకివీడు మున్సిపల్ తిరుపతి పార్లమెంటు ఉప ఎన్నికల్లో శ్రీకాళహస్తి పరిశీలకునిగా సమర్థవంతంగా నాకు అప్పగించిన బాధ్యతలు నిర్వర్తించానని తెలిపారు. పార్టీ పరిశీలకుని గా పనిచేసే సమయంలో రాష్ట్రవ్యాప్తంగా 45 నియోజకవర్గాల్లో నాయకులతో కార్యకర్తలతో విజయ వంతంగా సమన్వయంగా పనిచేసుకునే అనుభవం కూటమి పార్టీల పొత్తు కాలంలో పార్టీ తీసుకున్న నిర్ణయాన్ని శిరసావహించి గౌరవించే పార్టీ విధేయుడిగా నాకు అవకాశం కల్పించమని కోరగా ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందిస్తూ... నా అభ్యర్థనను తప్పక పరిశీలిస్తానని హామీ ఇచ్చారు.

# ఘనంగా జాతీయ జెండా స్వీకరణ దినోత్సవం

### ● కె.వి.ఆర్ జూనియర్ అండ్ ఒకేషనల్ కాలేజీ కరస్పాండెంట్ కె.వి.ఆర్

**విన్నన్నపేట,జూలై 22 (వార్తాప్రభ) :** స్థానిక మండల కేంద్రంలో కె.వి.ఆర్ జూనియర్ అండ్ ఒకేషనల్ కాలేజ్ కరెస్పాండెంట్ కే వెంకటేశ్వరరావు( కె.వి.ఆర్ ) జాతీయ జెండా స్వీకరణ దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థిని విద్యార్థులు ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ ప్రతి ఏటా జులై 22వ తేదీన మన భారతావని జాతీయ జెండా స్వీకరణ దినోత్సవం జరుపుకోవడం జరుగుతుందని తెలియజేశారు. 19 47 ఆగస్టు 15వ తేదీ దేశానికి స్వతంత్రం రాకముందు జూలై 22న భారత రాజ్యాంగ పరిషత్తు మన త్రివర్ణ పతాకాన్ని అధికారిక జాతీయ జెండాగా ఆమోదించిందని ఆయన చెప్పారు. భారత స్వాతంత్ర సమరయోధుడు పింగళి వెంకయ్య మన జాతీయ జెండాను రూపకల్పన చేశారని జెండాలోని కాషాయం త్యాగానికి తెలుపు శాంతికి ఆకుపచ్చ శ్రేయస్సుకు ప్రతీక గా నిలుస్తాయన్నారు. జాతీయ జెండా మధ్యలో ఉండే అశోక చక్రం ధర్మాన్ని నిరంతర ప్రగతిని సూచిస్తుందని ఆయన చెప్పారు. భారత స్వాతంత్ర సంగ్రామ పరిణామ క్రమంలో జాతీయ జెండా కేవలం ఒక వస్త్ర భాగానికి పరిమితం కాలేదని కోట్లాదిమంది భారతీయులను బ్రిటిష్ అవినీతి నెట్వర్క్ లపై ఐక్యంగా పోరాడేలా నడిపించిన ఒక శక్తివంతమైన ఆత్మవిశ్వాస చిహ్నం అని తెలియజేశారు. 19 47 ఆగస్టు 15న మన దేశానికి స్వాతంత్ర్యం రావడం జరిగిందని సరిగ్గా 24 రోజుల ముందు జులై 22వ తేదీన రాజ్యాంగ నిర్దేశిత సభలో మన జాతీయ పతాకాన్ని అధికారికంగా స్వీకరించడం జరిగిందన్నారు. భారతీయ సారభౌమాధికారాన్ని త్రివర్ణ పతాకం అన్ని ప్రభుత్వ ప్రైవేటు కార్యాలయాలలో విద్యాసంస్థలలో రెపరెపలాడుతూ మనలో దేశభక్తిని పెంపొందిస్తుంది అన్నారు. అనంతరం విద్యార్థిని విద్యార్థులకు స్వీట్స్ పంపిణీ చేశారు.

# లీసర్వే ప్రక్రియ ను సజావుగా నిర్వహించాలి - జాయింట్ కలెక్టర్ ఇలక్కియా

**జి.కొండూరు,జూలై 22 (వార్తాప్రభ) :** రీసర్వే ప్రక్రియ ను సజావుగా నిర్వహించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ జాయింట్ కలెక్టర్ ఇలక్కియా రీ సర్వే సిబ్బందిని ఆదేశించారు. బుధవారం జి.కొండూరు మండలం లోని కొండూరు,చెవుటూరు, హెచ్.ముత్యాలం పాడు గ్రామాలలో జాయింట్ కలెక్టర్ పర్యటి ంచి భూముల రీసర్వే ప్రక్రియను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పనులు ఏ మేరకు జరుగు తున్నాయో స్థానిక రెవిన్యూ అధికారులను అడిగి తెలుసుకు న్నారు. ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా కచ్చితమైన రికార్డులు అందించేందుకు అధికారులు,సిబ్బంది కృషి చేయాలని ఆదేశించారురీ సర్వే లో భూ హక్కు దారులకు ఈకెవైసి చేయాలన్నారు. గ్రామంలోని ప్రతి రైతుకు వారి పొలాల సర్వే నిర్వహణ విషయాన్ని తప్పనిసరిగా తెలియచేయాలన్నా రు.గ్రామంలో జరిగే రీసర్వే వివరాలను ఎప్పటి కప్పుడు రైతులకు తెలియజేయాలని సిబ్బందికి సూచించారు. రీసర్వే చేయడం ద్వారా రైతులకు ఏవిధమైన కచ్చితమైన కొలతలతో మ–ున్ముందు రికార్డులు అందుబాటులోకి వస్తాయో జాయింట్ కలెక్టర్ రైతులకు వివరించారు. హెచ్.ముత్యాలం పాడు గ్రామంలో నిర్వహిస్తున్న డ్రాఫ్ట్ పాస్ పుస్తకాల పంపిణీ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఇలాక్కియా పాల్గొన్నారు.

**రైతులకు ఎరువులు సక్రమంగా అందించాలి:** చెవుటూరు పిఏసిఎస్ ను సందర్శించిన కలెక్టర్ ఇలాక్కియా రైతులకు సక్రమంగా ఎరువు లు అందించాలని సోసైటీ సిబ్బందికి సూచించా రు.ఏపి ఏఐఎంఎస్ యాప్ ద్వారా మాత్రమే ఎరువులు విక్రాయించాలని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ వెంట స్థానిక తహశీల్దార్ రిబ్కా రాణి డిప్యూటీ తహశీల్దార్ ఎం.విజయ్ కుమార్,రీ సర్వే డిప్యూటీ తాసిల్దార్ షేక్ షీమా బేగం,మండల సర్వేయర్ అంకారావు, మండల రెవెన్యూ ఇన్స్పెక్టర్ మణిందర్ సింగ్, మండల వ్యవసాయ అధికారి కె.సిహెచ్.నూరి బాబు,పిఏసిఎస్ సెక్రటరీ కె.అరవింద్,వీఆర్వో లు పి.కృపారావు,అనూష, విజయుడు, తదితరులు ఉన్నారు.

# మెదడును కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత - డాక్టర్ కృష్ణ హాస్కర్

### ● ప్రపంచ బ్రెయిన్ డే సందర్భంగా మెడికవర్ హాస్పిటల్ కాకినాడ ఆధ్వర్యంలో పోస్టర్ విడుదల

**అమలాపురం,జూలై 22 (వార్తాప్రభ) :** ప్రపంచ బ్రెయిన్ డే సందర్భంగా మెడికవర్ హాస్పిటల్, కాకినాడ ఆధ్వర్యంలో అమలాపురం ప్రెస్ క్లబ్‌లో మీడియా సమావేశం నిర్వహించి మెదడు ఆరోగ్యం, బ్రెయిన్ సంబంధిత వ్యాధులు, రోడ్డు భద్రతపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ప్రముఖ న్యూరో ఫిజిషియన్, ఇంటర్వెన్షనల్ న్యూరాలజిస్టు డా. కృష్ణ హాస్కర్ మాట్లాడుతూ, మన శరీరాన్ని నియంత్రించే ప్రధాన అవయవం మెదడు. మెదడు ఆరోగ్యాన్ని కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత. అధిక రక్తపోటు, మధుమేహం, కొలెస్ట్రాల్, ధూమపానం, మద్యపానం, అధిక ఒత్తిడి, నిద్రలేమి, వ్యాయామం లేకపోవడం వంటి కారణాల వల్ల బ్రెయిన్ స్ట్రోక్, ఇతర న్యూరోలాజికల్ సమస్యలు పెరుగుతున్నాయి. ముఖం ఒకవైపు వంగిపోవడం, చేతులు లేదా కాళ్లు బలహీనపడటం, మాట తడబడటం వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే ఆసుపత్రికి చేరుకోవాలి. సమయానికి చికిత్స అందిస్తే బ్రెయిన్ స్ట్రోక్ వల్ల కలిగే శాశ్వత వైకల్యాన్ని నివారించే అవకాశం ఉంటుందని తెలిపారు.అనంతరం ప్రముఖ న్యూరో సర్జన్ డా. చందు లింగోలు మాట్లాడుతూ, యువతలో రోడ్డు ప్రమాదాల కారణంగా తలకు తీవ్ర గాయాలు పెరుగుతున్నాయి. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా నాణ్యమైన హెల్మెట్ ధరించాలి. కారులో ప్రయాణించే ప్రతి ఒక్కరూ సీటు బెల్టు వినియోగించాలి. రోడ్డు భద్రతా నియమాలను పాటించడం ద్వారా అనేక ప్రమాదాలను నివారించవచ్చు. ప్రమాదాల వల్ల కలిగే మెదడు గాయాలు జీవితాంతం ఇబ్బందులకు దారితీయవచ్చు అని హెచ్చరించారు. బ్రెయిన్ ట్యూమర్ గురించి వివరిస్తూ, తరచూ తీవ్రమైన తలనొప్పి,వాంతులు, చూపు మందగించడం, మూర్ఛలు రావడం, శరీర భాగాల్లో బలహీనత వంటి లక్షణాలను నిర్లక్ష్యం చేయరాదని చెప్పారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో బ్రెయిన్ ట్యూమర్లను ప్రారంభ దశలోనే గుర్తించి విజయవంతంగా చికిత్స చేయవచ్చని తెలిపారు. ప్రజలు ఆరోగ్యంపై అవగాహనతో ఉండి, లక్షణాలు కనిపించిన వెంటనే న్యూరో నిపుణులను సంప్రదించాలని సూచించారు. మెడికవర్ హాస్పిటల్ కాకినాడ సెంటర్ హెడ్ ఎన్. అంజిబాబు మాట్లాడుతూ, ప్రపంచ బ్రెయిన్ డే ముఖ్య ఉద్దేశం ప్రజల్లో మెదడు ఆరోగ్యంపై అవగాహన పెంపొందించడమేనని అన్నారు. మెడికవర్ హాస్పిటల్‌లో ఆధునిక వైద్య సదుపాయాలు, అత్యాధునిక స్కానింగ్ పరికరాలు, అనుభవజ్ఞులైన న్యూరో ఫిజిషియన్లు, న్యూరో సర్జన్లతో 24 గంటల అత్యవసర సేవలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. బ్రెయిన్ స్ట్రోక్, బ్రెయిన్ ట్యూమర్, తలకు గాయాలు, ఇతర న్యూరోలాజికల్ సమస్యలకు సమగ్ర చికిత్స అందిస్తున్నామని పేర్కొన్నారు. ప్రజలు ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవాలని, క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని, రోడ్డు భద్రతా నియమాలను పాటించాలని వైద్యులు ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. బ్రెయిన్ డే సందర్భంగా ఎంఆర్ఐ, సిటి స్కానింగ్ పైన 30% రాయితీ ఇస్తూ పోస్టర్ ను విడుదల చేయడం జరిగింది. ఈ ఆఫర్ ఆగస్టు 31 వరకు అందుబాటులో ఉంటుంది అని తెలిపారు.ఈ కార్యక్రమంలో మెడికవర్ హాస్పిటల్ వైద్యులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# రక్తదానం ప్రాణదానంతో సమానం- ఇన్స్పెక్టర్ మజ్జి అప్పలనాయుడు

**కాకినాడ,జూలై 22 (వార్తాప్రభ) :** ఆదిత్య డిగ్రీ కళాశాలల జాతీయ సేవా పథకం, యూత్ రెడ్ క్రాస్ వింగ్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఏర్పాటుచేసి రక్త దానం చేసినట్లు ఆదిత్య డిగ్రీ, పీ జీ కళాశాలల అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ బి ఈ వి ఎల్ నాయుడు తెలిపారు. ఆదిత్య డిగ్రీ కళాశాలలకు చెందిన 50 మంది ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ బ్లడ్ బ్యాంకు కు రక్తదానం చేశారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన టూ టౌన్ పోలీసు స్టేషన్ సర్కిల్ ఇన్స్పెక్టర్ మజ్జి అప్పలనాయుడు రిబ్బన్ కత్తిరించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మజ్జి అప్పలనాయుడు మాట్లాడుతూ రక్తదానం చేయడానికి ముందుకు వచ్చిన విద్యార్థులను అభినందించారు. ఒక వ్యక్తి రక్తదానం వలన నలుగురి ప్రాణాలు కాపాడవచ్చు అని, అన్నిటికంటే గొప్ప దానం రక్తదానమని అన్నారు. ఆదిత్య విద్యాసంస్థలలో ఇరివిగా సేవా కార్యక్రమాలు నిర్వహించడం, ముఖ్యంగా ఈ విధమైన రక్తదాన శిబిరాలు నిర్వహించి తలసీమియాతో ఇబ్బంది పడుతున్న వారికి రక్తాన్ని అందించడం చాలా ఆనందమని అన్నారు. రక్తదానం చేయడానికి ముందుకు వచ్చిన విద్యార్థులను అభినందించారు. అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ నాయుడు మాట్లాడుతూ ఆదిత్య డిగ్రీ కళాశాలలో చదువుతోపాటు సమాజ సేవకు ప్రాధాన్యత ఇస్తామని, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు ఎప్పటికప్పుడు రక్తదానం చేస్తూ ఉంటారని అన్నారు. రక్తదానం చేస్తున్న విద్యార్థులను అభినందించారు.బ్లడ్ బ్యాంకులలో రక్త నిల్వలు తగ్గుతున్న ప్రతిసారి రక్తదాన శిబిరాలు నిర్వహిస్తూ రక్తదానం చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని నిర్వహించిన ఆదిత్య డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ బృందాన్ని రాష్ట్ర రెడ్ క్రాస్ చైర్మన్ వై డి. రామారావు,ఆదిత్య విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ నల్లమిల్లి శేషారెడ్డి,డిగ్రీ కళాశాలల సెక్రెటరీ డాక్టర్ నల్లమిల్లి సుగుణా రెడ్డి, అభినందించారు. ఈ కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ దుర్గరాజు,వైస్ ప్రిన్సిపాల్ సి.సత్యనారాయణ, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు టి. తేజేశ్వరరావు,డి. అశ్విని, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు పాల్గొన్నారు.

# టీడీపీ సీనియర్ నేత కొల్లి రాంబాబు కన్నుమూత

### ● పార్థివదేహానికి నివాళులర్పించిన ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు

### ● రాంబాబు మరణం పార్టీకి, వ్యక్తిగతంగా తీరని లోటు: యార్లగడ్డ

**గన్నవరం,జూలై 22 (వార్తాప్రభ) :** గన్నవరం నియోజకవర్గంలోని కొయ్యూరు గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు కొల్లి రాంబాబు బుధవారం అనారోగ్యంతో కన్నుమూశారు. కొంతకాలంగా అస్వస్థతతో చికిత్స పొందుతున్న ఆయన ఆరోగ్య పరిస్థితి విషమించడంతో తుదిశ్వాస విడిచారు. ఆయన మృతి పట్ల రాష్ట్ర ప్రభుత్వ విప్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు కొయ్యూరులోని రాంబాబు నివాసానికి చేరుకుని ఆయన పార్థివదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కష్టసమయంలో ధైర్యంగా ఉండాలని వారికి ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, కొల్లి రాంబాబు మరణం పార్టీకి మాత్రమే కాకుండా తనకు వ్యక్తిగతంగా కూడా తీరని లోటని ఆవేదన వ్యక్తం చేశారు. ఆయన తనకు అత్యంత ఆత్మీయుడని, పార్టీ అభివృద్ధి కోసం జీవితాంతం అంకితభావంతో పనిచేసిన నిస్వార్థ నాయకుడని కొనియాడారు. గత శాసనసభ ఎన్నికల్లో తన విజయాన్ని సొంత విజయంగా భావించి రాత్రింబవళ్లు కష్టపడ్డారని గుర్తు చేసుకున్నారు. తీవ్ర అనారోగ్యంతో ఉన్నప్పటికీ పార్టీ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటూ కార్యకర్తలకు ఎల్లప్పుడూ అండగా నిలిచారని తెలిపారు. సొంత కుటుంబ బాధ్యతల కంటే పార్టీ బలోపేతానికే ఎక్కువ ప్రాధాన్యం ఇచ్చిన క్రమశిక్షణ కలిగిన నాయకుడిగా రాంబాబు ఎప్పటికీ గుర్తుండిపోతారని అన్నారు. రాంబాబు కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేసిన ఎమ్మెల్యే, వారి కుటుంబానికి పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షిస్తూ నివాళులర్పించారు.

# ప్రజాసేవే ధ్యేయం... నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యం: ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు

**తిరువూరు,జూలై 22 (వార్తాప్రభ) :** ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా, నియోజకవర్గ సమగ్ర అభివృద్ధే ధ్యేయంగా నిరంతరం శ్రమిస్తున్న నాయకుడిగా ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు ముందుకు సాగుతున్నారు. ప్రజల కు అందుబాటులో ఉంటూ, వారి సమస్యలను స్వయంగా తెలుసుకుని సంబంధిత అధికారు లతో సమీక్షలు నిర్వహిస్తూ వేగవంతమైన పరిష్కారానికి కృషి చేస్తున్నారని స్థానికులు పేర్కొంటున్నారు.రహదారులు, తాగునీరు, విద్య, వైద్యం, వ్యవసాయం, సంక్షేమం వంటి ప్రతి రంగంలో అభివృద్ధి పనులకు ప్రాధాన్యం ఇస్తూ, ప్రజల అవసరాలకు అనుగుణంగా కార్యాచరణ కొనసాగిస్తున్నారని అంటున్నారు. గ్రామాల నుంచి పట్టణాల వరకు మౌలిక సదుపాయాల మెరుగుదలపై ప్రత్యేక దృష్టి సారిస్తూ, ప్రభుత్వ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరేలా కృషి చేస్తున్నట్లు తెలుస్తోంది. నియోజకవర్గం అభివృద్ధి చెందితేనే ప్రజల జీవన ప్రమాణాలు మెరుగు పడతాయి" అనే ఆలోచనతో నిత్యం ప్రజల మధ్య ఉంటూ, వారి విశ్వాసాన్ని నిలబెట్టుకునే దిశగా ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు పనిచేస్తున్నారని ప్రజలు అభిప్రాయపడుతున్నారు. ప్రజల ఆకాంక్షలను నెరవేర్చడమే లక్ష్యంగా అభివృద్ధి, పారదర్శక పాలన, ప్రజాసేవకు ప్రాధాన్యం ఇస్తూ ఆయన కొనసాగిస్తున్న కృషి నియోజకవర్గంలో చర్చనీయాంశంగా మారింది.

# పేద కుటుంబాల ఆర్థిక స్వావలంబనకు మెయిల్ క్రిష్ణారెడ్డి కృషి...

**గుడ్లవల్లేరు,జూలై 22 (వార్తాప్రభ) :** మండలంలోని పేద కుటుంబాల ఆర్థిక స్వావలంబనకు మేఘా ఇంజినీరింగ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్ (మెయిల్) సంస్థ అధినేత పురిటిపాటి వేంకట క్రిష్ణారెడ్డి, సుధారెడ్డి దంపతుల సేవలతో ఆర్థిక చేయూతను అందించి...వారి వారి రంగాల్లో ఆర్థికంగా తమ కాళ్లపై తాము నిలబడేందుకు వారికి వెన్నంటే ఉంటున్నారని ఆ సంస్థ పీ4 ప్రాజెక్ట్ మేనేజర్ బి.చింతయ్య, ప్రాజెక్ట్ ఆఫీసర్ పి.రఘురామ్ పేర్కొన్నారు. పీ4(పబ్లిక్-- ప్రైవేట్ -- పీపుల్ -- పార్టనర్‌షిప్) ప్రాజెక్టులో భాగంగా క్రిష్ణారెడ్డి, సుధారెడ్డి దంపతుల ఆర్థికసాయంతో మండలంలోని శేరీ కల్వపూడికి చెందిన తిరువీధుల వెంకటరమణకు రూ.57,400తో జీవనోపాధిగా కిరణా దుకాణం యూనిట్‌ను ఏపీఎంఏఎస్ ద్వారా అందజేశారు. అలాగే వేమవరానికి చెందిన మహ్మద్ మునీరునీసాకు రూ.60వేల విలువైన వాటర్ సర్వీసింగ్ యూనిట్‌ను అందించారు. అలాగే వడ్లమన్నాడు శివారు రెడ్డిపాలానికి చెందిన పామర్తి నాగ శ్రీనివాసరరావుకు గొర్రెల పెంపెకం యూనిట్ నిమిత్తం రూ.62,800ను అందజేశారు. పేద కుటుంబాలకు మెయిల్ క్రిష్ణారెడ్డి ఈ సేవలను అందించి ఆయా కుటుంబాలకు కొత్త జీవితాలను ప్రసాదిస్తున్నారని గ్రామస్తులు తెలిపారు.

# అవినీతి పుట్ట..! అక్రమాలకు అడ్డా..!

## పైసలు కొట్టు.. సర్వే నెంబర్ పట్టు

● బడాబాబులకు రహదారి... అక్రమాలకు అడ్డదారి... సామాన్యులకు నో ఎంట్రీ ● కాసులిస్తే ఏదైనా రిజిస్ట్రేషన్ ఖాయం ● ఇబ్రహీంపట్నం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంపై విమర్శల వెల్లువ

**ఇబ్రహీంపట్నం, జూలై 22 (వార్తాప్రభ) :** ఇబ్రహీంపట్నం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం అవినీతి, అక్రమాలకు అడ్డాగా మారిపోయింది. కాసులిస్తే సర్వే నెంబర్ లు మార్చి అక్రమ రిజిస్ట్రేషన్లు చేసేస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. బడాబాబులకు గ్రీన్ కార్పెట్ పరుస్తున్న కార్యాలయ అధికారులు, సిబ్బంది సామాన్యులకు మాత్రం రెడ్ సిగ్నల్ వేస్తారనే ప్రచారం జరుగుతోంది. కాసులిస్తే ప్రభుత్వ భూమిని సైతం రిజిస్ట్రేషన్ చేయగల సిద్ధహస్తులు ఇక్కడ ఉన్నారని ప్రజలు చెప్పుకుంటున్నారు. ఈ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో అవినీతి, అక్రమాలు పెచ్చుమీరిపోవడంతో గతంలో ఏసీబీ అధికారులు దాడులు చేశారు. అలాగే సిబ్బంది ఇళ్లల్లో సోదాలు చేశారు. అయినా పరిస్థితిలో ఎలాంటి మార్పు రాలేదు. యథా రాజా.. తథా ప్రజా అన్నట్లు అవినీతి, అక్రమాలు కొనసాగుతూనే ఉన్నాయి. అక్రమ సంపాదనకు అలవాటు పడిన అవినీతి సిబ్బంది అడ్డగోలుగా కాసులు పిండుకుంటున్నారు. ఈ కార్యాలయంలో అవినీతికి హద్దు లేకుండా పోయిందని... అక్రమాలకు అడ్డగా మారిందని పలువురు విమర్శిస్తున్నారు. డబ్బులిస్తే చాలు.. సర్వే నెంబర్ మార్చి అక్రమ రిజిస్ట్రేషన్లు జరపటం ఆనవాయితీగా మారింది. కొండపల్లిలో ఇలాంటి ఉదాహరణలు ఎన్నో ఉన్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇటీవల కొటికలపూడి గ్రామంలో అక్రమ రిజిస్ట్రేషన్ పై తీవ్ర విమర్శలు వచ్చాయి. నకిలీ ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ ఆధారంగా ఆస్తిని అక్రమంగా రిజిస్ట్రేషన్ చేశారు. దీనిపై బాధితురాలి ఫిర్యాదు మేరకు నకిలీ ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ ను రెవెన్యూ అధికారులు రద్దు చేశారు. అక్రమ రిజిస్ట్రేషన్ చేసిన సబ్ రిజిస్ట్రార్ పై పోలీసులు కేసు నమోదు చేశారు. అయితే అక్రమ రిజిస్ట్రేషన్ రద్దు కాలేదు. ఇలాంటివి చాలా ఉన్నాయని వాపోతున్నారు. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో కొందరి పెత్తనం ఎక్కువైందని, మొత్తం వారే నడిపిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. గతంలో ఏసీబీ అధికారులు దాడులు చేసి అప్పటి ఇన్ చార్జిని సస్పెండ్ చేసినా అధికారుల తీరు మాడటం లేదు... ఇప్పుడు అదే ఇన్ చార్జి అవినీతి అధికారి పెత్తనం చేస్తున్నాడు.. తప్పుడు రిజిస్ట్రేషన్లను రాత్రి చీకట్లో జరిపిస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. సర్వే నెంబర్లు తారుమారు చేయడం, ప్రభుత్వం ఇచ్చిన బి ఫామ్ స్థలాలను రిజిస్ట్రేషన్ చేయడంలో కొందరి బ్రోకర్లు ఆరితేరారు. రిజిస్ట్రార్ అలసత్వం వల్లే ఇవన్నీ సాధ్యమవుతున్నాయని ప్రజలు తీవ్రంగా ఆరోపిస్తున్నారు. ఇదే పరిస్థితి కొనసాగితే మరోసారి ఏసీబీ అధికారులు దాడులు చేయాల్సిన అవసరం ఉందంటున్నారు. ఇప్పటికైనా కార్యాలయం అధికారుల తీరు మారుతుందా.? లేక ఏసీబీ దాడులు చేయాల్సి వస్తుందా? వేచి చూడాల్సిందే!

# ప్రజా సంక్షేమ పాలనకోసం ప్రభుత్వంతో స్వచ్ఛంద సంస్థలు భాగస్వాములు కావాలి

● ప్రజారోగ్య పరిరక్షణకు సేవలందించే కార్యక్రమాలు అభినందనీయం

● మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాదు

**మైలవరం,జూలై 22 (వార్తాప్రభ) :** ప్రజా సంక్షేమ పాలనకోసం ప్రభుత్వం తో పాటు స్వచ్ఛంద సంస్థలు కూడా భాగస్వాము లు కావాలని మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాదు పిలుపునిచ్చారు.మైలవరం పట్టణం లోని ఎమ్మెల్యే కార్యాలయం వద్ద బొమ్మిన నారాయణ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వాటర్ ట్యాంకర్ మరియు దోమల నివారణ స్ప్రే మిషన్ ను బుధవారం ఎమ్మెల్యే కృష్ణప్రసాదు ప్రారంభించారు.ప్రజలకు అవసరమైన సేవలను అందించేందుకు సామాజిక సంస్థలు ముందుకు రావడం అభినందనీయమని అన్నారు.ట్రస్ట్ నిర్వాహకు లు భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టాలని ఆకాంక్షించారు.ప్రజల ఆరోగ్య భద్రత, పరిశుభ్రతకు సంబంధించిన కార్యక్రమా లకు తన పూర్తి సహకారం ఉంటుందని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో ట్రస్ట్ ప్రతినిధులు, స్థానిక ప్రజాప్రతినిధులు, తెలుగుదేశం పార్టీ నాయకులు, కూటమి కార్యకర్తలు, సామాజిక సేవకులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# మైలవరం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో క్యాంపస్ టూర్

**మైలవరం,జూలై 22 (వార్తాప్రభ) :** స్థానిక డాక్టర్ లకిరెడ్డి హనిమిరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో డిగ్రీ మొదటి సంవత్సరం విద్యార్థులకు బుధవారం క్యాంపస్ టూర్ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు కళాశాల ప్రిన్సిపల్ డా.సపావటు మాధవి తెలిపారు. విద్యార్థులు కళాశాలలోని ఆధునిక సైన్స్ ప్రయోగశాలలు, కేంద్ర గ్రంథాలయం (లైబ్రరీ), విశాలమైన తరగతి గదులు, జవహర్ నాలెడ్జ్ సెంటర్ (జెకెసి)ల్యాబ్, ఇన్నోవేషన్ ల్యాబ్, పరిశోధనా సౌకర్యాలను సందర్శించి వాటి వినియోగంపై అవగాహన పొందారని ప్రిన్సిపాల్ తెలియజేశారు. కళాశాలలో ప్రభుత్వం మరియు కళాశాల ఫౌండర్ డాక్టర్ లకిరెడ్డి హనిమిరెడ్డి కల్పించిన ఆధునిక విద్యా సౌకర్యాలను సమర్థవంతంగా వినియోగించుకొని విద్యార్థులు విద్యలో ప్రతిభ కనబరచాలని, కళాశాలకు మంచి పేరు ప్రతిష్టలు తీసుకురావాలని ఆమె ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో డాక్టర్ జె. రాముడు (వృక్షశాస్త్ర అధ్యాపకులు), డాక్టర్ ఎన్. వెంకటాద్రి, కె.వెంకటేశ్వరరావు, అధ్యాపకులు, డిగ్రీ మొదటి సంవత్సరం విద్యార్థులు పాల్గొన్నారు.

# ఘనంగా జాతీయ పతాక స్వీకరణ దినోత్సవం

**కృత్తివెన్ను,జూలై 22 (వార్తాప్రభ) :** జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పల్లెపాలెం నందు బుధవారం జాతీయ పతాక స్వీకరణ దినోత్సవం ఘనంగా నిర్వహించారు ఈ సందర్భంగా రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత కొప్పినీడి సూర్యప్రకాష్ పతాక ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు టీవీవీ ప్రసాదు మాట్లాడుతూ 1947 జూలై 22న భారత రాజ్యాంగ సభ త్రివర్ణ పతాకాన్ని ఆమోదించిన రోజుని విద్యార్థులకు వివరించారు. సూర్య ప్రకాష్ మాట్లాడుతూ 1947 జులై 22న డాక్టర్ బాబు రాజేంద్రప్రసాద్ నాయకత్వంలోని భారత రాజ్యాంగ సభ భారత జాతీయ జెండాను అధికారికంగా ఆమోదించిందని జేబీ కృపలాని జండా కమిటీకి నాయకత్వం వహించగా పండిట్ జవహర్లాల్ నెహ్రూ రాజ్యాంగ సభలో జెండా ఆమోదానికి తీర్మానాన్ని ప్రతిపాదించారని కాషాయం తెలుపు మరియు ఆకుపచ్చ రంగుల సమాంతర త్రివర్ణ పతాకం మధ్యలో 24 ఆకుల నేవీ బ్లూ వీల్ తో (అశోకుని ధర్మ చక్రం)ఉన్న జెండాను సభ ఏకగ్రీవంగా ఆమోదించిందని,స్వాతంత్ర పోరాట సమయంలో ఎందరో జాతీయ పతాకాలు రూపొందించినా కానీ ఆంధ్ర ప్రాంతానికి చెందిన పింగళి వెంకయ్య రూపొందించిన పతాకాన్ని జాతీయ పతాకంగా గుర్తిస్తూ విజయవాడ లో మహాత్మా గాంధీ అధ్యక్షతన జరిగిన కాంగ్రెస్ కమిటీ సమావేశంలో ఏకగ్రీవంగా నిర్ణయించారని, జాతీయ పతాకం కేవలం ఒక జాతీయ చిహ్నం మాత్రమే కాదని అది మన సార్వభౌమ త్వానికి ఐక్యతకు సమగ్రతకు మరియు ప్రజాస్వామ్య విలువలకు ప్రతీక అని భారతీయులందరూ జాతీయ జెండాను గౌరవించాలని అన్నారు .ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

# రూ.2 లక్షల జనతా ప్రమాద బీమా చెక్కు అందజేసిన డీసీసీబీ చైర్మన్ తుమ్మల రామస్వామి బాబు

**కాకినాడ రూరల్/కరప,జూలై 22 (వార్తాప్రభ) :** కాకినాడ జిల్లా, కాకినాడ రూరల్ నియోజకవర్గం, కరప మండలంలోని కరప డీసీసీ బ్యాంకు పరిధిలో ఉన్న జెడ్. భావవరం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పిఎసిఎస్) సభ్య రైతు మినవల్లి త్రిమూర్తులు 2026 ఆర్థిక సంవత్సరంలో ప్రమాదవశాత్తు మృతి చెందిన విషయం డీసీసీ బ్యాంకు దృష్టికి రావడంతో, ఆయన జనతా ప్రమాద బీమా పథకం కింద చెల్లించిన బీమా ప్రీమియం ఆధారంగా రూ.2 లక్షల బీమా క్లెయిమ్ మంజూరైంది.ఈ సందర్భంగా కాకినాడ డీసీసీ బ్యాంకు కార్యాలయంలో, కాకినాడ జిల్లా జనసేన పార్టీ అధ్యక్షులు,డీసీసీబీ చైర్మన్ తుమ్మల రామస్వామి బాబు చేతుల మీదుగా మృత రైతు నామినీకి రూ.2 లక్షల చెక్కును అందజేశారు.ఈ సందర్భంగా డీసీసీబీ చైర్మన్ తుమ్మల రామస్వామి బాబు మాట్లాడుతూ, రైతుల సంక్షేమానికి సహకార బ్యాంకులు అందిస్తున్న బీమా పథకాలను ప్రతి రైతు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.కేవలం స్వల్ప ప్రీమియంతో ఇలాంటి ప్రమాద బీమా పథకాలు రైతు కుటుంబాలకు ఆపద సమయంలో అండగా నిలుస్తాయని తెలిపారు.చెక్కు అందుకున్న మృత రైతు కుటుంబ సభ్యులు డీసీసీ బ్యాంకు యాజమాన్యానికి, డీసీసీబీ చైర్మన్ తుమ్మల రామస్వామి బాబుకి కృతజ్ఞతలు తెలిపారు. ఈ ఆర్థిక సహాయం తమ కుటుంబానికి ఎంతో ఊరటనిచ్చిందని వారు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో కరప పీఏసీఎస్ అధ్యక్షులు రెడ్డిపల్లి నారాయణరావు, జెడ్. భావవరం పీఏసీఎస్ అధ్యక్షులు గంటా వీరన్న చౌదరి తదితరులు పాల్గొన్నారు.

# సొంత ఖర్చుతో రోడ్ల పై గుంతలు పూడ్పించిన ఎస్ఐ అర్జున్

**పెనుగంచిప్రోలు,జూలై 22 (వార్తాప్రభ) :** పెనుగంచిప్రోలు నుండి జగ్గయ్యపేట వేళ్ళు ప్రధాన రహదారి నిత్యం వందలాది వాహనాల రాకపోకలతో రద్దీగా ఉంటుంది. ప్రభుత్వ ఆసుపత్రి వద్ద ఈ రహదారిపై పెద్ద పెద్ద గోతులు ఏర్పడి వాహనదారులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రయాణికుల ఇబ్బందులు గమనించిన ఎస్ఐ అర్జున్ తన సొంత ఖర్చు తో రోడ్లపై ఉన్న గుంతల్లో ట్రాక్టర్ జీ ఎస్ బీ, చిప్ పోయించి, చదును చేయించారు. దీంతో వాహనాల రాకపోకలు సజావుగా సాగుతున్నాయి. రోడ్లపై ఏర్పడిన గుంతల్లో చదును చేయించడం పై ఎస్ఐ అర్జును ని ప్రయాణికులు, స్థానికులు అభినందించారు...

# కలెక్టర్ చేతుల మీదుగా "షైనింగ్ స్టార్" అవార్డు అందుకున్న జక్కులూరి సహస్ర

**పెనుగంచిప్రోలు,జూలై 22 (వార్తాప్రభ) :** మండలంలోని అనిగండ్లపాడు గ్రామంలో ఉన్న శ్రీ చై తన్య హైస్కూల్ విద్యార్థిని జక్కులూరి సహస్ర జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా సోమవారం విజయవాడ లో "షైనింగ్ స్టార్" అవార్డు అందుకుంది. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్స్ నాగేష్, నరేష్ లు మాట్లాడుతూ పిల్లల చదువుకు పేదరికం, కుటుంభ పరిస్థితులు అడ్డు కాకూడదని అన్నారు.సహస్ర ను అభినందించిన స్కూల్స్ టీచర్స్, కుటుంబ సభ్యులు, కుటుంబాలలో పిల్లలు చిన్న చిన్న ప్రతి కూల పరస్థితులకే తొందరపాటు నిర్ణయాలు తీసుకొనే ఈ రోజుల్లో తన కుటుంబ పెద్ద దిక్కును కోల్పోయి, చదువుకోడమే భారంగా ఉన్న పరస్థితుల్లో తన వారి ప్రోత్సాహంతో ముందుకెళ్ళి, మంచి విజయాన్ని సాధించింది జక్కులూరి సహస్ర. ఈ సంవత్సరం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చదువులో ముందున్న విధ్యార్థులకు ఇచ్చిన ప్రోత్సాహలలో బాగంగా మండలంలోని అనిగండ్లపాడు శ్రీ చైతన్య హై స్కూల్ లో పదవ తరగతి చదివిన జక్కులూరి సహస్ర విజయవాడ లో కలెక్టర్ చేతుల మీదుగా షైనింగ్ స్టార్ అవార్డు అందుకుంది.సహస్ర చిన్నతనంలోనే తండ్రిని కోల్పోయి ఎంతో మానసిక ధైర్యాన్ని కోల్పోయినప్పటికిని తన కుటుంభ సభ్యులు ప్రోత్సాహంతో తిరిగి చదువును కంటిన్యూ చేసింది. ఆర్థిక భారం మూలాన చదువుకోవడమే సవాలుగా మారిన పరస్థితుల్లో ఆమె పరిస్థితిని తెలిసి, ఆమెకు అండగా స్కూల్ ప్రిన్సిపాల్స్ నగేష్, నరేష్ లు వెనకుండి అన్ని తామై ఆమెను ముందుకు నడిపారు. దీంతో ఈ సంవత్సరం తమ స్కూల్ లో 10 వ తరగతిలో స్కూల్ మొదటి ర్యాంక్ సాధించింది. అన్ని రంగాల్లో ముందుకు దూసుకెళ్తున్న మన దేశంలో గ్రామాల్లో విధ్యార్థుల చదువుకు ఆటంకంముగా ఏ ఇబ్బంది ఉండకూడదని, చదువును ధ్యేయంగా చేసుకోని ముందుకు వెళ్లాలని కోరారు. ఈ సందర్భంగా సహస్ర మాట్లాడుతూ తనను ప్రోత్సహించిన స్కూల్ యాజమాన్యానికి, టీచర్స్ కు, తన కుటుంభ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపింది. కాగా తనకున్న ప్రతి కూల పరస్థితుల్లో కూడా సహస్ర సాధించిన విజయానికి తను తెలిసిన ప్రతి ఒక్కరు ఆమెను అభినందిస్తూ తన పై తరగతులలో కూడ మరిన్ని విజయాలు అధిరోహిస్తూ ముందుకు కొనసాగాలని ఆకాంక్షించారు.

# పథకాలు సాధించిన దివ్యాంగ విద్యార్థులు

**పెడన,జూలై 22 (వార్తాప్రభ) :** రాష్ట్ర సమగ్ర శిక్ష పీఎం శ్రీ రాష్ట్ర సహిత విద్యా విభాగం సంయుక్తంగా అగిరిపల్లి మండలంలోని తోటపల్లి లో గల హీల్ పారడైజ్ పాఠశాలలో గత మూడు రోజులుగా నిర్వహిస్తున్న స్టేట్ లెవెల్ పారా స్పోర్ట్స్ మీట్ ఫర్ సి.డబ్ల్యూ.ఎస్.ఎన్ లో భాగంగా దివ్యాంగ విద్యార్థుల పలు పథకాలు సాధించి ఓవరాల్ ఛాంపియన్ షిప్ కప్ ను కృష్ణా జిల్లా వారు సాధించారు. ఈ కార్యక్రమంలో స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్ర ప్రదేశ్ మేనేజింగ్ డైరెక్టర్ భరణి సమగ్ర శిక్ష ఏ ఎస్ పీడీ రవీంద్రనాథ్ రెడ్డి ఏ పి పారా స్పోర్ట్స్ అసోసియేషన్ సెక్రటరీ వి రామస్వామి డాక్టర్ జీ లక్ష్మీ సమగ్ర శిక్ష సహిత విద్య అధికారి నరసింహ తదితరులు ద్వారా మెడల్ ను ప్రశంసా పత్రాన్ని అందుకుంటున్న పెడన మండలము దిరిశ వల్లి గ్రామానికి చెందిన ము మురాల రోహిత్శ్రీ విజయానంద కాలేజీ సీఈసీ ఫస్ట్ ఇయర్ విద్యార్థి షాట్ పుట్ సబ్ జూనియర్ బాలుర విభాగంలో తృతీయ స్థానంలో నిలిచారు. ఇతనిని జిల్లా విద్యాశాఖాధికారి యూ.వి.సుబ్బారావు సమగ్ర శిక్ష ఎడిషనల్ ప్రాజెక్టు కో ఆర్డినేటర్ కుముదిని సింగ్ జిల్లా సహిత విద్య సమన్వయకర్త కళ్యేపల్లి ఏడుకొండలు ఎం ఈ వో లు సలోమి హరనాథ్ కళాశాల ప్రిన్సిపాల్ టీ మధుసూదన రావు ఐఇ ఆర్ పి అబ్దుల్ హమీద్ తదితరులు అభినందించారు.

# ఆరోగ్యవంతమైన జీవనశైలిని ప్రతి ఒక్కరూ అలవర్చుకోవాలి

● లీ ఫౌండేషన్ ట్రస్టీ ఆళ్ల లీలారాణి ● లీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 400 మందికి ఉచిత ఆరోగ్య పరీక్షలు

**విశాఖపట్నం,జూలై 22 (వార్తాప్రభ) :** ప్రతి ఒక్కరూ ఆరోగ్యవంతమైన జీవన విధానాన్ని అలవర్చుకోవడంతో పాటు పోషకాహారం తీసుకోవడంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని లీ ఫౌండేషన్ ట్రస్టీ ఆళ్ల లీలారాణి సూచించారు. లీ ఫౌండేషన్, దువ్వాడలోని విజ్ఞాన్స్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ ఫర్ ఉమెన్ సంయుక్త ఆధ్వర్యంలో జూలై 21, 22 తేదీల్లో రెండు రోజులపాటు నిర్వహించిన ఉచిత ఎముకలు, కీళ్ల ఆరోగ్య వైద్య శిబిరంలో ఆమె మాట్లాడారు. ఈ శిబిరం ద్వారా సుమారు 400 మంది విద్యార్థినులు, కళాశాల సిబ్బంది ఉచిత వైద్య పరీక్షలు చేయించుకుని అవసరమైన మందులు పొందారు. హ్యాండ్ గ్రిప్ స్ట్రెంత్, బీఎంఐ, హిమోగ్లోబిన్, రాండమ్ బ్లడ్ షుగర్, రక్తపోటు, బోన్ మినరల్ డెన్సిటీ, బాడీ కంపోజిషన్ అనాలసిస్ వంటి కీలక పరీక్షలను నిర్వహించారు. అనంతరం నిపుణులైన వైద్యులు, పోషకాహార నిపుణులు పరీక్షల నివేదికలను విశ్లేషించి ఆహారపు అలవాట్లు, జీవనశైలి మార్పులు, ఆరోగ్య సంరక్షణపై ప్రత్యేక కౌన్సెలింగ్ అందించారు. ఆళ్ల లీలారాణి మాట్లాడుతూ యువత ఆరోగ్యంపై నిర్లక్ష్యం చేయకుండా క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవాలని, సమతుల్య ఆహారం, వ్యాయామాన్ని దైనందిన జీవితంలో భాగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డాక్టర్లు రాధిక, శైలజ, మేఘన, న్యూట్రిషనిస్టులు మాధురి, క్రాంతి, యోగా మాస్టర్ అఖిల్, లీ ఫార్మా సిబ్బంది, విజ్ఞాన్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి. అరుంధతి, హెచ్ఓడీ డాక్టర్ కె.వి. శ్రీరామ్ ప్రసాద్, హెల్త్ క్లబ్ కోఆర్డినేటర్ ఎ. ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు. విద్యార్థినుల్లో ఆరోగ్య స్పృహ పెంపొందించేందుకు ఇటువంటి శిబిరాలు ఎంతో ఉపయోగకరమని కళాశాల యాజమాన్యం, విద్యార్థినులు లీ ఫౌండేషన్ ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు.

# జి.ఓ. 396 రద్దు చేయాలని ఎమ్మెల్యే ఆనందరావు కు వినతిపత్రం అందజేసిన దస్తావేజు లేఖర్లు

**అమలాపురం,జూలై 22 (వార్తాప్రభ) :** జి.ఓ. 396 రద్దు చేయాలని, ప్రైవేటికరణను నిలుపుదల చేయాలని ఎమ్మెల్యే ఆనందరావు కు దస్తావేజు లేఖర్లు, సహాయకులు వినతిపత్రం అందజేశారు. అమలాపురం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద బుధవారం దస్తావేజు లేఖర్లు చేస్తున్న సమ్మె మూడవ రోజుకు చేరింది. ఈ సందర్భంగా లేఖర్లు ప్రభుత్వ నిర్ణయాలకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ తమ ఆందోళనను వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో అమలాపురం దస్తావేజు లేఖర్ల సంఘ అధ్యక్షులు జున్నూరి సురేష్, కన్వీనర్ మట్టపర్తి రాము, గౌరవ అధ్యక్షులు గుంటు ఫణిప్రసాద్, కార్యదర్శి పందిరి హరి, జాయింట్ సెక్రటరీ పెద్దిరెడ్డి దుర్గేష్, అలాగే వెదులపల్లి సుబ్బు, గనిశెట్టి బోగిరాజు, అడపా భూషణం, బొర్రా బుజ్జి, కడలి సత్యనారాయణ, దేగల రాజా, గోపాలం, సిరిపల్లి మూర్తి, పృథ్వి శ్రీను, గుమ్మల నరేష్, బండ్రెడ్డి రాజు, కె.వి. నాగరాజు తదితర లేఖర్లు, సహాయకులు, టైపిస్టులు మరియు సంఘ సభ్యులు పాల్గొన్నారు.

Printer Publisher and owned by V. Sree Ram Yadav. Printed at Arunodaya Notebook Mfrs Pvt Ltd #33-5-9, Papaiah Street, Seetharampuram, Vijayawada, Andhra Pradesh and Published from D.No.30-22-3/11, Beside Union Bank Of India, Kotha Vantena Road, Seetaramapuram, Vijayawada - 520004, A.P. Editor V. Sree Ram Yadav, RNI No. 12176/2004 E-mail: varthaprabhatelugudaily@gmail.com. Cell: 9347993188